ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ప్రకాశం 5
జిల్లా వార్తలు
బుధవారం 20, మార్చి 2024



సింగరాయకొండలో మంత్రి ప్రారంభించిన పార్టీ కార్యాలయంలో నిల్వ చేసిన గిఫ్ట్ బాక్స్‌లు

ఆయన రాష్ట్ర మంత్రి. రాష్ట్రానికి, జిల్లాకు, ఆయన పోటీచేసి గెలిచిన నియోజవకర్గానికి చేసిన మంచి ఏంటో తెలియదుగాని తాజాగా కొండపికి పార్టీ అధినేత ఆదేశాలతో ఇన్‌చార్జిగా వచ్చారు. సార్ వచ్చిందే తడవు.. నియోజకవర్గంలో రకరకాల విన్యాసాలు మొదలుపెట్టారు. ప్రారంభంలో పలు మండలాల్లో కార్యక్రమాల ఖర్చుల బాధ్యత అధికారులు, వ్యాపారులపై మోపారు. భారీ మొత్తంలో వసూళ్లు చేశారు. దీనిపై పెద్దఎత్తున విమర్శలు రావడంతో సొంత డబ్బులు వెదజల్లడం ప్రారంభించారు. తాయిలాల పంపిణీలో ముందున్నారు. అలాగే ప్రలోభాల పర్వం జోరుగా సాగించారు. ఆయన ఎవరో కాదు రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి, వైసీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి ఆదిమూలపు సురేష్. ఎన్నికల కోడ్ అమల్లోకి రాగానే అంతా గప్‌చుప్ అయిపోయారు. ప్రతి మండలానికి ఒక పార్టీ ఆఫీసు ప్రారంభించే పనిలో ఉన్నారు. అందులోనే అన్ని కార్యక్రమాలు కొనసాగేలా ప్రణాళిక రూపొందించారు.



ఇటీవల సింగరాయకొండలో మంత్రి ఇచ్చిన కానుకలను తీసుకెళ్తున్న వలంటీర్లు (ఫైల్)

తాయిలాల మంత్రి

- 'కోడ్' కూయకముందే అంతా పూర్తి
- అన్నివర్గాలకు ముమ్మర ప్రలోభాలు
- వలంటీర్లకు గిఫ్ట్‌లు, రూ.5వేల నగదు
- పాస్టర్లు, విలేకరులకు దుస్తులు, బహుమతులు
- ప్రెషర్ కుక్కర్లు, ప్లాస్కులు, గ్లాసులు, డిన్నర్ సెట్లు
- సిద్ధం సభకు వెళ్లినవారికి మద్యం, నగదు, బిర్యానీ
- కోడ్ అమలులోకి రావడంతో అంతా గప్‌చుప్
- విస్తుపోతున్న కొండపి నియోజకవర్గ ప్రజలు

కొండపి, మార్చి 19 : ప్రతి పని మాటున ఓటు రాబట్టుకోవడమే లక్ష్యంగా మంత్రి ఆదిమూలపు సురేష్ కొండపి నియోజకవర్గానికి ఇన్‌చార్జిగా వచ్చిన నాటి నుంచి పనిచేస్తున్నారు. దీనికోసం అన్ని వర్గాల వారిని, ప్రభుత్వ ఉద్యోగులను, విలేకరులను కూడా ప్రలోభపెట్టారు. కోడ్ కూయక ముందే అన్ని పంపిణీలు పూర్తిచేశారు. నియోజకవర్గంలోకి అడుగుపెడుతూనే పాస్టర్లతో ఆత్మీయ సమావేశం అంటూ వారికి ప్యాంటు, షర్టులు, చీరలు అందజేశారు. తర్వాత విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అంటూ కార్యక్రమం చేపట్టి ఉచితంగా ఇచ్చారు. ఆ సమావేశాల్లో విద్యార్థులకు ఇళ్ల వద్ద ఉండే పెద్దలకు చెప్పి వైసీపీకి ఓట్లేయించాలని విజ్ఞప్తి చేశారు. తర్వాత వలంటీర్ల వంతు.. నియోజవకర్గంలో 1,600 మంది వలంటీర్లు ఉంటే అందరికీ రూ.5వేల నగదు, స్వీట్లు అందజేశారు. తిరిగి వలంటీర్లకే రెండోసారి ప్రెషర్ కుక్కర్లు, డిన్నర్ సెట్‌లు, టీగ్లాసులు, ప్లాస్కులు అందజేశారు. మధ్యమధ్యలో పలు మండలాల విలేకరులను సింగరాయకొండ పిలిపించుకుని ప్యాంటు, షర్టులు, చీరలు అందజేశారు. మేదరమెట్ల సమీపంలో జరిగిన సిద్ధం సభకు వైసీపీ కార్యకర్తలను తరలించేందుకు వారికి మద్యం, బిర్యానీ, రూ.500 అందజేశారు. నియోజకవర్గం అంతటా ఇదే కార్యక్రమాన్ని మంత్రి సురేష్ కొనసాగించారు. నియోజకవర్గంలో మునుపెన్నడూ లేనివిధంగా వివిధ వర్గాల వారిని మంత్రి ప్రలోభపెట్టడాన్ని రాజకీయ పరిశీలకులు, ప్రజలు విమర్శిస్తున్నారు. ఇంతగా ప్రలోభ పెట్టే వ్యక్తి గతంలో గెలిచిన ఎర్రగొండపాలెం, సంతనూతలపాడు నియోజకవర్గాల్లో ఏమి చేశారు.. రేపు కొండపి నియోజకవర్గంలో ఏమి జరుగుతుందనేది ప్రజలు బాహాటంగానే చర్చించుకుంటున్నారు. అయితే కోడ్ అమలులోకి రావడంతో అంతా గప్‌చుప్ అయిపోయారు. ప్రతి మండలానికి ఒక పార్టీ అఫీసు ప్రారంభించే పనిలో ఉన్నారు. అందులోనే అన్ని కార్యక్రమాలు కొనసాగేలా ప్రణాళిక రూపొందించారు.



మంత్రి సురేష్‌తోపాటు వైసీపీ కండువాలు వేసుకొని నడుస్తున్న చిన్నారులు (ఫైల్)

ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా...

ఎన్నికల కమిషన్ గడిచిన నెలరోజులుగా నిబంధనలను వెలువరిస్తూనే ఉంది. కోడ్ ఆఫ్ కండక్ట్ వచ్చాక ఎవరు ఏమి చేయకూడదో ప్రకటనలు విడుదల చేయగా, అది రాకముందే మంత్రి ఇలాకాలో అన్నీ జరిగిపోయాయి. అన్నివర్గాలను ప్రలోభాలకు గురిచేశారు. నిర్మాణంలో ఉన్న సచివాలయాలను ప్రారంభించేశారు. మన పల్లెకు సురేష్ అంటూ నియోజకవర్గంలో తాయిలాల పంపకం జరిగింది. ప్రభుత్వ, పార్టీ కార్యక్రమాలకు మధ్య తేడా లేకుండాపోయింది. ఇందుకు సచివాలయాల ప్రారంభం సందర్భంగా చోడవరంలో వలంటీర్లు వైసీపీ కండువాలు మెడలో వేసుకుని, పార్టీ జెండాలు చేతబూని పాల్గొనడమే నిదర్శనం. ఆదేవిధంగా పార్టీ కండువాలు మెడలో వేసుకుని మంత్రి సురేష్‌తో సెల్ఫీలు దిగారు. ఇది తీవ్ర విమర్శలకు దారితీసింది. చిన్నారులను పార్టీల ప్రచారానికి వాడొద్దని ఎన్నికల సంఘం ఇటీవల ఉత్తర్వులు జారీచేసింది. అయితే పల్లెపల్లెకు మన సురేష్ పేరుతో చేపట్టిన పార్టీ కార్యక్రమంలో పలు గ్రామాల్లో చిన్నారులు పాల్గొనేలా వైసీపీ నాయకులు ప్రోత్సహించారు. చిన్నారులు మంత్రిపై పూలుచల్లుతూ, పార్టీ జెండాలు చేతబట్టుకుని ప్రచారంలో పాల్గొన్నారు. మొత్తంగా చిన్నా, పెద్దా తేడా లేకుండా విద్యార్థులు, వలంటీర్లు, విలేకరులు, పార్టీ కార్యకర్తలు, ప్రభుత్వ ఉద్యోగులను ప్రలోభపెడుతూ దుస్సాహసానికి ఒడిగడుతున్న మంత్రి ముస్ముందు ఎటువంటి కార్యక్రమాలకు తెరతీస్తారో, ఆయన మాయలో పడి ఎందరు అధికారులు బలవుతారోనని నియోజకవర్గం లోపల, వెలుపలా చర్చోపచర్చలు జరుగుతున్నాయి. కాగా మంత్రి ప్రలోభాలపై ఎన్నికల కమిషన్ దృష్టి సారించాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి.

ముగ్గురు ఈఆర్వోలు, తహసీల్దార్ల మార్పు

ఎన్నికల విధులు నిర్వహించేందుకు ప్రభుత్వం నియోజవర్గానికి డిప్యూటీ కలెక్టర్ స్థాయి అధికారిని ఈఆర్వోగా నియమించింది. అది కూడా మంత్రి కారణంగా నెల క్రితం వివాదాస్పదమైంది. ఇద్దరు మహిళా అధికారులు వరుసగా బాధ్యతలు చేపట్టి మరునాడే తిరిగి వెళ్లిపోయారు. ఇప్పుడు ఉన్న ఈఆర్వో కుమార్ మూడో అధికారిగా వచ్చి బాధ్యతలు చేపట్టారు. అదేవిధంగా సింగరాయకొండకు కొద్దిరోజుల్లోనే తహసీల్దార్‌గా ముగ్గురు నియమితులయ్యారు. వారంతా బాధ్యతలు చేపట్టలేదు. ఇప్పుడు ఉన్న తహసీల్దార్ మాత్రమే బాధ్యతలు స్వీకరించారు. ఇలా ఈఆర్వోలు బాధ్యతల నుంచి వైదొలగడానికి, సింగరాయకొండ తహసీల్దార్‌లుగా నియమితులైన వారు విధుల్లో చేరకపోవడానికి మంత్రి ప్రమేయమే కారణమన్న ఆరోపణలు ఉన్నాయి.



మెడలో వైసీపీ కండువాలు వేసుకొని మంత్రి సురేష్‌తో సెల్ఫీ దిగుతున్న వలంటీర్లు

ఓటు నమోదుకు మరో అవకాశం

- జాబితాలో పేరు లేకపోతే దరఖాస్తు చేసుకోవచ్చు
- వచ్చేనెల 15 వరకు గడువు

ఒంగోలు (కలెక్టరేట్), మార్చి 19 : జిల్లాలో ఇప్పటి వరకు ఓటు నమోదు చేసుకోని యువకులు, గతంలో ఉండి వివిధ కారణాలతో కోల్పోయిన వారికి ఓటుహక్కు కల్పించేందుకు ఎన్నికల సంఘం మరో అవకాశం కల్పించింది. రాష్ట్రంలో మే 13న లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలను నిర్వహించేందుకు షెడ్యూల్ విడుదల చేసిన విషయం విదితమే. ఆ నేపథ్యంలో ఎన్నికల సంఘం వచ్చేనెల 15వతేదీ వరకు ఓటుహక్కు నమోదుకు అవకాశం ఇచ్చింది. సాధారణంగా నామినేషన్ల గడువు చివరిరోజు వరకు నమోదుకు దరఖాస్తు చేసుకోవచ్చు. పరిశీలన, నోటీసుల జారీ, దరఖాస్తుదారుల సమాధానాల కోసం కనీసం వారం రోజులు గడువు ఇవ్వాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో దరఖాస్తు చేసుకునేందుకు ఏప్రిల్ 15 వరకూ గడువు ఇచ్చింది.



ఆన్‌లైన్‌లోనూ ఓటు నమోదు

ఓటుహక్కు నమోదు కోసం ఆన్‌లైన్‌లో కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. ఎన్నికల సంఘం వెబ్‌సైట్‌లో ఓటు కావాల్సిన వ్యక్తి ఫోన్ నెంబరుతో రిజిస్టర్ చేసుకుని లాగిన్ కావాల్సి ఉంటుంది. రిజిస్టర్ యూజ్ ఏ న్యూ ఓటర్ విభాగంపై క్లిక్ చేస్తే ఫాం-6 అప్లికేషన్ ఫాం ఫర్ న్యూ ఓటర్స్ అనే భాగం కనిపిస్తుంది. అందులో పేర్కొన్న వివరాలన్నీ నింపి సబ్మిట్ చేయాలి. ఆ తర్వాత మీ ఫోన్‌నెంబరుకు రిఫరెన్స్ ఐడీ వస్తుంది. దాని ఆధారంగా ఇదే వెబ్‌సైట్‌లో ఆ దరఖాస్తు ఏ దశలో ఉందో కూడా తెలుసుకోవచ్చు.

ఆఫ్‌లైన్ ద్వారా...

ఓటుహక్కు నమోదు కోసం ఆఫ్‌లైన్(దరఖాస్తు చేసుకోవడం) ద్వారా ఫాం-6ను బూత్‌లెవల్ అధికారులు(బీఎల్‌ఓ)లకు ఇవ్వొచ్చు. ప్రతి నియోజకవర్గానికి డివిజన్ స్థాయి అధికారిని ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి (ఈఆర్వో)ని ఎన్నికల సంఘం నియమించింది. వారి కార్యాలయాల్లోనూ దరఖాస్తులు అందజేయవచ్చు. ప్రతి మండలంలో తహసీల్దార్ లేదా డిప్యూటీ తహసీల్దార్లకు ఓటు నమోదు కోసం దరఖాస్తు ఇచ్చేందుకు ఎన్నికల సంఘం అవకాశం కల్పించింది.

'గోరుముద్ద'లో ఎన్నికల నిబంధనలు పాటించాలి

ఒంగోలు (విద్య), మార్చి 19 : పాఠశాలల్లో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం (గోరుముద్ద)లో ఎన్నికల కమిషన్ ప్రకటించిన నియమావళిని పాటించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈమేరకు పాఠశాల విద్యాశాఖ మార్గదర్శకాలను విడుదల చేసింది. ఆ ప్రకారం మధ్యాహ్న భోజనం అధికారిక వెబ్‌సైట్‌లోని నాయకుల ఫొటోలను తొలగించాలి లేదా కనబడకుండా చేయాలి. పాఠశాలలకు సరఫరా చేస్తున్న కోడిగుడ్లలో ఆఫేజ్‌కు సంబంధించిన రంగు తప్ప ఎటువంటి స్టాంపులు వేయరాదు. చిక్కీల కవర్ తొలగించి విద్యార్థులకు పంపిణీ చేయాలి. తొలగించిన కవర్లను జాగ్రత్తగా సేకరించి వాటిని కనిపించకుండా చేయాలి. రాగిజావ కోసం సరఫరా చేస్తున్న రాగిపిండి, బెల్లం కవర్లు, బియ్యం గోతాలను కూడా కనిపించకుండా చేయాలి. ఈ నిబంధనలు ఉల్లంఘిస్తే సంబంధిత పాఠశాల హెచ్‌ఎం, ప్రిన్సిపాల్స్ బాధ్యత వహించాల్సి ఉంటుందని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.



దర్శికి చేరిన గూడ్స్ రైలును చూసేందుకు వచ్చిన ప్రజలు

దర్శికి రైలొచ్చింది..

దర్శి, మార్చి 19 : దర్శి ప్రజలు ఎంతోకాలంగా ఎదురు చూస్తున్న రైలు బండి రాక కల నెరవేరింది. పట్టణ సమీపంలోని కొత్తపాలెం వద్ద నూతనంగా నిర్మిస్తున్న రైల్వే స్టేషన్ వద్దకు మంగళవారం గూడ్స్ రైలు చేరుకుంది. రైలు బండిని చూసేందుకు అధిక సంఖ్యలో ప్రజలు గుంపులుగా వెళ్లారు. నడికుడి-శ్రీకాళహస్తి రైల్వే లైను నిర్మాణం జరుగుతున్న విషయం విదితమే. దీర్ఘకాలంగా ప్రతిపాదనల్లోనే ఉన్న ఈ ప్రాజెక్టు కొన్నేళ్ల క్రితం ఎట్టకేలకు పట్టాలెక్కింది. ప్రస్తుతం నడికుడి నుంచి దర్శి వరకు లైన్ నిర్మాణం పూర్తయింది. దర్శిలో స్టేషన్ నిర్మాణం జరగాల్సి ఉంది. ఏప్రిల్ నుంచి దర్శికి ప్యాసింజర్ రైలును నడిపిస్తామని ఆ శాఖ అధికారులు తెలిపారు.

పది పరీక్షలకు 603 మంది గైర్హాజరు

ఒంగోలు (విద్య), మార్చి 19 : పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో భాగంగా మంగళవారం జరిగిన హిందీ పరీక్షకు 603 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. పరీక్షకు మొత్తం 29,692 మంది హాజరుకావాల్సి ఉండగా 29,089 మంది హాజరయ్యారు. జిల్లా విద్యాశాఖాధికారి సుభద్ర ఐదు కేంద్రాలను, పరీక్షల రాష్ట్ర పరిశీలకులు ఎం.ఆర్.ప్రసన్నకుమార్ ఎనిమిది కేంద్రాలను తనిఖీ చేశారు. ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు 95 కేంద్రాలను సందర్శించారు. వివిధ కేంద్రాల్లో 48 సిట్టింగ్ స్క్వాడ్లను ఏర్పాటు చేశారు. పరీక్ష ప్రశాంతంగా జరిగినట్లు డీఈవో తెలిపారు.

దర్శి ఎస్‌వీఆర్‌ఎం స్కూల్‌కు నోటీసులు

దర్శిలోని ఎస్‌వీఆర్‌ఎం హైస్కూల్ యాజమాన్యానికి నోటీసు జారీ చేయాలని పదో తరగతి పబ్లిక్ పరీక్షల రాష్ట్ర పరిశీలకుడు ఎం.ఆర్.ప్రసన్నకుమార్ ఒంగోలు ఉప విద్యాధికారిని ఆదేశించారు. టెన్త్ పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థుల సబ్జెక్టుల్లో తప్పులు దొర్లినా పట్టించుకోని పాఠశాల యాజమాన్యంపై ప్రసన్నకుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. హాల్‌టికెట్లు విడుదలైన తర్వాత వాటిలో సబ్జెక్టు, ఇతర పొరపాట్లు జరిగితే సరిచేసుకునేందుకు అవకాశం ఇచ్చారు. అయితే పాఠశాల యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరించి సబ్జెక్టుల్లో తప్పులు దొర్లినా పట్టించుకోలేదు. దీంతో ప్రథమ భాషగా తెలుగు రాయాల్సిన విద్యార్థులు హిందీ రాశారు. విద్యార్థుల హాల్‌టికెట్, నామినల్ రోల్‌లో కూడా ప్రథమ భాష హిందీగానే నమోదు కావడంతో కేంద్రంలో ఆ విద్యార్థులకు హిందీ ప్రశ్నపత్రమే ఇచ్చి పరీక్ష రాయించారు. జరిగిన పొరపాటు ఆలస్యంగా వెలుగుచూడటంతో పాఠశాల యాజమాన్యాన్ని ఒంగోలుకు పిలిపించి ప్రసన్నకుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే పాఠశాలకు నోటీసు జారీ చేయాలని ఒంగోలు ఉప విద్యాధికారి అనితా రోజ్‌రాణిని ఆదేశించారు. పరీక్షా కేంద్రం చీఫ్‌ను తొలగించి ఆయన స్థానంలో మరొకరిని నియమించారు.

కోడ్ కూస్తే మాకేంటి..!

- పీఏసీఎస్ ఆఫీసులో వైసీపీ నేతల సమావేశం

హనుమంతునిపాడు (కనిగిరి), మార్చి 19 : ఎన్నికల కోడ్‌ను వైసీపీ నేతలు యథేచ్ఛగా ఉల్లంఘిస్తున్నా పట్టించుకునే వారు లేరు. కోడ్ వస్తే మాకేంటి అన్నట్లుగా వారు ఏకంగా ప్రభుత్వ ఆఫీసుల్లోనే బాహాటంగా పార్టీ కార్యకలాపాలు సాగిస్తున్నారు. హనుమంతునిపాడులో పీఏసీఎస్‌లో మంగళవారం సొసైటీ ఛైర్మన్ ఎక్కంటి శ్రీనివాసులరెడ్డి, రెడ్డి కార్పొరేషన్ ఛైర్మన్ చింతలచెరువు సత్యనారాయణరెడ్డి, మాజీ ఎంపీపీ గాయం బలరామిరెడ్డి,



పీఏసీఎస్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న రెడ్డి కార్పొరేషన్ ఛైర్మన్ సత్యనారాయణరెడ్డి

హనుమంతాపురం సర్పంచ్ సానికొమ్ము మధుసూదన్‌రెడ్డి, నందనవనం ఎంపీటీసీ సభ్యుడు నారాయణస్వామి, సచివాలయ కన్వీనర్ మద్ది తిరుపతయ్య కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఎన్నికల పోల్ మేనేజ్‌మెంట్ గురించి బూత్ కన్వీనర్‌లు, సచివాలయ కన్వీనర్‌లు, పార్టీ మండల అధ్యక్షులతో వారు చర్చించారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘించి సమావేశం నిర్వహించినా అధికారులు అది తమ పని కాదన్నట్లు వ్యవహరించడం విమర్శలకు తావిస్తోంది. వైసీపీకి చెందిన వారికి ఎన్నికల కోడ్ వర్తించదా, సామాన్యులకేనా అంటూ ప్రజలు అధికారులను ప్రశ్నిస్తున్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న గిద్దలూరు టీడీపీ అభ్యర్థి అశోక్‌రెడ్డి

ఓడిపోతారన్న అక్కసుతోనే నరమేధం

- జగన్ హత్యారాజకీయాలనే వైసీపీ వారు ఆదర్శంగా తీసుకున్నారు
- మునయ్య హంతకులను కఠినంగా శిక్షించాలి
- గిద్దలూరు టీడీపీ అభ్యర్థి ముత్తుముల అశోక్‌రెడ్డి

గిద్దలూరు టౌన్, మార్చి 19 : అధికారం కోల్పోతున్నామన్న అక్కసుతోనే వైసీపీ మూకలు నరమేధం సాగిస్తున్నాయని టీడీపీ అభ్యర్థి ముత్తుముల అశోక్‌రెడ్డి ధ్వజమెత్తారు. మండలంలోని గడికోట పంచాయతీ పరమేశ్వర్‌నగర్‌కు చెందిన టీడీపీ నాయకుడు మునయ్యను గొడ్డలితో నరికి చంపిన హంతకులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సొంత బాబాయిని గొడ్డలితో చంపిన నాయకుడిని వైసీపీ కార్యకర్తలు ఆదర్శంగా తీసుకున్నారని మండిపడ్డారు. వైసీపీ రాక్షస జాతికి చెందిన పార్టీ అని ఆయన విమర్శించారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలపై దాడులు చేసిన వారిని వదిలే ప్రసక్తే లేదని హెచ్చరించారు. ఈనెల 17న చిలకలూరిపేట ప్రజాగళం సభకు పరమేశ్వర్ నగర్ నుంచి మునయ్య పెద్దఎత్తున జనాలను తరలించారన్న అక్కసుతో వైసీపీ రాక్షస మూకలు ఆయన్ను గొడ్డలితో నరికి చంపాయన్నారు. ఎన్నికల సంఘం వైసీపీకి ఫ్యాన్ గుర్తును రద్దుచేసి గొడ్డలి గుర్తు కేటాయించాలని ఎద్దేవా చేశారు. మునయ్య హత్య వెనుక ఉన్న రాజకీయ నాయకులపై కూడా కఠినమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జడ్పీటీసీ సభ్యుడు బుడత మధుసూదన్ యాదవ్, పార్టీ మండల అధ్యక్షుడు మార్తాల సుబ్బారెడ్డి, కడియం శేషగిరి, బిల్లా రమేష్ యాదవ్, బాబాయ్ పాల్గొన్నారు.

గిరిజన యువకుడి హత్య వెనుక

భారీ కుట్ర


- వైసీపీ నేతల ప్రోద్బలంపై అనుమానాలు
- దర్యాప్తులో పోలీసుశాఖ మీనమేషాలు
- టీడీపీలో చేరడమే ఆయన చేసిన నేరం



మునయ్య (ఫైల్)

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

కేవలం వైసీపీని వీడి టీడీపీలో చేరారన్న అక్కసుతోనే ఒక గిరిజన యువకుడిని వైసీపీ శ్రేణులు నడిరోడ్డుపై హత్య చేశారు. రెండేళ్ల క్రితం వరకు వారితో కలిసి చెట్టాపట్టాలేసుకొని తిరిగిన బంధాన్ని, కులపరమైన అనుబంధాన్ని చివరకు మానవత్వాన్ని కూడా మరిచిపోయి అత్యంత దయనీయంగా నరికి చంపారు. గతంలో ఎప్పుడూ కక్షలు, కార్పణ్యాలు లేని ఆ గిరిజన గూడెంలో సన్నిహితుల మధ్య ఇంతటి దయనీయమైన దుర్ఘటన జరగటం ఏమిటని ఆరా తీస్తే వారిపై పెత్తనం చేసే వైసీపీ నేతల కుట్రలు, కుతంత్రాలే అని తేటతెల్లమవుతోంది. గిద్దలూరు మండలం పరమేశ్వరనగర్ అనే కుగ్రామం గడికోట పంచాయతీ పరిధిలో ఉంది. రెండు గ్రామాల్లోనూ రాజకీయంగా వైసీపీదే ఆధిపత్యం. గడికోటలో బలహీనవర్గాల ప్రజలు అధికంగాను, పరమేశ్వరనగర్‌లో పూర్తిగా గిరిజనులు నివసిస్తుంటారు. గడికోటలో అంతో ఇంతో రెడ్లతోపాటు మరికొన్ని కులాల వారు ఉన్నారు. నిన్నమొన్నటివరకు పరమేశ్వరనగర్‌లోని గిరిజనులంతా వైసీపీ బాటలో నడిచారు. ఎంపీటీసీ సభ్యుడు శ్రీనివాసరెడ్డి మద్దతుగానే వారు ముందుకు సాగారు. వీరిలో యువకుడైన మునయ్య వైసీపీ ప్రభుత్వ విధానాలతో విభేదించారు. జగన్ పాలన తీరుతెన్నులు



అశోక్‌రెడ్డి సమక్షంలో టీడీపీలో చేరిన మునయ్య (ఫైల్)

బాగా లేవని అభిప్రాయపడటమే కాక తోటి వారితో ఆ అంశాలను చర్చించేవారు. నియోజకవర్గంలో వైసీపీ నుంచి భారీగా టీడీపీలోకి వలసలు ప్రారంభమైన దశలో మునయ్య కూడా ఆ వైపు చేరాలని నిర్ణయించుకున్నాడు. 2022లో మాజీ ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. ఆ తర్వాత నుంచి గిరిజనగూడెంలోని ప్రజలను టీడీపీవైపు మళ్లించటం ప్రారంభించారు. దీంతో టీడీపీ వర్గం పెరిగింది. గడికోటలో కూడా టీడీపీలోకి చేరికలు అధికమయ్యాయి. టీడీపీ, వైసీపీ అభ్యర్థులు ఖరారు కావడంతో ఇరుపక్షాల తరఫున కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. గత ఆదివారం బొప్పూడి వద్ద టీడీపీ కూటమి సభకు మునయ్య టీడీపీ వర్గీయులను సమీకరించారు. ఒక ప్రత్యేక వాహనంలో పరమేశ్వరనగర్, గడికోటవాసులు బయల్దేరి ఆ సభకు వెళ్లి వచ్చారు. దీంతో వైసీపీ శ్రేణుల్లో అలజడి మొదలైంది. ఫలితంగా సోమవారం రాత్రి గ్రామంలోని నడిరోడ్డు మీద వైసీపీలో చురుగ్గా పనిచేసే అల్లూరయ్య, ఈశ్వరయ్య మరో ఇద్దరు కలిసి మునయ్యను పిలిచి బెదిరించారు. అకస్మాత్తుగా మారణాయుధాలతో దాడి చేశారు. వారికి ఎంపీటీసీ సభ్యుడు శ్రీనివాసరెడ్డి అనుచరులుగా ముద్ర ఉంది. శ్రీనివాసరెడ్డికి పెద్ద నాయకులతో సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. దీంతో ముందుగా పన్నిన కుట్రలో భాగంగానే మునయ్యను హత్య చేశారని భావిస్తున్నారు. ఆకస్మికంగా వాదన జరిగితే అప్పటికప్పుడు వారి చేతిలో ఆయుధాలు ఉండవనేది జగమెరిగిన సత్యం. పక్కా ప్రణాళికతోనే ఆయుధాలతో అతని వద్దకు వెళ్లి వాదనకు దిగి కొన్ని క్షణాల్లోనే దాడి చేసినట్లు తెలుస్తోంది. మునయ్యని కాపాడుకునేందుకు ఆయన బంధువులు, టీడీపీ శ్రేణులు గిద్దలూరు, నంద్యాలలో చికిత్సల అనంతరం హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. అక్కడ ఆయన చికిత్సపొందుతూ మృతిచెందారు.

పోలీసుల తీరుపైనా అనుమానాలు

పోలీసుల పాత్రపైనా పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గాయపడ్డ మునయ్య తొలుత గిద్దలూరు వైద్యశాలలో ఉన్నప్పుడు ఒక పోలీసు అధికారి వ్యవహరించిన తీరు అనుమానాలకు తావిస్తోంది. ఈ ఘటన జరిగి 24 గంటలు అయినా ఇంతవరకూ అనుమానితుల్లో ఒక్కరినీ అదుపులోకి తీసుకోలేదు. గ్రామంలో శాంతిభద్రతలను కాపాడేందుకు పికెట్ ఏర్పాటుచేసినా పరారీలో ఉన్న నిందితులను అదుపులోకి తీసుకునేందుకు పోలీసు తరహా దర్యాప్తు ప్రారంభమైన దాఖలాలు లేవు. పైగా నిందితులు ఆ ప్రాంతంలో సురక్షితంగా ఉన్నారని తెలుస్తోంది. వైసీపీ నేతల ఇళ్లలో గాలింపు చర్యలు కూడా పోలీసు అధికారులు చేపట్టిన దాఖలాలు లేవు.

ప్రజాగళం సభ భద్రతా వైఫల్యాలపై
విచారణ చేపట్టాలి

• టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దామచర్ల

ఒంగోలు(కార్పొరేషన్) మార్చి 19: ప్రజాగళం సభ భద్రతా వైఫల్యంపై విచారణ చేపట్టాలని, బాధ్యులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దామచర్ల జనార్దన్ డిమాండ్ చేశారు. మంగళవారం ఒంగోలులోని టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ హాజరైన బొప్పూడి ప్రజాగళం సభ భద్రతలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన పోలీసు ఉన్నతాధికారులపై చీఫ్ ఎలక్షన్ కమిషన్ తక్షణమే చర్యలు తీసుకోవాలన్నారు. లక్షలాదిమంది జనం తోసుకొస్తుంటే, నియంత్రించాల్సిన పోలీసులు చోద్యం చూడటం దేనికి సంకేతమని విమర్శించారు. బీజేపీ, టీడీపీ, జనసేన తొలి ఎన్డీఏ సభ విజయవంతమైందని దామచర్ల పేర్కొన్నారు. మూడు పార్టీల కార్యకర్తలు, అభిమానులంతా పాల్గొన్న సభను విజయవంతం చేశారని, అయితే ట్రాఫిక్ వల్ల వేలాదిమంది సభకు రాలేకపోయారన్నారు. ప్రధానమంత్రి ఈ సభ ద్వారా రాష్ట్ర ప్రజల కష్టాలు తనకు తెలుసని, వచ్చే ఐదేళ్ళు ఎంతో కీలకమైనవని చెప్పారని ఆయన పతెలిపారు. అంతేగాకుండా ఐదు సంవత్సరాల జగన్ పాలనలో అభివృద్ధి ఆగిపోయిందని, అవినీతి, దోపిడీల్లో పోటీ పడ్డారని స్పష్టం చేశారని తెలిపారు. ఆరోగ్యశ్రీ సహా అనేక పథకాలకు కేంద్రం నిధులిస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం సొంత స్టిక్కర్లు వేసుకుంటూ అంతా తామే ఇస్తున్నట్లు ప్రచారం చేసుకుంటుందని ప్రధాని చెప్పడం నూటికి నూరుపాళ్ళు నిజమని చెప్పారు. జగన్‌రెడ్డి ప్రభుత్వంతోపాటు అందులో పనిచేస్తున్న కొందరు అధికారులు ఉద్దేశ్యపూర్వకంగా సభకు అడ్డంకులు సృష్టించారని ఆరోపించారు. ఎవరు ఎన్ని అడ్డంకులు సృష్టించినా టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు సభను విజయవంతం చేశారన్నారు. సభను విఫలం చేసేందుకు భద్రత వైఫల్యాలకు కారణమైన వారిపై ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకోవాలని దామచర్ల కోరారు.

పరీక్షా కేంద్రాల పరిశీలన

కొండపి, మార్చి 19 : పదో తరగతి పరీక్షా కేంద్రాలను డిప్యూటీ ఈవో అనితా రోజ్‌రాణి మంగళవారం పరిశీలించారు. కొండపిలోని జీహెచ్ఎస్, చాణిక్య కళాశాల, గురుకుల పాఠశాలలోని కేంద్రాలను సందర్శించారు. ఆమె వెంట విజిలెన్స్ అధికారి ఝాన్సీరాణి, ఎంఈవో కె.సురేఖ ఉన్నారు. రెండో రోజు పరీక్షకు ఏడుగురు విద్యార్థులు గైర్హాజరైనట్లు ఎంఈవో తెలిపారు.

కంట్రోల్ రూమ్ ఏర్పాటు



కమాండ్ కంట్రోల్ కేంద్రంలో ఉద్యోగులు

చీమకుర్తి, మార్చి 19 : సంతనూతలపాడు నియోజకవర్గ కేంద్రం అయిన చీమకుర్తి మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేశారు. సాధారణ ఎన్నికల నిర్వహణలో భాగంగా ఏవైనా సమస్యలు ఈ కేంద్రంలో ఫిర్యాదు చేయవచ్చని అధికారులు తెలిపారు. ఇరవైనాలుగు గంటల పాటు పనిచేసే ఈ కేంద్రంలో ఫిర్యాదులను దిగువ తెల్పిన హెల్ప్ నంబర్లకు ఫోన్ ద్వారా తెలుపవచ్చని అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ల్యాండ్‌లైన్ నంబర్ : 085922-73100, మొబైల్ నంబర్ 6305621139లలో సంప్రదించాలని కోరారు.

న్యూరో సైంటిస్ట్స్ అసోసియేషన్ ఆవిర్భావం



నూతన కమిటీ సభ్యులు

ఒంగోలు(కార్పొరేషన్), మార్చి 19: జిల్లా న్యూరో సైంటిస్ట్స్ అసోసియేషన్ ఆవిర్భావం అయింది. మంగళవారం ఒంగోలులోని వీకేబీ రెసిడెన్సీలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ప్రముఖ న్యూరో సర్జన్ డాక్టర్ కామేపల్లి చంద్రశేఖర్‌రావు అధ్యక్షత వహించగా, ఆంధ్రప్రదేశ్ న్యూరో సైంటిస్ట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ పి.విజయ, డాక్టర్ ఐ.బాబిశ్యామ్‌కుమార్‌లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వైద్యులు విజయ, శ్యామ్‌కుమార్ మాట్లాడుతూ ప్రస్తుత కంప్యూటర్ యుగంలో ప్రతి ఒక్కరూ ఒత్తిడికి గురై నరాల సమస్యలతో బాధపడుతున్నారన్నారు. అంతేగాకుండా తరచుగా బ్రెయిన్ స్ట్రోక్‌లు కూడా పెరిగాయని తెలిపారు. అయితే వీటిని ముందుగానే గుర్తించడం ద్వారా తగిన వైద్యం అందించి రోగి ఆరోగ్యాన్ని, ప్రాణాలను కాపాడుకోవచ్చని చెప్పారు. ఈ సందర్భంగా బ్రెయిన్ స్ట్రోక్‌ను ముందుగానే గుర్తించే విధంగా స్ట్రోక్ ఎమర్జెన్సీ మేనేజ్‌మెంట్‌పై అవగాహన కల్పించారు. అందుబాటులోకి వచ్చిన ఆధునిక పరిజ్ఞానంతోపాటు న్యూరాలజీ, న్యూరో సర్జరీలపై చర్చించారు. అనంతరం జిల్లా నూతన కమిటీ అధ్యక్షుడిగా డాక్టర్ శివసీతారామ్, ఉపాధ్యక్షులుగా ఏవీ.సుందరరావు, ప్రధాన కార్యదర్శిగా కామేపల్లి చంద్రశేఖర్‌రావు, కోశాధికారిగా సంజీవ్‌రెడ్డితోపాటు పలువురు నరాల వైద్య నిపుణులను కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు.

ప్రజా సంక్షేమం కోసం 'సూపర్‌సిక్స్'



ప్రచారం చేస్తున్న ఈదర ప్రభాకర్, రవీంద్రబాబు

కారుమంచి (టంగుటూరు), మార్చి 19 : ప్రజా సంక్షేమం కోసమే సూపర్ సిక్స్ పథకాలని టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి రవీంద్ర అన్నారు. స్థానిక టీడీపీ నాయకుడు ఈదర ప్రభాకర్‌తో కలసి రవీంద్ర, మరికొందరు తెలుగు యువత సభ్యులు మంగళశారం రాత్రి కారుమంచిలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ముఖ్యమంత్రి జగన్ రాష్ట్రాన్ని 30 ఏళ్ల వెనక్కి తీసుకెళ్లారని, చంద్రబాబు మాత్రమే అభివృద్ధి పథంలో ముందుకు తీసుకుపోగలరన్నారు. చంద్రబాబును మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుని రాష్ట్రంలోని అన్ని ఇబ్బందులను తొలగించుకుందామని ఆయన గ్రామస్థులను కోరారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి

• మంత్రి నాగార్జున

నాగులుప్పలపాడు, మార్చి 19 : నియోజకవర్గాన్ని అభివృద్ధికి కృషి చేస్తానని సంతనూతలపాడు నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త, మంత్రి మేరుగ నాగార్జున సూచించారు. మట్టిగుంటలో మంత్రి పరిచయ కార్యక్రమం మంగళవారం రాత్రి జరిగింది. అనంతరం కండ్లగుంట, ఒమ్మెవరం గ్రామాల్లో మంత్రి పరిచయ కార్యక్రమాలు జరిగాయి. కార్యక్రమంలో నాయకులు నలమలపు కృష్ణారెడ్డి, మారెళ్ళ బంగారు బాబు, పోలవరపు శ్రీమన్నారాయణ, రాష్ట్ర మాదిగ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ కన కారావు, ఆరోగ్యశ్రీ ప్రత్యేక అధికారి యాదాల అశోక్, జడ్పీటీసీ రత్నభారతి తది తరులు పాల్గొన్నారు.

కోడ్ ఉల్లంఘించి శిలాఫలకం ఆవిష్కరణ

అద్దంకి, మార్చి 19 : వైసీపీ నేతలు యథేచ్ఛగా ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తున్నారు. అద్దంకి మండలం గోపాలపురంలో మంగళవారం రాత్రి అభివృద్ధి పనులకు సంబంధించిన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నా పట్టించుకోకుండా ఈ నెల 7వ తేదీ పేరుతో శిలాఫలకాన్ని ఏర్పాటు చేసి మంగళవారం రాత్రి వైసీపీ అద్దంకి నియోజకవర్గ ఇన్‌చార్జి పాణెం చిన హనిమిరెడ్డి సమక్షంలో ప్రజాప్రతినిధులు, వైసీపీ నాయకులు అత్యుత్సాహం ప్రదర్శించి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. పల్లెపల్లెకు కార్యక్రమంలో భాగంగా హనిమిరెడ్డి గోపాలపురంలో పర్యటించారు. అదే సమయంలో శిలాఫలకాన్ని స్థానిక నేతలు ఆవిష్కరించారు. హనిమిరెడ్డి మాత్రం శిలాఫలకం ఆవిష్కరణ దూరంగా ఉన్నట్లు తెలుస్తున్నది.



ఏడుగుండ్లపాడులోని రైతు భరోసా కేంద్రం



భాగ్యనగర్‌లోని జిల్లా వనరుల కేంద్రం



చిక్కీలపై జగన్ బొమ్మలు

మనసు రాలేదా..
అభిమానం పోలేదా..?

• ఇంకా తొలగని వైసీపీ రంగులు, సీఎం బొమ్మలు



వ్యవసాయశాఖ జిల్లా వనరుల కేంద్రం

ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఏ రాజకీయ పార్టీల రంగులు, విగ్రహాలు, భవనాలు, రైతు భరోసా కేంద్రాలకు పార్టీ రంగులు, రాజకీయ నాయకులు పేర్లు ఉండకూడదని ఎన్నికల కమిషన్ పదేపదే ఆదేశిస్తున్నా, ఇక్కడ అధికారులకు మాత్రం చెవికెక్కడం లేదు. ఈనెల 16 మధ్యాహ్నం 3గంటల నుంచి ఎన్నికల కోడ్ అమలులోకి రాగా, వాటిని తొలగించడానికి ఎన్నికల కమిషన్ 24 గంటలు సమయం ఇచ్చింది. అయితే నగరంలోని పలు ప్రాంతాల్లో ఇంకా అధికార వైసీపీ రంగులు తొలగలేదు. పలు ప్రాంతాల్లో సీఎం బొమ్మలు తీయలేదు. దీంతో అధికారుల నిర్లక్ష్యంపై పలువురు విమర్శలు చేస్తున్నారు. అధికారులకు వైసీపీపై అభిమానమా.. లేక తొలగించడానికి మనసు రాలేదా? అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలను సైతం లెక్కచేయకపోవడంపై అధికారుల తీరును పలువురు తప్పు పడుతున్నారు.

- ఒంగోలు (కార్పొరేషన్)



రేషన్ బండిపై జగన్ బొమ్మ



ఒంగోలు తహసీల్దార్ కార్యాలయం వద్ద ఉన్న బల్ల

ప్రతి పోలింగ్ బూత్‌లో మెజార్టీ తేవాలి

• టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దామచర్ల



సమావేశంలో మాట్లాడుతున్న దామచర్ల జనార్దన్

ఒంగోలు (కార్పొరేషన్), మార్చి 19: త్వరలో జరిగే సార్వత్రిక ఎన్నికలలో ప్రతి పోలింగ్ బూత్ నుంచి మెజార్టీ వచ్చేలా అందరూ కృషి చేయాలని తెలుగుదేశం పార్టీ ఒంగోలు నియోజకవర్గ అభ్యర్థి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు దామచర్ల జనార్దన్ పేర్కొన్నారు. మంగళవారం ఒంగోలులోని టీడీపీ కార్యాలయలో నగర కమిటీ నాయకులతో సమావేశం నిర్వహించారు. రాబోయే ఎన్నికల్లో గెలుపు కోసం దిశానిర్దేశం చేశారు. ప్రతి ఒక్కరికి బూత్‌లను అప్పజెప్పామని, తమకు కేటాయించిన బూత్‌లలో మెజార్టీ తీసుకువచ్చే విధంగా కష్టపడి పనిచేయాలని దామచర్ల సూచించారు. బూత్ పరిధిలోని ఇన్‌చార్జులు, సెక్షన్ ఇన్‌చార్జులు, డివిజన్ ప్రెసిడెంట్‌లతో సమన్వయం చేసుకుని ముందుకు సాగాలన్నారు. బూత్ పరిధిలోని ఓటర్ల వివరాలు, కులా వారీగా, ప్రాంతాల వారీగా పూర్తి అవగాహన కలిగి ఉండాలని, ఎన్నికల సమయంలో ఎలాంటి సమస్య వచ్చినా తన దృష్టి తీసుకురావాలని చెప్పారు. ఆయా పోలింగ్‌స్టేషన్ల పరిధిలోని ఓటర్లను కలిసి, వారితో మాట్లాడాలని, తటస్థ సభ్యులను కలిసి మాట్లాడాలన్నారు. పోలింగ్ తేదీ వరకు ప్రజల్లోనే ఉండాలని, పార్టీకి అత్యధిక మెజార్టీ వచ్చేలా కష్టపడి పని చేయాలన్నారు. సమావేశంలో నగర అధ్యక్షులు కొరారి నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి వాసుకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సువిధ పోర్టల్‌ను వినియోగించుకోవాలి

• కలెక్టర్ దినేష్‌కుమార్



రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 19: ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు నామినేషన్, ప్రచారానికి అనుమతి, అఫిడవిట్ సమర్పణకు సువిధ పోర్టల్‌ను వినియోగించుకోవాలని కలెక్టర్ దినేష్‌కుమార్ సూచించారు. స్థానిక కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో మంగళవారం రాత్రి రాజకీయ పార్టీల ప్రతినిధుల అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఎన్నికల ప్రచారానికి, బహిరంగ సభ నిర్వహణకు 48 గంటల ముందుగా ఈ పోర్టల్ ద్వారా అనుమతి తీసుకోవాలన్నారు. అందుకోసం వినియోగించే ప్రచార సామగ్రి వివరాలను కూడా తెలియజేయాల్సి ఉంటుందని చెప్పారు. అసెంబ్లీ నియోజకవర్గ స్థాయిలో స్టేషన్ల వివరాలను కూడా తక్షణమే పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని ఆర్వోలను కలెక్టర్ ఆదేశించారు. ఆఫ్‌లైన్‌లో కూడా దరఖాస్తు చేసుకోవచ్చని, సంబంధిత పత్రాలను వ్యక్తిగతంగా తమకు అందజేయవచ్చని తెలిపారు. సువిధ యాప్‌ను వినియోగించుకోవడంపై త్వరలో వర్క్‌షాపును నిర్వహిస్తామన్నారు. సమావేశంలో జేసీ గోపాలకృష్ణ, డీఆర్వో శ్రీలత, అసిస్టెంట్ కలెక్టర్ శౌర్యపటేల్, డీటీసీ సుశీల, సువిధ నోడల్ అధికారులు, ఆయా రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

12న ఈవీఎంల ర్యాండమైజేషన్

ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల(ఈవీఎం) మొదట విడత ర్యాండమైజేషన్ వచ్చేనెల 12న ఎన్నికల పరిశీలకుని పర్యవేక్షణలో నిర్వహించాలని ఎన్నికల ప్రధానాధికారి ముకేష్‌కుమార్ మీనా ఆదేశించారు. జిల్లా కలెక్టర్లతో మంగళవారం సాయంత్రం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. పోటీ చేసే అభ్యర్థుల సంఖ్య 16 కంటే ఎక్కువగా ఉంటే మే ఒకటో తేదీన రెండో విడత ఈవీఎంల ర్యాండమైజేషన్ చేపట్టాలన్నారు. పోలింగ్ సిబ్బందికి ర్యాండమైజేషన్ ఏప్రిల్ 4న, పీవో, ఏపీవోలకు ఏప్రిల్ 18లోపు శిక్షణ పూర్తి చేయాలని సూచించారు. రెండో విడత శిక్షణను వచ్చేనెల 28లోపు పూర్తి చేయాలని కలెక్టర్లను ఆదేశించారు. వాల్‌పెయింటింగ్స్, పోస్టర్లు, కటౌట్లు ఉంటే వాటికి తప్పనిసరిగా అనుమతి అవసరమన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ దినేష్‌కుమార్, జేసీ గోపాలకృష్ణ, డీఆర్వో శ్రీలత, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా

ముసిని తోడేస్తున్న అక్రమార్కులు

జేసీకి ఫిర్యాదు చేసిన చినరావిపాడు గ్రామస్థులు

చీమకుర్తి, మార్చి 19 : ఎన్నికల కోడ్ అమలులో ఉన్నా అధికారపార్టీ నాయకుల ఇసుక దందాకు అడ్డుకట్ట పడటం లేదు. ముసి ఒడ్డునున్న గ్రామాల నుంచి అనుమతులు లేని చోట సైతం ఇసుకను తోడేస్తున్నారు. రాత్రి,పగలు తేడా లేకుండా ఇసుకను లోడు చేసుకొని అక్రమ రవాణా చేసి సొమ్ము చేసుకుంటున్నా అధికారయంత్రాంగంలో చలనం లేకపోవటం గమనార్హం. పొదిలి, చీమకుర్తి మండలాల సరిహద్దు మధ్య నుంచి ముసి వాగు ప్రవహిస్తుంది. అది మేట వేసిన ప్రాంతంలో ఇసుకను అధికార పార్టీకి చెందిన అక్రమార్కులు తోడేస్తున్నారు. గతంలో ఇదే పరిస్థితి నెలకొన్నపుడు సెబ్, విజిలెన్స్ అధికారుల ముమ్మర దాడులు నిర్వహించటంతో అక్రమ రవాణాకు కాస్త బ్రేక్ పడింది. మళ్లీ కొన్నిరోజులుగా ఇసుక దోపిడీ మొదలైంది. కనీసం ఎన్నికల కోడ్ వచ్చింది కదా ఈ దందాకు బ్రేక్ పడుతుందని ఆశించిన ఈ ప్రాంతవాసులకు నిరాశే మిగిలింది. ముఖ్యంగా మండలంలోని చినరావిపాడు గ్రామ సరిహద్దుల నుంచి ఈ అక్రమ రవాణా జోరుగా సాగుతున్నది. దీనివలన ముసి ఒడ్డునున్న గ్రామాల్లో పొలాల్లో ఉన్న బోర్లు ఒట్టిపోతున్నాయి. ఇసుక తోడేయ్యటం వలన బోర్లలో నీటిమట్టం పడిపోయి పంటలు ఎండిపోతున్నాయంటూ రైతులు వాపోతున్నారు. చినరావిపాడుకు చెందిన రైతులు చీమకుర్తిలో జేసీ గోపాలకృష్ణను కలిసి వినతిపత్రం అందజేశారు. ఇసుకదందాకు అడ్డుకట్ట వేసి పంటలను కాపాడాలని కోరారు.



ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్

ఎన్నికలు శాంతియుతంగా జరిగేలా పటిష్ట చర్యలు

• ఎస్పీ పరమేశ్వరరెడ్డి

ఒంగోలు క్రైం, మార్చి 19: ఎన్నికలు శాంతియుతంగా జరిగేందుకు పోలీసులు పటిష్టమైన చర్యలు చేపట్టాలని ఎస్పీ పి.పరమేశ్వరరెడ్డి ఆదేశించారు. మంగళవారం ఒంగోలులోని ఎస్పీ కార్యాలయంలో నియోజకవర్గాల నోడల్ అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో 18 చెక్‌పోస్టులు, 24 ఫ్లయింగ్ స్క్వాడ్‌లు ఏర్పాటు చేసినట్లు వివరించారు. నగదు, మద్యం, ఇతర వస్తువులు అక్రమంగా రవాణా జరగకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఆయా పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఆయుధ లైసెన్స్‌లు కలిగిన వారి వద్ద నుంచి ఆయుధాలను డిపాజిట్ చేయించాలని కోరారు. గత ఎన్నికలలో పోలింగ్ బూత్‌ల వద్ద జరిగిన గొడవలను దృష్టిలో ఉంచుకొని భద్రత ఏర్పాట్లు చేయాలని చెప్పారు. సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని సూచించారు. రాజకీయ నాయకులు, గ్రామ పెద్దలు, ప్రజలతో మమేకమై ఎన్నికల నియమావళిపై అవగాహన కల్పించాలని కోరారు. సమావేశంలో ఏఎస్పీలు కె.నాగేశ్వరరావు, శ్రీధరరావు, అశోక్ బాబు, డీఎస్పీ కిషోర్‌బాబు, రామరాజు, అశోక్‌వర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

పృథులగిరి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

మద్రిపూడి, మార్చి 19: పృథులగిరి లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. లక్ష్మీనరసింహుని ఉత్సవమూర్తులను స్థానిక వేణుగోపాలస్వామి దేవాలయం నుంచి ప్రత్యేక వాహనంలో తెచ్చి గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు స్వామివారికి కొబ్బరికాయలు కొట్టి హారతులు ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఉత్సవమూర్తులను పృథులగిరికి తరలించారు. రాత్రి అంకురారోహణ ఆలయ ప్రధానార్చకులు నారాయణం మారుతీచార్యుల ఆధ్వర్యంలో జరిగింది. ఉభయ దాతలు కొత్రా లక్ష్మీనారాయణ, రాజ్యలక్ష్మి దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈనెల 29వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు కొనసాగుతాయి. 24వ తేదీ జరగనున్న గరుడసేవకు రాష్ట్రం నలుమూలల నుంచి వేలాది మంది భక్తులు హాజరుకానున్నారు. 25న లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవం జరుగుతుంది.



అంకురార్పణలో పాల్గొన్న ఉభయదారులు

అవీ..ఇవీ..

ఎన్నికల కోడ్‌ను తప్పనిసరిగా పాటించాలి

నాగులుప్పలపాడు మార్చి 19: అధికారులు ఎన్నికల నియమావళికి అనుగుణంగా పనిచేయాలని ఎంపీడీవో మహాలక్ష్మి సూచించారు. మండలంలోని చవటపాలెం, కనపర్తి, అమ్మనబ్రోలు, వినోదరాయునిపాలెం గ్రామాల్లో మంగళవారం ఆమె పర్యటించారు. ఎన్నికల నిబంధనల మేరకు గ్రామాల్లో ఫ్లెక్సీలు తొలగింపు, విగ్రహాలకు ముసుగులను పరిశీలించారు. అనంతరం పంచాయతీ కార్యదర్శులతో సమావేశమై మాట్లాడుతూ గ్రామాల్లో ఎన్నికల కోడ్‌కు అనుగుణంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. అధికారులు ఎలాంటి ఆరోపణలు రాకుండా దని, నిబంధనలు అతిక్రమించిన వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

పేస్ పాలిటెక్నిక్ విద్యార్థులకు ఉద్యోగాలు

ఒంగోలు(విద్య), మార్చి 19: ఒంగోలులోని పేస్ పాలిటెక్నిక్ కళాశాలలో చదువుతున్న ఆరుగురు విద్యార్థులు స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో ఉద్యోగాలకు ఎంపికయ్యారు. వీరు మొదట రాతపరీక్ష, తర్వాత హెచ్‌ఆర్ ఇంటర్వ్యూలో ప్రతిభను చూపడంతో వీరిని ఉద్యోగాలకు ఎంపిక చేశారు. గోద్రెజ్ కన్స్యూమర్స్ కంపెనీ వీరికి రూ.3లక్షల రూపాయల వార్షిక వేతనం చెల్లిస్తుంది. ఈ సందర్భంగా కళాశాలలో ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను కరస్పాండెంట్ మద్దిశెట్టి శ్రీధర్ అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జి.కోటిరెడ్డి, ఇంజనీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ జీవీకే.మూర్తి, డీన్ కె.రూపాఅక్కేష్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ బి.రామరాజువర్మ తదితరులు పాల్గొన్నారు.

ఎనిమిది సిలిండర్లు స్వాధీనం



సిలిండర్లను స్వాధీనం చేసుకున్న అధికారులు

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 19: ఒంగోలు నగరం శివాలయం సెంటర్‌లోని ఒక హోటల్, ఒక ఫ్రూట్ స్టాల్‌లో వినియోగిస్తున్న ఎనిమిది డొమెస్టిక్ (ఇంట్లో వాడే సిలిండర్లు) సిలిండర్లను మంగళవారం పౌరసరఫరాల శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. డీఎస్‌వో ఉదయభాస్కర్ ఆధ్వర్యంలో ఆ శాఖ ఉద్యోగులు దాడులు నిర్వహించారు. డొమెస్టిక్ సిలిండర్లను స్వాధీనం చేసుకొని నిర్వాహకులపై 6ఎ కేసులను నమోదు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా హోటల్స్‌లో డొమెస్టిక్ సిలిండర్లను వినియోగిస్తే చర్యలు తప్పవని డీఎస్‌వో హెచ్చరించారు. హోటల్స్, తినుబండారాల దుకాణాలు, పానిపూరిబండ్లు, చికెన్ సెంటర్లు, వెల్డింగ్ సెంటర్లు తదితర వ్యాపార ప్రతినిధులు వాణిజ్య గ్యాస్ సిలిండర్లు వాడాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఫుడ్ ఇన్‌స్పెక్టర్ ఊతకోలు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య సూత్రాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న మెడికల్ విద్యార్థులు

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 19: ఒంగోలు ప్రభుత్వ వైద్యకళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో స్థానిక మంగమూరు రోడ్డులో మంగళవారం మెడికల్ విద్యార్థులు ఆరోగ్య సూత్రాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఇంటింటికి తిరుగుతూ కరపత్రాలను పంపిణీ చేశారు. బియ్యం, మైదా, పంచదారతో కూడిన పదార్థాలు తక్కువగా తీసుకోవాలని, అలాగే సమోసాలు, నూనెతో చేసిన బజ్జీలు, బొండాలు, ప్రాసెస్డ్ ఫుడ్స్ నుంచి దూరంగా ఉండాలని సూచించారు. జామపండు, నారింజ, దానిమ్మ, నేరేడు వంటి పండ్లు తీసుకోవాలని చెప్పారు. షుగర్, బీపీ ఉన్న వారు రాగులు, జొన్నలు, వరిగెలు, కొర్రలు, అరికెల వంటి చిరుధాన్యాలను వాడాలని పేర్కొన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి బి.తిరుమలరావు మాట్లాడుతూ డయాబెటిస్ వ్యాధిగ్రస్తులు తీపిపదార్థాలు తక్కువగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ హిమబిందు, పోస్టు గ్రాడ్యుయేట్స్ డాక్టర్ పి.విష్ణుప్రియ, వైద్యులు ప్రెస్సీ హర్షిత, వి.కిరణ్‌కుమార్, అనిల్, ఫ్లోరోసిస్ నివారణ అధికారి అబిజిత్, మణికంత, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్హతల వివరాలను నమోదు చేయాలి

ఒంగోలు(కలెక్టరేట్); మార్చి 19: జిల్లాలోని ప్రైవేటు వైద్యశాలలు, క్లినిక్‌లు, ల్యాబ్‌లు, డయాగ్నోస్టిక్స్ సెంటర్స్ కేంద్రాల వైద్యులు, స్టాఫ్ నర్సులు ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్‌లో తప్పనిసరిగా వారి వ్యక్తిగత, విద్యార్హతలు, కౌన్సిల్ వివరాలు నమోదు చేసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ ఎస్.రాజ్యలక్ష్మి మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. వివరాలను నమోదు చేసుకోకపోతే సెంటర్ల కొత్త రిజిస్ట్రేషన్లు, రెన్యువల్స్‌ను నిలిపివేస్తామని ఆమె హెచ్చరించారు.

రైజ్‌లో ముగిసిన వర్క్‌షాపు

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 19: ఒంగోలులోని రైజ్ కృష్ణ సాయిగాంధీ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్‌లో ఇంజనీరింగ్ తృతీయ సంవత్సరం సీఎస్ఈ విద్యార్థులకు ఐదు రోజులుగా నిర్వహిస్తున్న వర్క్‌షాపు మంగళవారంతో ముగిసిందని కళాశాల కరస్పాండెంట్ శిద్దా హనుమంతరావు తెలిపారు. పవర్ బి అనే అంశంపై నిర్వహించిన వర్క్‌షాపులో ప్రొఫెసర్ బి.ఓబులేషు ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. కార్యక్రమంలో గౌరవ చైర్మన్ ఇస్కాల చినరంగమన్నార్, ప్రిన్సిపాల్ కేవీ.సుబ్రహ్మణ్యం, సీఎస్ఈ విభాగాధిపతి వి.ఐజక్ పాల్గొన్నారు. పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు.

మల్లు స్వరాజ్యంకు నివాళులు



నివాళులర్పిస్తున్న ప్రతినిధులు

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 19: తెలంగాణ రైతాంగ పోరాట యోధురాలు, మహిళా ఉద్యమనేత మల్లు స్వరాజ్యం ద్వితీయ వర్ధంతిని ఘనంగా జరిగాయి. మంగళవారం ఒంగోలు నగరం సత్యనారాయణపురంలో మల్లు స్వరాజ్యం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా కార్యదర్శి రమాదేవి, జి.కళ్యాణి, పి.పద్మ, కె.కమల, నాగమణి, ఉషారాణి, కోటేశ్వరమ్మ, హరిణి, విజయలక్ష్మి, పి.భారతి, ఎ.సత్యవతి, పి.సుజాత పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



రాపర్లలో పరిశీలిస్తున్న తహసీల్దార్

నాగులుప్పలపాడు మార్చి 19 : మండలంలోని పలు గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ శ్రీనివాసరావు పరిశీలించారు. ముప్పాళ, మద్దిరాల, మట్టిగుంట, ఈదుమూడి, ఉప్పుగుండూరు, రాపర్ల తదితర గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాల్లోని ర్యాంప్ సౌకర్యం, విద్యుత్, తాగునీరు, మరుగుదొడ్లు, భవనాల పరిస్థితులను తనిఖీ చేశారు. ఉప్పుగుండూరు, రాపర్ల పోలింగ్ కేంద్రాలలో తక్షణమే ర్యాంప్ ఏర్పాటు, పలు గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాల భవనాలు మరమ్మతులు చేపట్టాలని ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. ఓ పోలింగ్ కేంద్రాన్ని స్టోర్ రూమ్‌గా వినియోగించడంతో తక్షణమే సామాన్లు తొలగించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్ఐ ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులు ఓటుహక్కు వినియోగించుకోవాలి

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 19 : సార్వత్రిక ఎన్నికల్లో వృద్ధులు ఎటువంటి ఇబ్బందులు లేకుండా తమ ఓటుహక్కును వినియోగించుకోవాలని స్వీప్ నోడల్ అధికారులు డాక్టర్ బి.రవి, జ్యోతి కోరారు. మంగళవారం ఒంగోలు నగరం ఊరచెరువులోని సమతా వృద్ధాశ్రమం, భాగ్యనగర్‌లోని ఆదర్శ వృద్ధాశ్రమంలో ఓటుహక్కుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో విభిన్నప్రతిభావంతుల సహాయ సంచాలకులు జి.అర్చన పాల్గొన్నారు.

పొగాకు గరిష్ఠ ధర రూ.232

టంగుటూరు, మార్చి 19 : పొగాకు గరిష్ఠ ధర కిలోకు రూ.232 లభించింది. కనిష్ఠ ధర రూ.220 దక్కింది. స్థానిక కేంద్రంలో మంగళవారం 819 బేళ్లను వేలానికి అనుమతించారు. అందులో 773 బేళ్లను కొనుగోలు చేసిన వ్యాపారులు 46 తిరస్కరించారు. 20 నోబిడ్, 21 సీఆర్ అయ్యాయి. వేలంలో 19 కంపెనీలు పాల్గొన్నాయి. సగటు ధర కిలోకు రూ.226.45 లభించింది. ఉత్పత్తి వ్యయం భారీగా పెరిగినందున ధరలు మరింత అధికంగా ఇవ్వాలని రైతులు కోరుతున్నారు.

ఆక్వా కల్చర్ సెమినార్ బ్రోచర్ ఆవిష్కరణ

ఒంగోలు(విద్య), మార్చి 19: ఒంగోలులోని ఆంధ్రకేసరి విశ్వ విద్యాలయంలో ఈనెల 27న జరిగే ఆక్వా కల్చర్ జాతీయ సెమినార్‌కు సంబంధించిన బ్రోచర్‌ను మంగళవారం వీసీ మారెడ్డి అంజిరెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ బి.హరిబాబు, ఎన్.నరేంద్రబాబు, ఎం.జగదీష్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రిగా ఎదిగి.. మాట మరిచి

- దోర్నాల మండలంలో అమలుకాని మంత్రి హామీలు
- రెండుసార్లు శాసనసభ్యులుగా ఎన్నిక


పాఠశాలలో చదువుతున్న బాలికలు

పెద్ద దోర్నాల, మార్చి 19: 'అంటే అన్నారంటారు. కానీ చేయాల్సిన పనులు చేయరు. అభిమానించి రెండు సార్లు పట్టాభిషేకం చేసిన ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకో లేకపోయారు. అవకాశం ఉన్నప్పటికీ, స్థానికంగా ఉన్న సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రిగా ఉన్న ఆదిమూలపు సురేష్ విఫలమయ్యారు.'

అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ ఏమాయే..!

ఎర్రగొండపాలెం నియోజకవర్గం అత్యంత వెనుకబాటు తనంతో అభివృద్ధికి ఆమడ దూరంలో ఉంది. దోర్నాల మండలంలో మరిన్ని సమస్యలు తిష్ట వేశాయి. దోర్నాలలో ప్రధానంగా మురికి నీటి సమస్య వేధిస్తోంది. ఇళ్లలోని వాడుక నీరు బయటకు పోయే వీలు లేక ఇళ్ల ముందే నిల్వ ఉంటోంది. దోమలు, ఈగలు వృద్ధి చెంది డెంగ్యూ, చికెన్‌గున్యా వంటి ప్రాణాంతక సీజనల్ వ్యాధులతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలోనే డ్రైనేజీ సమస్యను ప్రజలు మొదటిసారిగా ఎమ్మెల్యేగా ఎన్నికైనప్పుడు ఆదిమూలపు సురేష్ దృష్టికి తెచ్చారు. స్పందించిన ఆయన రూ.3కోట్ల నిధులు మంజూరుతో అండర్ డ్రైనేజీ నిర్మిస్తానని హామీ ఇచ్చారు. ఇప్పటికీ ఆ ఊసే లేదు. ప్రస్తుతం ఆయన పట్టణ పురపాలక శాఖ మంత్రిగా కూడా ఉన్నారు. కానీ నేటికీ సమస్య పరిష్కారం కాలేదు.

బాలికల ఉన్నత పాఠశాల ఎక్కడ..?

మండలంలో ఎక్కువగా చెంచు గిరిజనులతో పాటు పేద వర్గాల ప్రజలు నివసిస్తున్నారు. బాలికలు ఉన్నత విద్య నభ్యసించేందుకు ఇబ్బందులు పడలేక మధ్యలోనే చదువును ఆపేస్తున్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత


కాలువల్లో పేరుకుపోయిన మురుగునీరు

పాఠశాలలో కనీసం పదవ తరగతి వరకు చదివించేందుకు ఎక్కువ మంది తల్లిదండ్రులు ఆసక్తి కనబరుస్తున్నారు. దీంతో బాలురు కన్నా బాలికలే ఎక్కువగా ఉన్నారు. ఏటికేడు విద్యార్థునుల సంఖ్య పెరుగుతోంది. ఈ క్రమంలో బాలికల కోసం ప్రత్యేక పాఠశాలను ఏర్పాటు చేయాలని తల్లిదండ్రులు, పలువురు మంత్రి సురేష్‌కు విన్నవించారు. కచ్చితంగా ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. విద్యాశాఖ మంత్రిగా కూడా పని చేశారు. కానీ ఫలితం లేదు. ఆ సమస్య తీరనేలేదు.

బస్టాండ్ నిర్మిస్తారని చేస్తారని ఆశించి..

దేశంలోని శైవ క్షేత్రాల్లో దక్షిణ కాశీగా ప్రఖ్యాతి గాంచిన శ్రీశైలం పుణ్య క్షేత్రానికి నలుమూలల నుండి భక్తులు వస్తుంటారు. వీరందరూ దోర్నాల మీదుగా శ్రీశైలానికి ఘాట్ రోడ్డులో వెళ్తుంటారు. అదే క్రమంలో పుటపర్తి, బెంగళూరు, రాయచూర్, విజయవాడ వంటి నగరాలకు నిత్యం ఇక్కడి బస్టాండ్ నుంచి రాకపోకలు కొనసాగిస్తారు. అయినప్పటికీ, ఇక్కడ సరైన ఆర్‌టీసీ బస్టాండు లేదు. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రధానంగా వృద్ధులు, పిల్లలు మహిళలు అత్యవసర పరిస్థితుల్లో సరైన సదుపాయాలు లేక యాత్రికులు కష్టాలు పడుతున్నారు. ఈ విషయమై ప్రజలు పలుమార్లు మంత్రి దృష్టికి తెచ్చారు. స్పందించిన ఆయన ఆర్‌అండ్‌బీ స్థలాన్ని ఆర్‌టీసీకి బదలాయించేందుకు తన వంతు కృషి చేశారు.


కూలేందుకు సిద్ధంగా ఉన్న వాటర్‌ట్యాంకు

స్థానికులు కొందరు దాతృత్వంతో రేకులషెడ్డు ఏర్పాటు చేశారు. ఇటీవలే పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో మరుగుదొడ్లు నిర్మించారు. కానీ పూర్తి స్థాయిలో దృష్టి పెడితే ఈ పాటికి బస్టాండు నిర్మాణం పూర్తయ్యేదని పలువురు పేర్కొంటున్నారు. అంతేగాక దూపాడు నుంచి కృష్ణా జలాలు దోర్నాలకు రప్పించి రక్షిత తాగునీటిని అందిస్తానని కూడా చెప్పారు. పట్టించుకున్న దాఖలాలు మృగ్యమయ్యాయి. దీంతో మంత్రి సురేష్ హామీలు నీటి మూటలుగానే మిగిలిపోయాయి. దోర్నాల ప్రజల ఆశలు కలలుగానే మారాయి.

అవీ..ఇవీ..

ఎన్నికల విధులను బాధ్యతతో నిర్వహించాలి

- కలెక్టర్ దినేష్‌కుమార్



మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

కొండపి, మార్చి 19 : ఎన్నికల విధులను బాధ్యతతో నిర్వహించాలని కలెక్టర్ దినేష్‌కుమార్ అధికారులకు సూచించారు. ప్రతి ఒక్కరూ ఈసీ నిబంధనలకు విధిగా పాటించాలని స్పష్టం చేశారు. స్థానిక మండల పరిషత్ సమావేశం హాలులో నోడల్ అధికారులు, ఎంసీసీ, ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ, పోస్టల్ బ్యాలెట్ బృందం, వ్యయ నిర్వహణ టీమ్స్‌కు మంగళవారం శిక్షణ నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించడంలో అధికారుల పాత్ర కీలకమన్నారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలను పూర్తిగా అవగాహన చేసుకుని తూచా తప్పకుండా పాటించాలన్నారు. ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యేంత వరకు నియమావళిని కచ్చితంగా అమలు చేయడం, అభ్యర్థుల ఖర్చుల వివరాలు నమోదు చేయడం చాలా కీలకమని చెప్పారు. ఓటర్లను ప్రభావితం చేసే అంశాలను నిరోధించేందుకు పనిచేస్తున్న నోడల్ ఏజెన్సీలు ఈసీ మార్గదర్శకాలను విధిగా పాటించాలన్నారు. ఎన్నికల నిర్వహణపై రూపొందించిన సీవిజిల్ యాప్, ఎలక్షన్ సీజర్ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌లపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ సూచించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు, సీవిజల్, ఎలక్షన్ సీజర్ మేనేజ్మెంట్ సిస్టమ్‌లపై మాస్టర్ ట్రైనర్స్ అయిన జిల్లా ఆడిట్ అధికారి శంకరనారాయణరెడ్డి, ఉపాధి కల్పనాధికారి భరద్వాజ్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. కార్యక్రమంలో కొండపి నియోజకవర్గ ఏఆర్వో ఎ.కుమార్, ఒంగోలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ వైస్ చైర్మన్ విశ్వేశ్వరావు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి


పార్టీలోకి చేరుతున్న బీసీ, ఎస్సీలు

జరుగుమల్లి (కొండపి), మార్చి 19 : టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు మళ్లీ ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దామచర్ల సత్యన్నారాయణ (సత్య) అన్నారు. మండలంలోని కె.బిట్రగుంటలో సోమవారం రాత్రి జరిగిన ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. కొండపి అసెంబ్లీ స్థానం నుంచి టీడీపీ తరఫున పోటీచేస్తున్న డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామిని అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈసందర్భంగా గ్రామానికి చెందిన దాదాపు 50 ఎస్సీ, బీసీ కుటుంబాల వారు టీడీపీలో చేరాయి. వారందరికీ సత్య పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు పోకూరి రవీంద్రబాబు, సీనియర్ నాయకుడు పోటు శ్రీనివాసమురళి తదితరులు పాల్గొన్నారు.

23 నుంచి రాష్ట్ర స్థాయి క్రికెట్ టోర్నమెంట్

మార్కాపురం రూరల్, మార్చి 19: మండలంలోని కోలభీమునిపాడు గ్రామంలో ఈనెల 23 నుంచి రాష్ట్ర స్థాయి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు నిర్వాహక కమిటీ సభ్యులు చుట్ల అనిల్‌కుమార్ మంగళవారం తెలిపారు. ఈ టోర్నమెంట్‌లో గెలుపొందిన మొదటి విజేతకు రూ.50వేలు నగదు, రెండవ విజేతకు రూ.25వేలు, మూడో విజేతకు రూ.10వేలు నగదు బహుమతులను అందజేయనున్నట్లు తెలపారు. టోర్నమెంట్‌లో పోటీల్లో పాల్గొనే టీంలు రూ.900 ఎంట్రీఫీజును చెల్లించాలని కోరారు. వివరాలకు నిర్వాహకులు చుట్ల అనిల్ కుమార్ 8074250600 ఫోన్ నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

25 నుంచి ఉరుసు మహోత్సవం

గిద్దలూరు, మార్చి 19 : పట్టణంలోని కొప్పువారివీధిలోని దర్గాలో ఈ నెల 25 నుంచి 27వ తేదీ వరకు శ్రీహజరత్ దస్తగిరి స్వాముల వారి 107వ ఉరుసు మహోత్సవం నిర్వహిస్తున్నట్లు పీఠాధిపతి సయ్యద్ ఇమామ్‌హుస్సేన్ ఖాద్రి ఒక ప్రకటనలో తెలిపారు. 25న గంధపూజ, 26న ఉరుసుమహోత్సవం, ఖవాలి కార్యక్రమం, అన్నదానం, 27న గురుపూజ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

మహిళకు రక్తదానం

గిద్దలూరు, మార్చి 19 : పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో అత్యవసర పరిస్థితిలో ఉన్న ఓ మహిళకు శిరి రెస్టారెంట్ యజమాని బాలిరెడ్డి అనే దాత ద్వారా రక్తదానం చేయించి ఆదుకున్నట్లు మేమున్నాము సేవాసమితి అధ్యక్షులు చల్లా అశోక్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 10వ పర్యాయం రక్తదానం చేసిన బాలిరెడ్డిని అభినందించారు.

ద్విచక్ర వాహనాలు ఢీ.. ఒకరి మృతి

- మరొకరికి తీవ్రగాయాలు


మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ శివబసవరాజు

మద్రిపూడి, మార్చి 19 : రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ఒకరు అక్కడికక్కడే మృతి చెందారు. మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన మద్రిపూడి ఆర్‌అండ్‌బీ రోడ్డులో వెంకట కృష్ణాపురం గ్రామం వద్ద మంగళవారం చోటుచేసుకుంది. అందిన సమాచారం మేరకు.. ధర్మవరం గ్రామానికి చెందిన బారెడ్డి ఏడుకొండలు (63) కొండపిలో నివాసం ఉంటున్నారు. ప్రతి రోజూ స్వగ్రామంలో పాలు సేకరించేందుకు ద్విచక్రవాహనంపై వస్తుంటాడు. మంగళవారం కూడా అలాగే ధర్మవరంనకు బయల్దేరాడు. అదేసమయంలో గుండ్లసముద్రం గ్రామానికి చెందిన వీరమోసు వెంకటేశ్వర్లు కొండపి వైపు ద్విచక్రవాహనంపై వెళ్తున్నాడు. వెంకటకృష్ణాపురం వద్దకు చేరుకునే సరికి రెండు వాహనాలు ఎదురెదురు ఢీకొన్నాయి. ఏడుకొండలు తలకు తీవ్ర గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. వెంకటేశ్వర్లుకు తలకు కూడా తీవ్రమైన గాయాలు కావడంతో అపస్మారకస్థితిలోకి వెళ్లాడు. ఆయన్ను 108 వాహనంలో పొదిలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ఒంగోలులోని ప్రైవేటు వైద్యశాలకు తీసుకెళ్లారు. మృతుడి కుమారుడు రాఘవరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శివబసవరాజు తెలిపారు.

ఆక్రమణదారులపై అధికారుల చర్యలేవి ?


సచివాలయం కోసం కేటాయించిన స్థలంలో తీసిన కాలువ

పొదిలి, మార్చి 19 : కంభాలపాడు సచివాలయానికి కేటాయించిన స్థలంలో ఐదు రోజుల క్రితం ఆక్రమణదారుడు తీసిన కాలవపై అధికారులు చర్యలకు ఉపక్రమించకపోవడం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. సుమారుగా కోటి రూపాయలకుపైగా విలువ చేసే భూమిని యథేచ్ఛగా ఆక్రమించుకొని చూట్టూ కాలువ తీసినా చర్యలు లేవు. కంభాలపాడు గ్రామ సర్వేనెంబర్ 45-1 లో 2.11ఎకరాలు కుంట భూమి అందులో ఎకరం సచివాలయంతోపాటు పలు ప్రభుత్వం కేంద్రాలకు కేటాయించారు. అయితే ఆపొలం ప్రక్కనే ఆపొలం ప్రక్కనే ఉన్న పొలం యజమాని కుందురు వెంకట సుబ్బయ్య అనే వ్యక్తి 45- 1లో మిగిలిన ఎకర 11సెంట్లు ప్రభుత్వ భూమిని తనదే అంటూ దౌర్జన్యంగా పట్టపగలు ఆక్రమించి కాలువ తీశాడు. విషయం తెలుసుకున్న నగరపంచాయతీ, రెవెన్యూ అధికారులు ఆక్రమిత స్థలాన్ని అదేరోజు పరిశీలించారు. ఆ తరువాత ఏమైందో తెలీదుగాని ఆకాలువ అలాగనే వదిలేశారు. ప్రభుత్వ భూముల్లో పట్టపగలు కోట్ల రూపాయల విలువైన ఆస్తులను కొల్లగొట్టేందుకు ప్రయత్నించడం పట్టణంలో చర్చాంశనీయమైంది. ఒంగోలు నంద్యాల ప్రధాన రహదారిని ఆనుకొని ఒకవైపు, మరో వైపు సచివాలయంతోపాటు ప్రభుత్వ భవనాలు ఉండటంతో భూములకు రెక్కలొచ్చాయి. పరిశీలించిన అధికారులు వాస్తవ పరిస్థితిని ఉన్నతాధికారులకు నివేదించి వారి ఆదేశాల మేరకు పోలీసులకు ఫిర్యాదు చేస్తామని అధికారులు చెప్పారు. ఆవిధంగా చర్యలు ఉంటాయా..? లేక అధికారపార్టీ నాయకులు ఒత్తిడితో వదలేశారో తెలియాల్సి ఉంది. ఏదిఏమైనా ఉన్నతాధికారులు సత్వరమే జోక్యం చేసుకోకపోతే కోట్లాది రూపాయల స్థలం అన్యాక్రాంతమై పోవడంలో ఎలాంటి సందేహం లేదని పలువురు ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రెండు మూడు రోజుల్లో హద్దులు నిర్ణయించి ప్రభుత్వ భూమికి హద్దులు ఏర్పాటు చేస్తామని వీఆర్‌వో సుబ్బారెడ్డి, పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డిలు తెలిపారు.

ఆక్రమణలతో ఆవిరి అవుతున్న పెద్దచెరువు

- రాత్రి వేళలో గుట్టుగా గ్రావెల్ తవ్వకం
- పట్టపగలే యథేచ్ఛగా ఆక్రమణలు
- తొంగిచూడని అధికారులు


చెరువు పరిధిలో చదును చేసుకుంటున్న అక్రమార్కులు

పొదిలి, జనవరి 19 : పొదిలి పెద్దచెరువులో అడ్డుఅదుపు లేకుండా మట్టితవ్వకాలు జరుగుతు న్నాయి. నాయకుల అండదండలతో చెరువులో అక్రమంగా మట్టితవ్వకాలు జోరుగా చేస్తున్నారు. దీంతో కొత్తవెంచర్ యజమానులకు పెద్ద చెరువు మట్టి అడ్డాగా మారింది. అయినా అధికారులకు మాత్రం ఆ ప్రాంతంలో ఏమి జరుగుతుందో చూడటం లేదు. అసలు ప్రభుత్వ ఆస్తులు ఉన్నాయా..? లేవా..? అని కూడా వారికి పట్టడం లేదని పలువురు ప్రజలు విమర్శిస్తున్నారు.

యథేచ్ఛగా ఆక్రమణలు

ఇదే అదునుగా కొందరు ఆక్రమణ దారులు యథేచ్ఛగా ఆక్రమించి నిర్మాణాలు చేసుకుంటు న్నారు. ముందుగా ఆక్రమించి చిన్న రేకుల షెడ్డు వేసుకొని ఆతరువాత రేకుల షెడ్డు చూట్టూ నా స్థలంగా చెప్పుకుంటూ అమ్ముకొని సొమ్ము చేసుకుంటున్నారు. గతంలో దర్శి నుండి వచ్చిన వ్యక్తి చెరువు మధ్యలో ఓ ప్రార్థనా మందిరం నిర్మించారు. దానిపై ఫిర్యాదు వచ్చినా ఇంత వరకు దానిపై చర్యలు తీసుకోలేదు. అంతే కాకుండా ప్రస్తుతం ఆ ప్రార్థనా మందిరం స్థలం పక్కనే మరికొందరు ఆక్రమణదారులు చిల్లచెట్లు తొలగించి చదును చేసేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. అయినా ఎదేమిటని ప్రశ్నించే అధికారి లేడు. ఆవిధంగా పెద్దచెరువు ఇప్పటికే పావుభాగం ఆక్రమణకు గురైంది. వాటిపై చర్య లు లేకపోవడంతో ఇప్పుడు మరికొంతమంది ఆదే దారిలో వెళుతూ ఆక్రణలకు పాల్పడుతున్నారు. ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా విచారణ శూన్య మని బహిరంగంగా విమర్శిస్తున్నారు. జిల్లా అధికారులకు తెలిపినా ఫలితం శూన్యంగా ఉంది. దీంతో మరి విచ్చలవిడిగా ఆక్రణలకు పాల్పడు తున్నారు. ఆక్రమణదారులపై చర్యలు తీసుకోలే దంటే అధికారుల చిత్తశుద్ధి ఇట్టే అర్థమౌతోందిని విమర్శిస్తున్నారు. ఏదిఏమైన ఆక్రమణలపై దృష్టి సారించాలని పలువురు పట్టణ వాసులు కోరుతు న్నారు.

గతంలోనే హద్దులు నిర్ణయించాం

గతంలో చెరవుకు హద్దులు నిర్ణయించాం. ప్రస్తుతం ఆ హద్దుల లోపు ఎలాంటి నిర్మాణం ఉన్నా చట్టప్రకారం చర్యలు తీసుకుంటాం. కొత్త ఆక్రమణలను ఉపేక్షించం.

రవికుమార్, ఇరిగేషన్ ఏఈ

ముగిసిన నారాయణ స్వామి బ్రహ్మోత్సవాలు

మార్కాపురం వన్‌టౌన్, మార్చి 18: మార్కాపురం పట్టణంలోని జవహర్‌నగర్ కాలనీలో వెలసిన ఆమలక లక్ష్మీనారాయణస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు మంగళవారం వైభవంగా ముగిశాయి. ఉత్సవాల్లో భాగంగా ఆంజనేయ స్వామికి విశేష పూజలు చేశారు. లక్ష్మీనారాయణ స్వామి కల్యాణం అనంతరం పలువురు దేవతా మూర్తులకు విశేష పూజలు చేయడం ఇక్కడ గమనార్హం. ఆంజనేయస్వామి విగ్రహానికి వివిధ అభిషేకాలు, అర్చనలు చేశారు. తమలపాకులతో అర్చన, వడ మాలలు సమర్పించారు. ఈ సందర్భంగా మహిళలు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు డా. డీవీకృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి పాలెం చెంచయ్య, కోశాధి కారి వై.వెంకటరెడ్డిల ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు.


పూజలు చేస్తున్న భక్తులు


ప్రత్యేక అలంకరణలో ఆంజనేయ స్వామి

నకిలీ కులధ్రువీకరణ పత్రాలపై విచారించాలి


తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎస్టీలు

త్రిపురాంతకం, మార్చి 19: నకిలీ కులధ్రువీకరణ పత్రాలు పొందిన వారిని విచా రించి వాటిని రద్దు చేయాలని పలువురు ఎస్టీలు స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. మండల కేంద్రంలోని బ్రహ్మంగారికాలనీకి చెందిన కొందరు గత 25 ఏళ్ల క్రితం ఇతర ప్రాంతాల నుండి వలస వచ్చారన్నారు. ఇక్కడ ఎస్టీ కులధ్రువీకరణ పత్రాలు తీసుకున్నారన్నారు. దానిపై విచారించి రద్దు చేసి అసలు ఎస్టీలైన తమకు న్యాయం చేయాలని కోరారు. మోతే నాగరాజు అనే వ్యక్తి నంద్యాల జిల్లా జూపాడు బంగ్లా ప్రాంతం నుండి కొన్ని కుటుంబాలతో ఇక్కడికి వలస వచ్చాడన్నారు. నకిలీ కులధ్రువీకరణ పత్రాలతో ఎస్టీలుగా చలామణి అవుతున్నారని, ప్రభుత్వం నుండి అన్ని రకాలుగా లబ్ధి పొందుతున్నారన్నారు. దీంతో అసలు ఎస్టీలైన తమకు అన్ని విధాలా అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ మేరకు తహసీల్దారు బి.రామకృష్ణ శివప్రసాద్‌కు వినతిపత్రాన్ని అంజేశారు.

ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలి

● మాజీ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి



మాట్లాడుతున్న కందుల నారాయణరెడ్డి

మార్కాపురం రూరల్, మార్చి 19: ఎన్నికలలో టీడీపీ గెలుపు కోసం కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని మాజీ ఎమ్మెల్యే టీడీపీ నియోజకవర్గ అభ్యర్థి కందుల నారాయణరెడ్డి కార్యకర్తలను కోరారు. పట్టణంలోని జవహర్‌నగర్ కాలనీలోని మాజీ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ఇంటి వద్ద మార్కాపురం పట్టణ కార్యకర్తలతో మంగళవారం రాత్రి విలేకర్లతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటికి తిరిగి వైసీపీ ప్రభుత్వం చేసిన అరాచకాలు, ప్రజా వ్యతిరేక విధానాలను వివరించి టీడీపీకి ఓటు వేయించాలని కోరారు. వైసీపీ నాయకులు కేవలం డబ్బు ప్రభావంతో ఎన్నికలలో గెలవాలని ప్రయత్నం చేస్తున్నారన్నారు. 22 ఏళ్ల నుంచి మార్కాపురం నియోజకవర్గంలో ప్రజా సమస్యలపై పోరాడతున్నామన్నారు. ఈ విషయాలను ప్రతి ఒక్కరికి వివరించాలని కోరారు. అధికారంలోకి వచ్చిన వెంటనే మార్కపురం జిల్లా కేంద్రం ప్రకటన, నియోజకర్గం అభివృద్ధి అన్ని విధాల ముందుకు తీసుకెళ్లనుట్లు తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జ్ కందుల రామిరెడ్డి, టీడీపీ పట్టణ అధ్యక్షులు మౌలాలి, క్లస్టర్ ఇన్‌చార్జ్ వక్కలగడ్డ మల్లికార్జున, కొప్పుల శ్రీనివాసులు, డి.మస్తాన్, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నకిలీ కులధ్రువపత్రాలపై విచారించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎస్టీలు

త్రిపురాంతకం, మార్చి 19: నకిలీ కులధ్రువీకరణ పత్రాలు పొందిన వారిని విచా రించి వాటిని రద్దు చేయాలని పలువురు ఎస్టీలు స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. మండల కేంద్రంలోని బ్రహ్మంగారికాలనీకి చెందిన కొందరు గత 25 ఏళ్ల క్రితం ఇతర ప్రాంతాల నుండి వలస వచ్చారన్నారు. ఇక్కడ ఎస్టీ కులధ్రువీకరణ పత్రాలు తీసుకున్నారన్నారు. దానిపై విచారించి రద్దు చేసి అసలు ఎస్టీలైన తమకు న్యాయం చేయాలని కోరారు. మోతే నాగరాజు అనే వ్యక్తి నంద్యాల జిల్లా జూపాడు బంగ్లా ప్రాంతం నుండి కొన్ని కుటుంబాలతో ఇక్కడికి వలస వచ్చాడన్నారు. నకిలీ కులధ్రువీకరణ పత్రాలతో ఎస్టీలుగా చలామణి అవుతున్నారని, ప్రభుత్వం నుండి అన్ని రకాలుగా లబ్ధి పొందుతున్నారన్నారు. దీంతో అసలు ఎస్టీలైన తమకు అన్ని విధాలా అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ మేరకు తహసీల్దారు బి.రామకృష్ణ శివప్రసాద్‌కు వినతిపత్రాన్ని అంజేశారు.

వ్యక్తిపై గొడ్డలితో దాడికి యత్నం

● స్థలం విషయంలో ఇరువురి మధ్య ఘర్షణ

మార్కాపురం రూరల్, మార్చి 19: మండలంలోని బోడపాడు గ్రామంలో స్థలం విషయంలో ఇద్దరు వ్యక్తులు ఘర్షణపడి ముక్కమల్ల సుదర్శన్‌రెడ్డి అనే వ్యక్తిపై మరో వ్యక్తి బంకా పోలురాజు గొడ్డలితో దాడికి యత్నించాడు. ఈ ఘటన మంగళవారం చోటుచేసుకుంది. బోడపాడు గ్రామానికి చెందిన బంకా పోలురాజు, ముక్కమల్ల సుదర్శన్‌రెడ్డిలు స్థలం విషయంలో చిన్నపాటి ఘర్షణకు దిగినట్లు పోలీసులు తెలిపారు.

ఆక్రమణదారులపై చర్యలేవి?



సచివాలయం కోసం కేటాయించిన స్థలంలో తీసిన కాలువ

పొదిలి, మార్చి 19 : కంభాలపాడు సచివాలయానికి కేటాయించిన స్థలంలో ఐదు రోజుల క్రితం ఆక్రమణదారుడు తీసిన కాలవపై అధికారులు చర్యలకు ఉపక్రమించకపోవడం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. సుమారుగా కోటి రూపాయలకుపైగా విలువ చేసే భూమిని యథేచ్ఛగా ఆక్రమించుకొని చుట్టూ కాలువ తీసినా చర్యలు లేవు. కంభాలపాడు గ్రామ సర్వేనెంబర్ 45-1 లో 2.11ఎకరాలు కుంట భూమి అందులో ఎకరం సచివాలయంతోపాటు పలు ప్రభుత్వం కేంద్రాలకు కేటాయించారు. అయితే ఆపొలం ప్రక్కనే ఆపొలం ప్రక్కనే ఉన్న పొలం యజమాని కుందురు వెంకట సుబ్బయ్య అనే వ్యక్తి 45- 1లో మిగిలిన ఎకర 11సెంట్లు ప్రభుత్వ భూమిని తనదే అంటూ దౌర్జన్యంగా పట్టపగలు ఆక్రమించి కాలువ తీశాడు. విషయం తెలుసుకున్న నగరపంచాయతీ, రెవెన్యూ అధికారులు ఆక్రమిత స్థలాన్ని అదేరోజు పరిశీలించారు. ఆ తరువాత ఏమైందో తెలీదుగాని ఆకాలువ అలాగనే వదిలేశారు. ప్రభుత్వ భూముల్లో పట్టపగలు కోట్ల రూపాయల విలువైన ఆస్తులను కొల్లగొట్టేందుకు ప్రయత్నించడం పట్టణంలో చర్చాంశనీయమైంది. ఒంగోలు నంద్యాల ప్రధాన రహదారిని అనుకొని ఒకవైపు, మరో వైపు సచివాలయంతోపాటు ప్రభుత్వ భవనాలు ఉండటంతో భూములకు రెక్కలొచ్చాయి. పరిశీలించిన అధికారులు వాస్తవ పరిస్థితిని ఉన్నతాధికారులకు నివేదించి వారి ఆదేశాల మేరకు పోలీసులకు ఫిర్యాదు చేస్తామని అధికారులు చెప్పారు. ఆవిధంగా చర్యలు ఉంటాయా..? లేక అధికారపార్టీ నాయకులు ఒత్తిడితో వదలేశారో తెలియాల్సి ఉంది. ఏదిఏమైనా ఉన్నతాధికారులు సత్వరమే జోక్యం చేసుకోకపోతే కోట్లాది రూపాయల స్థలం అన్యాక్రాంతమై పోవడంలో ఎలాంటి సందేహం లేదని పలువురు ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండు మూడు రోజుల్లో హద్దులు నిర్ణయించి ప్రభుత్వ భూమికి హద్దులు ఏర్పాటు చేస్తామని వీఆర్‌వో సుబ్బారెడ్డి, పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డిలు తెలిపారు.

పోలీసుల అదుపులో నిందితులు ?

గిద్దలూరు టౌన్, మార్చి 19 : గిద్దలూరు మండలం గడికోట పంచాయతీలోని పరమేశ్వర్‌నగర్‌లో టీడీపీ నాయకుడు మునయ్య హత్యకు సంబంధించి నలుగురు నిందితులు ప్రస్తుతం పోలీసుల అదుపులో ఉన్నట్లు తెలిసింది. చిలకలూరిపేటలో ప్రజాగళం సభకు వెళ్ళినందుకు సోమవారం రాత్రి పరమేశ్వర్‌నగర్‌లో టీడీపీ నాయకుడు పాముల మునయ్యపై ఇదే గ్రామానికి చెందిన వైసీపీ కార్యకర్తలు అల్లూరయ్య, రంగనాయకులు, ప్రేమ్‌కుమార్, ఈశ్వరయ్యలు దాడి చేసి గొడ్డలితో తీవ్రంగా గాయపరిచారు. గాయపడిన మునయ్యను హైదరాబాద్‌లోని కిమ్స్ ఆసుపత్రికి తరలించి చికిత్స చేయిస్తుండగా మునయ్య మృతిచెందాడు. మునయ్యను గాయపరచిన అనంతరం నిందితులు పరారు కాగా పోలీసు అధికారులు ప్రత్యేకంగా 3 టీములను నియమించి నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. మంగళవారం మధ్యాహ్నం నిందితులను పోలీసులు పట్టుకున్నట్లు తెలిసింది. ఇదిలావుండగా నిందితులను వైసీపీ నాయకులు తమ పలుకుబడిని ఉపయోగించి ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా ముందస్తు ఒప్పందంతో పోలీసులకు లొంగిపోయేలా చేసినట్లు విశ్వసనీయ సమాచారం.

ఎన్నికలు పటిష్టం నిర్వహించేందుకు చర్యలు

ఒంగోలు క్రైం, మార్చి 19: ఎన్నికలు శాంతియుతంగా జరిగేందుకు పోలీసులు పటిష్టమైన చర్యలు చేపట్టాలని ఎస్పీ పి.పరమేశ్వరరెడ్డి ఆదేశించారు. మంగళవారం ఒంగోలులోని ఎస్పీ కార్యాలయంలో నియోజకవర్గాల నోడల్ అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో 18 చెక్ పోస్టులు, 24 ఫ్లయింగ్ స్క్వాడ్‌లు ఏర్పాటు చేసినట్లు వివరించారు. నగదు, మద్యం, ఇతర వస్తువులు అక్రమంగా రవాణా జరగకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఆయా పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఆయుధ లైసెన్స్‌లు కలిగిన వారి వద్ద నుంచి ఆయుధాలను డిపాజిట్ చేయించాలని కోరారు. గత ఎన్నికలలో పోలింగ్ బూత్‌ల వద్ద జరిగిన గొడవలను దృష్టిలో ఉంచుకొని భద్రత ఏర్పాట్లు చేయాలని చెప్పారు. సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని సూచించారు. ఎన్నికల సంబంధిత ఫిర్యాదులపై సత్వరం స్పందించాలన్నారు. రాజకీయ నాయకులు, గ్రామ పెద్దలు, ప్రజలతో మమేకమై ఎన్నికల నియమావళిపై అవగాహన కల్పించాలని కోరారు. సమావేశంలో ఏఎస్పీలు కె.నాగేశ్వరరావు, శ్రీధరరావు, అశోక్‌బాబు, డీఎస్పీ కిషోర్‌బాబు, రామరాజు, అశోక్‌వర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలోకి వలసల పరంపర

ఒకేరోజు టీడీపీలోనికి 500 కుటుంబాలు



టీడీపీలో చేరిన ఓబులరెడ్డిపల్లె గ్రామస్థులు

గిద్దలూరు టౌన్, మార్చి 19 : వైసీపీని వీడి ఆ పార్టీ శ్రేణులు టీడీపీలోనికి వరస కడుతున్నారు. దీంతో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి గిద్దలూరు నియోజకవర్గంలో వరసగా ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. రెండు మూడు రోజుల నుంచి నియోజకవర్గంలోని పలు గ్రామాల నుండి వైసీపీ నాయకులు, కార్యకర్తలు ఆపార్టీని వీడి టీడీపీలో చేరారు. వీరందరికీ టీడీపీ అభ్యర్థి ముత్తుముల అశోక్‌రెడ్డి పార్టీ కండువా కప్పి ఆహ్వానిస్తున్నారు. ప్రధానంగా తాను స్థానికుడినని, నియోజకవర్గంలో నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటానని చెబుతూ తాను శాసనసభ్యునిగా ఉన్న కాలంలో నియోజకవర్గానికి రూ.1300 కోట్ల నిధులతో అభివృద్ధి పనులు చేపట్టిన విషయాలను గుర్తు చేస్తున్నారు. తాజాగా మంగళవారం గిద్దలూరు మండలం ముండ్లపాడు గ్రామానికి చెందిన 250 మంది ముస్లింలు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. వీరందరికీ ముత్తుముల అశోక్‌రెడ్డి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ముండ్లపాడు గ్రామానికి చెందిన మండల కో-ఆప్షన్ సభ్యులు పఠాన్ సయ్యద్ పీరాఖాన్ ఆధ్వర్యంలో కార్యకర్తలు చేరారు. పెద్దఎత్తున ముస్లింలు పార్టీలోకి వచ్చి తనకు మద్దతు ఇవ్వడంపై అశోక్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీల కూటమి అభ్యర్థిగా తాను పోటీ చేస్తున్నానని, అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు మార్తాల సుబ్బారెడ్డి, జడ్పీటీసీ సభ్యుడు బుడత మధుసూదన్, టీడీపీ నాయకులు కడియం శేషగిరి, బొమ్మినేని వెంకటేశ్వర్లు, శివపురం మురళీకృష్ణ చేరెడ్డి జయరామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



అశోక్‌రెడ్డి సమక్షంలో టీడీపీలో చేరిన ముస్లింలు

ఓబులరెడ్డిపల్లె నుంచి 40 కుటుంబాలు

రాచర్ల మండలం పాలకవీడు పంచాయతీ పరిధిలోని ఓబులరెడ్డిపల్లె గ్రామానికి చెందిన 40 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. వీరందరికీ ముత్తుముల అశోక్‌రెడ్డి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. టీడీపీలో చేరిన వారిలో సూరా బాలరంగారెడ్డి, మండ్ల కాశీరావు, బొంతా ప్రభాకర్, సూరా రామచంద్రారెడ్డి, యనుముల రామిరెడ్డి, గంగుల పెద్దిరాజు, సూరా రాఘవేంద్ర రెడ్డి, యనుమల రమణరెడ్డి, కొండా రాజశేఖర్ రెడ్డి, పందన బోయిన పెద్దబాలరంగయ్య, బొగ్గు కాశీరావు, సూరా లక్ష్మీరెడ్డి, మండ్ల కాశీరావు తదితరరులున్నారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు రెడ్డి కాశిరెడ్డి, యడవల్లి శ్రీధర్‌రెడ్డి, ఓబులరెడ్డి, నంది శ్రీను, రాఘవరెడ్డి పాల్గొన్నారు.

ముగిసిన నారాయణ స్వామి బ్రహ్మోత్సవాలు

మార్కాపురం వన్‌టౌన్, మార్చి 18: మార్కాపురం పట్టణంలోని జవహర్‌నగర్ కాలనీలో వెలసిన ఆమలక లక్ష్మీనారాయణస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు మంగళవారం వైభవంగా ముగిశాయి. ఉత్సవాల్లో భాగంగా ఆంజనేయస్వామికి విశేష పూజలు చేశారు. లక్ష్మీనారాయణస్వామి కల్యాణం అనాంతరం పలువురు దేవతామూర్తులకు విశేష పూజలు చేయడం ఇక్కడ గమనార్హం. ఆంజనేయస్వామి విగ్రహానికి వివిధ అభిషేకాలు, అర్చనలు చేశారు. తమలపాకులతో అర్చన, వడ మాలలు సమర్పించారు. ఈ సందర్భంగా మహిళలు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు డా. డీవీకృష్ణా రెడ్డి, ప్రధాన కార్యదర్శి పాలెం చెంచయ్య, కోశాధి కారి వై.వెంకటరెడ్డిల ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు.





హాజరైన భక్తులు, అభిషేకాలు నిర్వహిస్తున్న అర్చకులు



ప్రత్యేక అలంకరణలో ఆంజనేయ స్వామి

ఆక్రమణలతో ఆవిరవుతున్న పెద్దచెరువు

● రాత్రి వేళలో గుట్టుగా గ్రావెల్ తవ్వకం
● పట్టపగలే యథేచ్ఛగా ఆక్రమణలు
● తొంగిచూడని అధికారులు



చెరువు పరిధిలో చదును చేసుకుంటున్న ఆక్రమార్కులు

పొదిలి, జనవరి 19 : పొదిలి పెద్దచెరువులో అడ్డుఅదుపు లేకుండా మట్టితవ్వకాలు జరుగుతున్నాయి. నాయకుల అండదండలతో చెరువులో అక్రమంగా మట్టితవ్వకాలు జోరుగా చేస్తున్నారు. దీంతో కొత్తవెంచర్ యజమానులకు పెద్దచెరువు మట్టి అడ్డాగా మారింది. అయినా అధికారులకు మాత్రం ఆ ప్రాంతంలో ఏమి జరుగుతుందో చూడటం లేదు. అసలు ప్రభుత్వ ఆస్తులు ఉన్నాయా..? లేవా..? అని కూడా వారికి పట్టడం లేదని పలువురు ప్రజలు విమర్శిస్తున్నారు.

యథేచ్ఛగా ఆక్రమణలు

ఇదే అదునుగా కొందరు ఆక్రమణ దారులు యథేచ్ఛగా ఆక్రమించి నిర్మాణాలు చేసుకుంటున్నారు. ముందుగా ఆక్రమించి చిన్న రేకుల షెడ్డు వేసుకొని ఆతరువాత రేకుల షెడ్డు చూట్టూ నా స్థలంగా చెప్పుకుంటూ అమ్ముకొని సొమ్ము చేసుకుంటున్నారు. గతంలో దర్శి నుండి వచ్చిన వ్యక్తి చెరువు మధ్యలో ఓ ప్రార్థనా మందిరం నిర్మించారు. దానిపై ఫిర్యాదు వచ్చినా ఇంత వరకు దానిపై చర్యలు తీసుకోలేదు. అంతే కాకుండా ప్రస్తుతం ఆ ప్రార్థనా మందిరం స్థలం పక్కనే మరికొందరు ఆక్రమణదారులు చిల్లచెట్లు తొలగించి చదును చేసేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. అయినా ఏదేమిటని ప్రశ్నించే అధికారి లేదు. ఆవిధంగా పెద్దచెరువు ఇప్పటికే పావుభాగం ఆక్రమణకు గురైంది. వాటిపై చర్యలు లేకపోవడంతో ఇప్పుడు మరికొంతమంది ఆదే దారిలో వెళుతూ ఆక్రణలకు పాల్పడుతున్నారు. ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా విచారణ శూన్యమని బహిరంగంగా విమర్శిస్తున్నారు. జిల్లా అధికారులకు తెలిపినా ఫలితం శూన్యంగా ఉంది. దీంతో మరి విచ్చలవిడిగా ఆక్రణలకు పాల్పడుతున్నారు. ఆక్రమణదారులపై చర్యలు తీసుకోలేదంటే అధికారుల చిత్తశుద్ది ఇట్టే అర్థమౌతోందిని విమర్శిస్తున్నారు. ఏదిఏమైన ఆక్రమణలపై దృష్టి సారించాలని పలువురు పట్టణ వాసులు కోరుతున్నారు.

గతంలోనే హద్దులు నిర్ణయించాం

గతంలో చెరవుకు హద్దులు నిర్ణయించాం. ప్రస్తుతం ఆ హద్దుల లోపు ఎలాంటి నిర్మాణం ఉన్నా చట్టప్రకారం చర్యలు తీసుకుంటాం. కొత్త ఆక్రమణలను ఉపేక్షించం.

రవికుమార్, ఇరిగేషన్ ఏఈ

పృథులగిరి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

ఉత్సవమూర్తులకు విశేషంగా గ్రామోత్సవం

మర్రిపూడి, మార్చి 19 : పృథులగిరి లక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. లక్ష్మీనరసింహుని ఉత్సవ మూర్తులను స్థానిక వేణుగోపాలస్వామి దేవాలయం నుంచి ప్రత్యేక వాహనంలో తెచ్చి గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు స్వామివారికి కొబ్బరికాయలు కొట్టి హారతులు ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఉత్సవమూర్తులను పృథులగిరికి తరలించారు. రాత్రి అంకురారోహణ ఆలయ ప్రధానార్చకులు నారాయణం మారుతీచార్యుల ఆధ్వర్యంలో జరిగింది. ఉభయదాతలు కొట్రా లక్ష్మీ నారాయణ, రాజ్య లక్ష్మి దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈనెల 29వ తేదీ వరకు బ్రహ్మోత్స వాలు కొనసాగుతాయి. 24వ తేదీ జరగ నున్న గరుడసేవకు రాష్ట్రం నలుమూలల నుంచి వేలాది మంది భక్తులు హాజరు కానున్నారు. 25న లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవం జరుగుతుంది.



అంకురారోహణలో పాల్గొన్న ఉభయదాతలు

మంత్రిగా ఎదిగి.. మాట మరిచి

● దోర్నాల మండలంలో అమలుకాని మంత్రి హామీలు
● రెండు సార్లు శాసనసభ్యులుగా ఎన్నిక

పెద్ద దోర్నాల, మార్చి 19: 'అంటే అన్నారంటారు. కానీ చేయాల్సిన పనులు చేయరు. అభిమానించి రెండు సార్లు పట్టాభిషేకం చేసిన ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోలేకపోయారు. అవకాశం ఉన్నప్పటికీ, స్థానికంగా ఉన్న సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రిగా ఉన్న ఆదిమూలపు సురేష్ విఫలమయ్యారు.'

అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ ఏమాయే..!

ఎర్రగొండపాలెం నియోజకవర్గం అత్యంత వెనుకబాటుతనంతో అభివృద్ధికి ఆమడ దూరంలో ఉంది. దోర్నాల మండలంలో మరిన్ని సమస్యలు తిష్ట వేశాయి. దోర్నాలలో ప్రధానంగా మురికి నీటి సమస్య వేధిస్తోంది. ఇళ్లలోని వాడుక నీరు బయటకు పోయే వీలు లేక ఇళ్ల ముందే నిల్వ ఉంటోంది. దోమలు, ఈగలు వృద్ధి చెంది డెంగ్యూ, చికెన్‌గున్యా వంటి ప్రాణాంతక సీజనల్ వ్యాధులతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలోనే డ్రైనేజీ సమస్యను ప్రజలు మొదటిసారిగా ఎమ్మెల్యేగా ఎన్నికైనప్పుడు ఆదిమూలపు సురేష్ దృష్టికి తెచ్చారు. స్పందించిన ఆయన రూ.3కోట్ల నిధులు మంజూరుతో అండర్ డ్రైనేజి నిర్మిస్తానని హామీ ఇచ్చారు. ఇప్పటికీ ఆ ఊసే లేదు. ప్రస్తుతం ఆయన పట్టణ పురపాలక శాఖ మంత్రిగా కూడా ఉన్నారు. కానీ నేటికీ సమస్య పరిష్కారం కాలేదు.



అస్తవ్యస్త కాలువల్లో పేరుకుపోయిన మురుగునీరు

బాలికల ఉన్నత పాఠశాల ఎక్కడ..?

మండలంలో ఎక్కువగా చెంచు గిరిజనులతో పాటు పేద వర్గాల ప్రజలు నివసిస్తున్నారు. బాలికలు ఉన్నత విద్య నభ్యసించేందుకు ఇబ్బందులు పడలేక మధ్యలోనే చదువును ఆపేస్తున్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కనీసం పదవ తరగతి వరకు చదివించేందుకు ఎక్కువ మంది తల్లిదండ్రులు ఆసక్తి కనబరుస్తున్నారు. దీంతో బాలురు కన్నా బాలికలే ఎక్కువగా ఉన్నారు. ఏటికేడు విద్యార్థునుల సంఖ్య పెరుగుతోంది. ఈ క్రమంలో బాలికల కోసం ప్రత్యేక పాఠశాలను ఏర్పాటు చేయాలని తల్లిదండ్రులు, పలువురు మంత్రి సురేష్‌కు విన్నవించారు. కచ్చితంగా ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. విద్యాశాఖ మంత్రిగా కూడా పని చేశారు. కానీ ఫలితం లేదు. ఆ సమస్య తీరనేలేదు.





కూలేందుకు సిద్ధంగా ఉన్న వాటర్ ట్యాంకు, పాఠశాల్లో చదువుతున్న బాలికలు

బస్టాండ్ నిర్మిస్తారని చేస్తారని ఆశించి..

దేశంలోని శైవ క్షేత్రాల్లో దక్షిణ కాశీగా ప్రఖ్యాతి గాంచిన శ్రీశైలం పుణ్య క్షేత్రానికి నలుమూలల నుండి భక్తులు వస్తుంటారు. వీరందరూ దోర్నాల మీదుగా శ్రీశైలానికి ఘాట్ రోడ్డులో వెళ్తుంటారు. అదే క్రమంలో పుటపర్తి, బెంగళూరు, రాయచూర్, విజయవాడ వంటి నగరాలకు నిత్యం ఇక్కడి బస్టాండ్ నుంచి రాకపోకలు కొనసాగిస్తారు. అయినప్పటికీ, ఇక్కడ సరైన ఆర్టీసీ బస్టాండు లేదు. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రధానంగా వృద్ధులు, పిల్లలు మహిళలు అత్యవసర పరిస్థితుల్లో సరైన సదుపాయాలు లేక యాత్రికులు కష్టాలు పడుతున్నారు. ఈ విషయమై ప్రజలు పలుమార్లు మంత్రి దృష్టికి తెచ్చారు. స్పందించిన ఆయన ఆర్‌అండ్‌బీ స్థలాన్ని ఆర్టీసీకి బదలాయించేందుకు తన వంతు కృషి చేశారు. స్థానికులు కొందరు దాతృత్వంతో రేకులషెడ్డు ఏర్పాటు చేశారు. ఇటీవలే పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో మరుగుదొడ్లు నిర్మించారు. కానీ పూర్తి స్థాయిలో దృష్టి పెడితే ఈ పాటికి బస్టాండు నిర్మాణం పూర్తయ్యేదని పలువురు పేర్కొంటున్నారు. అంతేగాక దూపాడు నుంచి కృష్ణా జలాలు దోర్నాలకు రప్పించి రక్షిత తాగునీటిని అందిస్తానని కూడా చెప్పారు. పట్టించుకున్న దాఖలాలు మృగ్యమయ్యాయి. దీంతో మంత్రి సురేష్ హామీలు నీటి మూటలుగానే మిగిలిపోయాయి. దోర్నాల ప్రజల ఆశలు కలలుగానే మారాయి.

అవీ.. ఇవీ..

23 నుంచి రాష్ట్ర స్థాయి క్రికెట్ టోర్నమెంట్

మార్కాపురం రూరల్, మార్చి 19: మండలంలోని కోలభీమునిపాడు గ్రామంలో ఈనెల 23 నుంచి రాష్ట్ర స్థాయి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు నిర్వాహక కమిటీ సభ్యులు చుట్ల అనిల్‌కుమార్ మంగళవారం తెలిపారు. ఈ టోర్నమెంట్‌లో గెలుపొందిన మొదటి విజేతకు రూ.50వేలు నగదు, రెండవ విజేతకు రూ.25వేలు, మూడో విజేతకు రూ.10వేలు నగదు బహుమతులను అందజేయనున్నట్లు తెలపారు. టోర్నమెంట్‌లో పోటీల్లో పాల్గొనే టీంలు రూ.900 ఎంట్రీఫీజును చెల్లించాలని కోరారు. వివరాలకు నిర్వాహకులు చుట్ల అనిల్ కుమార్ 8074250600 ఫోన్ నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

25 నుంచి ఉరుసు మహోత్సవం

గిద్దలూరు, మార్చి 19 : పట్టణంలోని కొప్పువారివీధిలోని దర్గాలో ఈ నెల 25 నుంచి 27వ తేదీ వరకు శ్రీహజరత్ దస్తగిరి స్వాముల వారి 107వ ఉరుసు మహోత్సవం నిర్వహిస్తున్నట్లు పీఠాధిపతి సయ్యద్ ఇమామ్‌హుస్సేన్ ఖాద్రి ఒక ప్రకటనలో తెలిపారు. 25న గంధపూజ, 26న ఉరుసుమహోత్సవం, ఖవాలి కార్యక్రమం, అన్నదానం, 27న గురుపూజ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

మహిళకు రక్తదానం

గిద్దలూరు, మార్చి 19 : పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో అత్యవసర పరిస్థితిలో ఉన్న ఓ మహిళకు శిరి రెస్టారెంట్ యజమాని బాలిరెడ్డి అనే దాత ద్వారా రక్తదానం చేయించి ఆదుకున్నట్లు మేమున్నాము సేవాసమితి అధ్యక్షులు చల్లా అశోక్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 10వ పర్యాయం రక్తదానం చేసిన బాలిరెడ్డిని అభినందించారు.

ఎన్నికల విధులను బాధ్యతతో నిర్వహించాలి

● కలెక్టర్ దినేష్‌కుమార్



మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

కొండపి, మార్చి 19 : ఎన్నికల విధులను బాధ్యతతో నిర్వహించాలని కలెక్టర్ దినేష్‌కుమార్ అధికారులకు సూచించారు. ప్రతి ఒక్కరూ ఈసీ నిబంధనలకు విధి గా పాటించాలని స్పష్టం చేశారు. స్థానిక మండల పరిషత్ సమావేశం హాలులో నోడల్ అధికారులు, ఎంసీసీ, ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ, పోస్టల్ బ్యాలెట్ బృందం, వ్యయ నిర్వహణ టీమ్స్‌కు మంగళవారం శిక్షణ నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించడంలో అధికారుల పాత్ర కీలకమన్నారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలను పూర్తిగా అవగాహన చేసుకుని తూచా తప్పకుండా పాటించాలన్నారు. ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యేంత వరకు నియమావళిని కచ్చితంగా అమలు చేయడం, అభ్యర్థుల ఖర్చుల వివరాలు నమోదు చేయడం చాలా కీలకమని చెప్పారు. ఓటర్లను ప్రభావితం చేసే అంశాలను నిరోధించేందుకు పనిచేస్తున్న నోడల్ ఏజెన్సీలు ఈసీ మార్గదర్శకాలను విధిగా పాటించాలన్నారు. ఎన్నికల నిర్వహణపై రూపొందించిన సీవిజిల్ యాప్, ఎలక్షన్ సీజర్ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌లపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ సూచించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు, సీవిజల్, ఎలక్షన్ సీజర్ మేనేజ్మెంట్ సిస్టమ్‌లపై మాస్టర్ ట్రైనర్స్ అయిన జిల్లా ఆడిట్ అధికారి శంకరనారాయణరెడ్డి, ఉపాధి కల్పనాధికారి భరద్వాజ్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. కార్యక్రమంలో కొండపి నియోజకవర్గ ఏఆర్వో ఎ.కుమార్, ఒంగోలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ వైస్ చైర్మన్ విశ్వేశ్వరావు పాల్గొన్నారు.



పార్టీలోకి చేరుతున్న బీసీ, ఎస్సీలు

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి

జరుగుమల్లి (కొండపి), మార్చి 19 : టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు మళ్లీ ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దామచర్ల సత్యన్నారాయణ (సత్య) అన్నారు. మండలంలోని కె.బిట్రగుంటలో సోమవారం రాత్రి జరిగిన ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. కొండపి అసెంబ్లీ స్థానం నుంచి టీడీపీ తరఫున పోటీచేస్తున్న డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామిని అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈసందర్భంగా గ్రామానికి చెందిన దాదాపు 50 ఎస్సీ, బీసీ కుటుంబాల వారు టీడీపీలో చేరాయి. వారందరికీ సత్య పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు పోకూరి రవీంద్రబాబు, సీనియర్ నాయకుడు పోటు శ్రీనివాసమురళి పాల్గొన్నారు.

మల్లు స్వరాజ్యంకు నివాళులు



నివాళులర్పిస్తున్న ప్రతినిధులు

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 19: తెలంగాణ రైతాంగ పోరాట యోధురాలు, మహిళా ఉద్యమనేత మల్లు స్వరాజ్యం ద్వితీయ వర్ధంతిని ఘనంగా జరిగాయి. మంగళవారం ఒంగోలు నగరం సత్యనారాయణపురంలో మల్లు స్వరాజ్యం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా కార్యదర్శి రమాదేవి, జి.కళ్యాణి, పి.పద్మ, కె.కమల, నాగమణి, ఉషారాణి, కోటేశ్వరమ్మ, హరిణి, విజయలక్ష్మి, పి.భారతి, ఎ.సత్యవతి, పి.సుజాత పాల్గొన్నారు.

కుయుక్తులలో సిద్ధహస్తుడు జగన్

ఉమ్మడి కూటమి అభ్యర్థుల విజయాన్ని ఆపలేడు

కనిగిరి నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

సీఎస్‌పురం, వెలిగండ్ల మండలాల నుంచి

తెలుగుదేశంలోకి భారీ చేరికలు

కనిగిరి, మార్చి 19 : జగన్ ఎన్ని కుయుక్తులు పన్నినా కూటమి గెలుపును ఆపలేవని నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి చెప్పారు. స్థానిక అమరావతి గ్రౌండ్స్‌లో సీఎస్‌పురం, వెలిగండ్ల మండలాల్లోని పలు గ్రామాలకు చెందిన వైసీపీ నాయకులు తమ కుటుంబాలతో సహా డాక్టర్ ఉగ్ర సమక్షంలో మంగళవారం తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా డాక్టర్ ఉగ్ర వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజల్లో వైసీపీ ప్రభుత్వంపై వ్యతిరేకతకు చిలకలూరిపేట ప్రజాగళం సభకు వచ్చిన జన సందోహమే రుజువన్నారు. ప్రజాగ్రహానికి గురైన ఏ పాలకుడైనా మనుగడ సాగించబోరని చెప్పారు. ప్రధాని నరేంద్రమోడీనే వైసీపీ అవినీతి, అరాచక పాలనాతీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ వచ్చే ఎన్నికల్లో కూటమిని గెలిపించాలని పిలుపునిచ్చారన్నారు. ప్రజాగళం సభ భద్రతా వైఫల్యంపై విచారణ చేపట్టాలని డాక్టర్ ఉగ్ర కోరారు. ఏపీ పోలీసుల నిర్లక్ష్యంపై పోలీస్ చీఫ్ ఎలక్షన్ కమిషన్ తక్షణమే చర్యలు తీసుకోవాలని డాక్టర్ ఉగ్ర డిమాండ్ చేశారు.

వైసీపీ కోటలు బద్దలు కొడుతున్న డాక్టర్ ఉగ్ర



ఉగ్ర సమక్షంలో టీడీపీలో చేరిన సీఎస్‌పురం పెదరాజుపాలేనికి చెందిన నేతలు

డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డిపై విశ్వాసం, నమ్మకంతో నియోజకవర్గంలోని అన్ని వర్గాల ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు. 2019 ఎన్నికల్లో వైసీపీకి కంచుకోటగా నిలిచిన సామాజిక వర్గాలు, గ్రామాలను డాక్టర్ ఉగ్ర బద్దలు కొడుతున్నారు. గడచిన నాలుగు నెలలుగా నియోజకవర్గంలోని ఆరు మండలాల్లోని వివిధ గ్రామాల నుంచి వైసీపీకి చెందిన వేలాది మంది కుటుంబాలు ఆ పార్టీని వీడి డాక్టర్ ఉగ్ర సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. రోజూ నియోజకవర్గంలోని వివిధ గ్రామాల నుంచి పెద్ద ఎత్తున టీడీపీలోకి వలసల పరంపర కొనసాగుతూనే ఉంది. మంగళవారం సీఎస్‌పురం మండలంలోని పెదరాజుపాలేనికి చెందిన 19 కుటుంబాలు, వెలిగండ్ల మండలంలోని కొత్తకండ్రికకు చెందిన 17 కుటుంబాలు



టీడీపీలో చేరిన వెలిగండ్ల మండలం కొత్తకండ్రిక గ్రామస్థులు

వైసీపీని వీడి స్థానిక అమరావతి గ్రౌండ్స్‌లో డాక్టర్ ఉగ్ర సమక్షంలో మంగళవారం టీడీపీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో సీఎస్‌పురం పెదరాజుపాలేనికి చెందిన దర్శి శేషయ్య, నాగేశ్వరరావు, కే నాగేశ్వరరావు, దనేకుల చంద్రయ్య, వెంగయ్య, రాజు, ఆదినారాయణ, జేమ్స్, యేసయ్య, ఓబయ్యలు చేరగా, వెలిగండ్ల మండలం కొత్తకండ్రికకు చెందిన సన్నెపోగు డేవిడ్, సునీత, యలమంద, ఆశీర్వాదం, బుజ్జి, విక్టోరియమ్మ, పుల్లయ్య, వెంకటరమణ, సుధాకర్, కోటేష్, పిచ్చయ్య కుటుంబాలు టీడీపీలో చేరారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి దొడ్డా వెంకటసుబ్బారెడ్డి, ముత్తిరెడ్డి వెంకటరెడ్డి, ఇంద్రభూపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

నీటి సమస్యపై మాగుంట రాఘవరెడ్డికి విజ్ఞప్తి



రాఘవరెడ్డికి జ్ఞాపికను బహూకరిస్తున్న టీడీపీ నాయకులు

దొనకొండ, మార్చి 19 : దొనకొండ మండలంలో ప్రజలు తీవ్ర మంచినీటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఆ సమస్యను పరిష్కరించాలంటూ మండల టీడీపీ నాయకులు శృంగారపు నాగసుబ్బారెడ్డి ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి తనయుడు రాఘవరెడ్డికి విజ్ఞప్తి చేశారు. నాగసుబ్బారెడ్డితో పాటు పెద్దన్నపాలెం పంచాయతీకి చెందిన పలువురు టీడీపీ నాయకులు ఒంగోలులోని రాఘవరెడ్డి నివాసంలో మంగళవారం కలుసుకొని సత్కరించి ఫొటో ఫ్రేమ్‌ను బహూకరించారు. ఈ సందర్భంగా దొనకొండ ప్రాంతంలో బోర్లు అడుగంటి నీళ్లు అందక నీటి సమస్యతో ప్రజలు పడుతున్న ఇబ్బందులను రాఘవరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. అందుకు స్పందించిన రాఘవరెడ్డి రెండు రోజుల్లో ట్యాంకర్ల ఏర్పాటుకు చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు నిమ్మకాయల గోపిరెడ్డి, గొలమారి మంగిరెడ్డి, చెన్నబోయిన శ్రీను, ప్రభాకర్‌రెడ్డి, మొగిలి గురవయ్య, మొగిలి అయ్యప్ప నాగార్జునరెడ్డి, బొరిగొర్ల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మండల టీడీపీ అధ్యక్షుడిని పరామర్శించిన రాఘవరెడ్డి

ఇటీవల అనారోగ్యానికి గురై ఒంగోలు వైద్యశాలలో చికిత్స పొందుతున్న మండల టీడీపీ అధ్యక్షుడు నాగులపాటి శివకోటేశ్వరరావును ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి తనయుడు ఒంగోలు టీడీపీ పార్లమెంట్ అభ్యర్థి రాఘవరెడ్డి మంగళవారం పరామర్శించారు.

ఓటర్లకు అన్ని సౌకర్యాలు కల్పించాలి



పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న ఆర్డీవో జాన్ ఇర్విన్

పామూరు, మార్చి 19 : రానున్న సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాలలో ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేయాలని కనిగిరి ఆర్డీవో పాలపర్తి జాన్‌ఇర్విన్ సూచించారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రాలను మంగళవారం ఆయన పరిశీలించారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో విద్యుత్ సౌకర్యం కలిగి ఉండేలా ఇప్పటి నుంచే ఏర్పాట్లు చేసుకోవాలని ఆదేశించారు. ఎన్నికల నిబంధనలను పకడ్బందీగా అమలు జరిగేలా చూడాలన్నారు. తహసీల్దార్ షాకీర్‌పాష, మధు పాల్గొన్నారు.

బొద్దికూరపాడు పోలింగ్ కేంద్రం పరిశీలన

తాళ్లూరు, మార్చి 19 : మండలంలోని బొద్దికూరపాడు పోలింగ్ కేంద్రాన్ని తహసీల్దార్ ఎస్‌కే మహమ్మద్ హుస్సేన్ మంగళవారం పరిశీలించారు. పోలింగ్ కేంద్రంలో వసతులు సరిగ్గా ఉన్నాయా, లేవా అని పరిశీలించారు. దివ్యాంగులకు తగిన సదుపాయాలు, గదులలో వసతులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ పీవీఎన్ఆర్ మూర్తి, వీఆర్వో ఎం రమణారెడ్డి, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమం టీడీపీతోనే సాధ్యం



బాబు ష్యూరిటీపత్రాలను అందజేస్తున్న హరీష్

పామూరు, మార్చి 19 : వైసీపీ పాలనతో అధోపాతాళానికి దిగజారిన రాష్ట్ర భవిష్యత్తు తిరిగి గాడినపడాలంటే టీడీపీని గెలిపించుకోవాలని ఆ పార్టీ ఫోర్‌మెన్ కమిటీ సభ్యుడు పందిటి హరీష్ చెప్పారు. కనిగిరి నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి ఉగ్ర, మండల కమిటీ అధ్యక్షుడు పువ్వాడి ఆదేశాల మేరకు పట్టణంలో బాబుష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సోమిశెట్టి నరసింహారావు, ఎం దొరబాబు పాల్గొన్నారు.

విద్యుత్ అధికారుల తనిఖీలు



తనిఖీ చేస్తున్న అధికారులు

పీసీపల్లి, మార్చి 19 : మండలంలో విద్యుత్ చౌర్యం చేస్తున్న వినియోగదారులపై విద్యుత్‌శాఖ అధికారులు కేసులు నమోదు చేశారు. మంగళవారం మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్‌శాఖ అధికారులు, సిబ్బంది 26 బృందాలుగా విడిపోయి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో మీటర్లు లేకుండా విద్యుత్ వినియోగిస్తున్న వారితోపాటు అదనపు లోడ్ వినియోగిస్తున్న 33మంది వినియోగదారులను గుర్తించిన అధికారులు రూ.1.37లక్షల అపరాధ రుసుం విధించారు. ఈ తనిఖీల సందర్భంగా డీఈ కట్టా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ విద్యుత్ చౌర్యం చట్టరీత్యా నేరమన్నారు. అదనపు లోడింగ్‌ను వినియోగిస్తున్న వినియోగదారులు అధికారులను సంప్రదించి అధికలోడ్ కోసం రుసుం చెల్లించి అనుమతులు తీసుకోవాలని చెప్పారు. కనిగిరి ఈఈ ఎం.హరిబాబు, ఏడీఈ ఉమాకాంత్, పీసీపల్లి ఏఈ లక్ష్మీరాజేష్ పాల్గొన్నారు.

నాయీబ్రాహ్మణుల అభ్యున్నతికి గుంటుపల్లి కృషి

కనిగిరి, మార్చి 19 : నాయీబ్రాహ్మణుల సంక్షేమం, అభ్యున్నతికి గుంటుపల్లి నాగేశ్వరరావు చేసిన కృషి ఎనలేనిదని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి చెప్పారు. టీడీపీ జాతీయ క్రమశిక్షణాసంఘం సభ్యులు, నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మంగళవారం మృతి చెందారు. స్థానిక అమరావతి గ్రౌండ్స్‌లో మంగళవారం గుంటుపల్లి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. నాయీబ్రాహ్మణ సంఘం, టీడీపీ బీసీసెల్ నాయకులు తిరుపాలు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నేతలు తమ్మినేని శ్రీనివాసులురెడ్డి, ఫిరోజ్, పిచ్చాల శ్రీనివాసులురెడ్డి, గంగవరపునాగిరెడ్డి, సిద్ధాటపు వెంకటరెడ్డి, సైకం మాలకొండారెడ్డి, వివిధ బీసీసంఘాల నేతలు పల్లామాలకొండరావు, డీ శివకాశయ్య, పెన్నా వెంకటేశ్వర్లు, మాచర్ల సుబ్బయ్య, వెనిచర్ల పండు, నరసింహులు, నారాయణ, వెంకటనారాయణ, రవికుమార్, వాసుదేవరావు, సిద్ధాంతి బారాయిమాం, మురళి, కాశయ్య, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

విద్యార్హతల వివరాలను నమోదు చేయాలి

ఒంగోలు(కలెక్టరేట్); మార్చి 19: జిల్లాలోని ప్రైవేటు వైద్యశాలలు, క్లినిక్‌లు, ల్యాబ్‌లు, డయాగ్నోస్టిక్స్ సెంటర్స్ కేంద్రాల వైద్యులు, స్టాఫ్ నర్సులు ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్‌లో తప్పనిసరిగా వారి వ్యక్తిగత, విద్యార్హతలు, కౌన్సిల్ వివరాలు నమోదు చేసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ ఎస్.రాజ్యలక్ష్మి మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. ఆయా వివరాలను నమోదు చేసుకోకపోతే సెంటర్ల కొత్త రిజిస్ట్రేషన్లు, రెన్యువల్స్‌ను నిలిపివేస్తామని ఆమె హెచ్చరించారు.

240 బాటిళ్ల మద్యం స్వాధీనం

నిందితుడు అరెస్ట్

తాళ్లూరు, మార్చి 19 : మండలంలోని శివరాపురం గ్రామం నుంచి చీమకుర్తికి అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తి నుంచి 240 బాటిళ్ల(180 ఎంఎల్)ను ఎస్‌ఈబీ సీఐ బీసుందరరామయ్య బృందం మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఈబీ అధికారులు తనిఖీలు చేస్తుండగా దేవరకొండ గోపి మద్యం బాటిళ్లు తీసుకెళుతుండగా గుర్తించారు. 240 అక్రమ మద్యం బాటిళ్లు గుర్తించి గోపికృష్ణను అదుపులోకి తీసుకున్నారు. నిందితున్ని కోర్టుకు హాజరు పరుచనున్నట్లు సీఐ తెలిపారు.

పారిశుధ్యంపై నిర్లక్ష్యం



రోడ్డువెంట వేయటంతో దుర్వాసన వస్తున్న చెత్తకుప్పలు



మురుగుకాల్వల్లో చెత్త

మచ్చుకైనా వాడని ఫాగింగ్ యంత్రం

వీధుల్లో చల్లని బ్లీచింగ్

దోమలతో అల్లాడుతున్న నగరవాసులు

కనిగిరి, మార్చి 19 : కనిగిరిలో రోజురోజుకూ పారిశుధ్యం అధ్వానంగా తయారవుతోంది. రాత్రివేళల్లో దోమలు తాండవిస్తుండడంతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. పేరుకు మున్సిపాల్టీ అయినప్పటికీ ఆ కోవలో ఎక్కడా పారిశుధ్య నిర్మూలనా చర్యలు లేవు. ప్రతిరోజూ మురుగుకాల్వల శుభ్రంతోపాటు ఇళ్ల నుంచి ఉత్పత్తయ్యే చెత్తను సేకరించాల్సిన సిబ్బంది సకాలంలో రాకపోగా, ఆయా పనులను పర్యవేక్షించాల్సిన శానిటేషన్ అధికారులు విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తున్నారని ప్రజలు విమర్శిస్తున్నారు. మున్సిపాలిటీ పరిధిలో ప్రతిరోజూ ఫాగింగ్ చేయాల్సి ఉండగా ఆ దిశగా చర్యలు మచ్చుకైనా లేవు. ఇంకో పక్క మురుగుకాలువల్లోని మురుగుతో కూడిన చెత్తను రోడ్డుమార్జిన్‌లో వేయటం వలన ఆ కుప్పల్లో దోమలు చేరి వృద్ధి చెందుతూ సాయంత్రానికి ఇళ్లల్లోకి చేరుతున్నాయి. దీంతో ప్రజలు దోమల కాటుకు గురై అనారోగ్యం పాలవుతున్నారు. మురుగుకాల్వల నుంచి తీసిన చెత్తకుప్పలను నాలుగైదు రోజులకు కూడా తొలగించటం లేదు. తడిచెత్తను సేకరించకుండా రోడ్డు పక్కనే వదిలేస్తుండటంతో కుక్కలు, కోళ్లు ఆయా కుప్పలను గెలుకుతుండడంతో దుర్వాసనతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్ల పక్కన మురుగుకాల్వల వెంట కనీసం బ్లీచింగ్ కూడా చల్లటం లేదు. ఫాగింగ్ ఆయిల్, బ్లీచింగ్ వాడకం పేపర్లకే పరిమితమయ్యాయి, వాడుకలో శూన్యమని, ఆయా నిధులన్నీ సంబంధిత అధికార యంత్రాంగం, పాలకులు జేబుల్లోకి వెళ్తున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు.

సీనరేజ్ నిధుల జమలో అధికారుల తప్పిదం

- నాలుగు గ్రామాల మధ్య వివాదం
- ఒక్క పంచాయతీకే కేటాయించిన వైనం
- ముగ్గురు సర్పంచ్‌ల ఫిర్యాదుతో డ్రా నిలిపివేత
- హైకోర్టును ఆశ్రయించిన కొణిదెన సర్పంచ్
- మిగతావారూ అదేబాటలో
- డబ్బులు విడుదల కాక అభివృద్ధి శూన్యం
- వెంటనే సమస్య పరిష్కరించాలని గ్రామస్థులు వినతి



మల్లాయపాలెం గ్రామ పంచాయతీ కార్యాలయం..

బల్లికురవ. మార్చి 13 : పంచాయతీలకు కేటాయించే సీనరేజ్ నిధుల జమల్లో అధికారులు చేసిన తప్పతో ఇప్పుడు నాలుగు గ్రామ పంచాయతీల మధ్య రోజురోజుకూ వివాదం పెద్దదవుతోంది. ఇప్పటికే నాలుగు గ్రామాలకు చెందిన సర్పంచ్‌లు హైకోర్టును ఆశ్రయించారు. ఎవరికి వారు పట్టుదలతో సీనరేజ్ నిధులు కావాలంటూ పట్టుబడుతున్నారు. దీంతో నాలుగు గ్రామాలలో అభివృద్ధి పనులు పూర్తిగా నిలిచిపోయాయి. అధికారులు యథా ప్రకారం గతంలో మాదిరిగా నిధులు కేటాయించి ఉంటే సమస్య ఇంత పెద్దదయ్యేది కాదని ప్రజలు ఆరోపిస్తున్నారు.

బల్లికురవ మండలం కొణిదెన రెవెన్యూలో సర్వే నెంబరు 103లో కొణిదెన, మల్లాయపాలెం, కె.రాజుపాలెం, నక్కబొక్కలపాడు గ్రామాలకు సంబంధించిన భూములు ఉన్నాయి. ఈ భూముల ద్వారా ప్రభుత్వానికి వచ్చే ఆదాయంలో నాలుగు పంచాయతీలకు వాటాల మేర సీనరేజ్ నిధులు అభివృద్ధి పనులకు కేటాయించాల్సి ఉంది. గత పదిహేనేళ్ల నుంచి ప్రతి ఏటా మూడు క్వార్టర్లగా సీనరేజ్ నిధులను అధికారులు కేటాయిస్తున్నారు. 2008లో అప్పటి సర్పంచ్‌లు, అధికారులు కొణిదెన రెవెన్యూ ద్వారా వచ్చే ఆదాయాన్ని మల్లాయపాలెంకు 32 శాతం, కొణిదెనకు 24శాతం, కె.రాజుపాలెంకు 15 శాతం, నక్కబొక్కలపాడుకు 24 శాతం చొప్పున నిధులు కేటాయించేలా ఒప్పందం చేసుకొని రాతపూర్వక సంతకాలు కూడా చేసి ఉన్నారు. కాని గత నాలుగు మాసాల క్రితం జిల్లా పంచాయతీ అధికారులు మూడు క్వార్టర్ల సీనరేజ్ నిధులు సుమారు. రూ.1.40కోట్లను కొణిదెన పంచాయతీ ఖాతాకు జమ చేశారు. ఈ విషయం తెలిసిన మిగిలిన మూడు గ్రామాల సర్పంచ్‌లు తమకు రావాల్సిన సీనరేజ్ నిధులు ఎందుకు వేయలేదని వెంటనే కలెక్టర్‌కు పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేశారు. తమ వద్ద ఒప్పంద పత్రాలను కూడా వారికి చుపించారు. తప్పు జరిగింది అని తెలుసుకొన్న అధికారులు వెంటనే కొణిదెన పంచాయతీకి కేటాయించిన నిధులు డ్రా చేయకుండా ఖాతాను స్తంభించారు. వెంటనే జమ చేసిన నిధులు వెనక్కి పంపాలని పంచాయతీ కార్యదర్శికి జిల్లా అధికారులు లేఖ పంపారు. కొణిదెన సర్పంచ్ తన్నీరు లేపాక్షి మాత్రం సీనరేజ్ నిధులు మెత్తం మా గ్రామానికే చెందుతాయని తాను నిధులు వెనక్కి పంపేది లేదని వెంటనే హైకోర్టులో పిల్ వేశారు. సీనరేజ్ నిధులపై తమకు హక్కు ఉందని మిగిలిన గ్రామాలతో సంబంధం లేదని వెంటనే పంచాయతీ ఖాతాలో యథావిధిగా నిధులు డ్రా చేసుకునేలా ఉత్తర్వులు ఇవ్వాలని కోర్టును ఆశ్రయించారు. విషయం తెలుసుకున్న మల్లాయపాలెం, రాజుపాలెం, నక్కబొక్కలపాడు సర్పంచ్‌లు జూపల్లి రాఘవరావు, అమరనేని లక్ష్మీ, దూళిపాళ్ల బుల్లిరామయ్య వారి వద్ద గతంలో వాటాల మేరకు అధికారుల సమక్షంలో జరిగిన ఒప్పంద పత్రాలతో వారు కూడా హైకోర్టును ఆశ్రయించారు. వెంటనే మా గ్రామాలకు రావాల్సిన సీనరేజ్ నిధులు విడుదల చేసేలా ఉత్తర్వులు ఇవ్వాలని కోర్టుకు విన్నవించారు. దీంతో నాలుగు గ్రామాలలో గత నాలుగు మాసాల నుంచి అభివృద్ధి పనులు పూర్తి గా నిలిచిపోయాయి. జిల్లా స్థాయిలో అధికారులు చేసిన తప్పుతో నాలుగు గ్రామాల మధ్య వివాదం పెద్దది అయి గ్రామాలలో పారిశుధ్యం కూడా పడక వేసిందని ప్రజలు ఆరోపిస్తున్నారు. 15 ఏళ్ల నుంచి వాటాల మేర వేస్తున్న సీనరేజ్ నిధులు ఒక్క గ్రామానికే అధికారులు ఎలా కేటాయించారని వారు ప్రశ్నిస్తున్నారు. సీనరేజ్ నిధుల వ్యవహారం ప్రజలకు తెలిసి ఇప్పుడు గట్టిగా అడిగి వాటా ప్రకారం జమ చేయించుకోకుంటే మునుముందు తమ గ్రామాలలో అభివృద్ధి పనులకు నిధుల లేమి వస్తుందని వారు ఆందోళన చెందుతున్నారు. జిల్లా అధికారులు వెంటనే ఈ వ్యవహారంలో కలుగ జేసుకొని నాలు గు గ్రామాల సర్పంచ్‌లతో సమావేశం ఏర్పాటు చేసి గతంలో వలే సీనరేజ్ నిధులు కేటాయింపు జరిగేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రతి పోలింగ్ బూత్‌లో టీడీపీకి మెజారిటీ తేవాలి

● పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దామచర్ల

ఒంగోలు (కార్పొరేషన్), మార్చి 19: త్వరలో జరిగే సార్వత్రి ఎన్నికలలో ప్రతి పోలింగ్ బూత్ నుంచి మెజారిటీ వచ్చేలా అందరూ కృషి చేయాలని తెలుగుదేశం పార్టీ ఒంగోలు నియోజకవర్గ అభ్యర్థి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు దామచర్ల జనార్దన్ పేర్కొన్నారు. మంగళవారం ఒంగోలులోని టీడీపీ కార్యాలయంలో నగర కమిటీ నాయకులతో సమావేశం నిర్వహించారు. రాబోయే ఎన్నికల్లో గెలుపు కోసం దిశనిర్దేశం చేశారు. ప్రతి ఒక్కరికి బూత్‌లను అప్పజెప్పామని, తమకు కేటాయించిన బూత్‌లలో మెజారిటీ తీసుకు వచ్చే విధంగా కష్టపడి పనిచేయాలని దామచర్ల సూచించారు. బూత్ పరిధిలోని ఇన్‌చార్జులు, సెక్షన్ ఇన్‌చార్జులు, డివిజన్ ప్రెసిడెంట్‌లతో సమన్వయం చేసుకుని ముందుకు సాగాలన్నారు. బూత్ పరిధిలోని ఓటర్ల వివరాలు, కులా వారీగా, ప్రాంతాల వారీగా పూర్తి అవగాహన కలిగి ఉండాలని, ఎన్నికల సమయంలో ఎలాంటి సమస్య వచ్చినా తన దృష్టి తీసుకురావాలని చెప్పారు. ఆయా పోలింగ్‌స్టేషన్ల పరిధిలోని ఓటర్లను కలిసి, వారితో మాట్లాడాలని, తటస్థ సభ్యులను కలవడం, ఎవరైనా వైసీపీలోగాని, టీడీపీలోగాని అసంతృప్తిగా ఉంటే వారిని కలిసి మాట్లాడాలన్నారు. పోలింగ్ తేది వరకు నిరంతరం ప్రజల్లోనే ఉండాలని, పార్టీకి అత్యధిక మెజార్టీ వచ్చేలా కష్టపడి పనిచేయాలన్నారు. సమావేశంలో నగర అధ్యక్షులు కొఠారి నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి బొల్లినేని వాసుకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



నగర కమిటీ నేతలతో సమావేశమైన దామచర్ల

చంద్రబాబుతోనే రాష్ట్రానికి బంగారు భవిష్యత్తు

కనిగిరిలో బాబుష్యూరిటీ కార్యక్రమంలో టీడీపీ నేతలు



ఇంటింటి ప్రచారం చేస్తున్న తెలుగు మహిళలు, నేతలు

కనిగిరి, మార్చి 19 : రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్తు తిరిగి రావాలంటే చంద్రబాబుతోనే సాధ్యమని టీడీపీ పట్టణాధ్యక్షుడు తమ్మినేని శ్రీనివాసులరెడ్డి చెప్పారు. స్థానిక మున్సిపాల్టీ పరిధిలోని 2వ వార్డులోని ఎన్జీవో కాలనీలో మంగళవారం బాబుష్యూరిటీ-భవిష్యత్‌కు కార్యక్రమంలో భాగంగా ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరుగుతూ చంద్రబాబు చేపట్టిన సూపర్ సిక్స్ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీకి అఖండ మెజార్టీ అందించాలని కోరారు. కనిగిరి ప్రాంతం అభివృద్ధి చెందాలంటే సమర్థుడైన ఉగ్రనరసింహారెడ్డితోనే సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఫిరోజ్, తిరుపాలు, నారాయణ, పండు, జానీ, కేవీఎస్‌గౌడ్, సిద్ధాంతి బారాయిమాం, ఏనుగు శ్రీనివాసులురెడ్డి, తెలుగుమహిళలు కరణం అరుణ, మాజీ కౌన్సిలర్లు షేక్ వాజిదాబేగం, బొగ్గరపు శ్రీలత, స్వప్న, దొరసాని, తులసి, ధనలక్ష్మీ, వెంకటలక్షమ్మ, అమ్ములమ్మ, నారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుపై నమ్మకంతోనే టీడీపీలోకి వలసలు

వెలిగండ్ల, మార్చి 19 : చంద్రబాబు సీఎం అయితేనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమనే నమ్మకంతోనే వైసీపీ నుంచి టీడీపీలోకి వలసలు ప్రారంభమయ్యాయని నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి చెప్పారు. మంగళవారం మండలంలోని కొత్తకండ్రిక గ్రామానికి చెందిన 17 కుటుంబాల వారు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా ఉగ్ర మాట్లాడుతూ జగన్ పాలనలో దెబ్బతిన్న ప్రతి గ్రామాన్ని అభివృద్ధి బాటలో పరుగులు పెట్టించే బాధ్యత తీసుకుంటానన్నారు. గత ఎన్నికల సమయంలో మాయమాటలు చెప్పి మోసం చేసిన వైసీపీ ప్రభుత్వానికి ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నేతలు దొడ్డా వెంకటసుబ్బారెడ్డి, ముత్తిరెడ్డి, కేలం ఇంద్రభూపాల్‌రెడ్డి, చిలకల వెంకటేశ్వర్లు, వెన్నా వెంకటేశ్వర్లు, వెన్నా పిచ్చిరెడ్డి, డేవిడ్, యలమంద, జార్జి, జాన్, వెంకటరమణ, కోటేష్, పెద్ద పిచ్చయ్య పాల్గొన్నారు.

ఎనిమిది సిలిండర్లు స్వాధీనం

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 19: ఒంగోలు నగరం శివాలయం సెంటర్‌లోని ఒక హోటల్, ఒక ఫ్రూట్ స్టాల్‌లో వినియోగిస్తున్న ఎనిమిది డొమెస్టిక్ (ఇంట్లో వాడే సిలెండర్లు) సిలెండర్లను మంగళవారం పౌరసరఫరాల శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. డీఎస్‌వో ఉదయభాస్కర్ ఆధ్వర్యంలో ఆ శాఖ ఉద్యోగులు దాడులు నిర్వహించారు. డొమెస్టిక్ సిలెండర్లను స్వాధీనం చేసుకొని నిర్వహకులపై 6ఏ కేసులను నమోదు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా హోటల్స్‌లో డొమెస్టిక్ సిలెండర్లను వినియోగిస్తే చర్యలు తప్పవని డీఎస్‌వో హెచ్చరించారు. హోటల్స్, తినుబండారాల దుకాణాలు, పానిపూరిబండ్లు, చికెన్ సెంటర్లు, వెల్డింగ్ సెంటర్లు తదితర వ్యాపార ప్రతినిధులు వాణిజ్య గ్యాస్ సిలెండర్లు వాడాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఫుడ్ ఇన్‌స్పెక్టర్ ఊతకొలు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

బాపట్ల జిల్లా వార్తలు

5

బుధవారం 20 మార్చి 2024





ఆసరా.. అంతేనా?



కోడ్‌తో లబ్ధిదారుల్లో ఆందోళన

- రెండు నెలలైనా ఊసే లేని రుణమాఫీ
- 70 వేల మందికి ఒకరిద్దరి ఖాతాల్లోనే నగదు
- బటన్ నొక్కి రోజులు గడుస్తున్నా అందని లబ్ధి

విడతల సంక్షేమం వాయిదాల పర్వంలో సాగింది. ఏకంగా ముఖ్యమంత్రి బటన్లు నొక్కుతున్నా సకాలంలో లబ్ధిదారుల ఖాతాల్లో నగద గగనమవుతోంది. డీబీటీ ద్వారా నేరుగా లబ్ధిని అందజేస్తున్నామని చెప్తున్నా.. లబ్ధిదారులు బ్యాంకుల చుట్టూ తిరగడం సర్వసాధారణంగా మారుతుంది. సంక్షేమ పథకాల అమలే మా అజెండా అని చెప్పుకుంటున్న ప్రభుత్వం ఆచరణలో లబ్ధిదారులను మోసం చేస్తోంది. ప్రధానంగా మహిళలకు చేయూత అందించే పథకాల్లో తన పనితనం చూపిస్తోంది. ఉత్తుత్తి బటన్లు నొక్కి ముఖ్యమంత్రి ఏమార్చుతున్నారని లబ్ధిదారులు మండిపడుతున్నారు. ముఖ్యమంత్రి బటన్ నొక్కారు కదా మన ఖాతాల్లో నగదు జమై ఉంటుందని ఆశగా బ్యాంకులకు వెళ్తున్న మహిళలకు తీవ్ర నిరాశే ఎదురవుతోంది.

గుంటూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో ఆసరా పథకం ద్వారా డ్వాక్రా రుణమాఫీ అర్హత పొందిన మహిళలు 7 లక్షల మంది ఉన్నారు. వారికి ప్రభుత్వం నాలుగు దఫాలుగా 2,800 కోట్ల రూపాయలు రుణమాఫీ కింద నగదు చెల్లించాలి. కాగా పథకాన్ని ఆలస్యంగా మొదలుపెట్టడం, అమలులో వాయిదాల మధ్య దూరం పెంచడం కారణంగా ఐదేళ్లలో మూడు సార్లు మాత్రమే రుణమాఫీ చేసింది. తాజాగా ఈ ఏడాది జనవరి 23న నాలుగో విడత ఆసరా పథకానికి ముఖ్యమంత్రి బటన్ నొక్కినా రుణమాఫీ నగదు మాత్రం లబ్ధిదారులందరికీ అందలేదు. నాలుగో విడత రూ.700 కోట్ల రుణమాఫీ జరగాలి. బటన్ నొక్కి రెండు నెలలు కావస్తున్నా మెజారిటీ లబ్ధిదారులకు ఆసరా రుణమాఫీ డబ్బులు పడలేదు. గడిచిన రెండు నెలల్లో అక్కడక్కడా చెదురుమదురుగా ఆసరా డబ్బు పడినా, ఆ తర్వాత ఆగిపోయింది. దీంతో లబ్ధిదారుల్లో ఆందోళన మొదలైంది. దీనికి తోడు ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో లబ్ధిదారుల్లో మరింత కలవరం కనిపిస్తోంది.

● చేయూత పథకంలో జాప్యం

చేయూత పథకాన్ని ప్రభుత్వం వాయిదాల పద్ధతిలో జాప్యం చేసుకుంటూ వచ్చింది. మరో వారం రోజుల్లో ఎన్నికల నగారా మోగుతుందనగా మార్చి 7న ముఖ్యమంత్రి బటన్ నొక్కారు. 2023 సెప్టెంబరులో ప్రారంభిస్తామన్న పథకం ఆ తర్వాత నవంబరుకు, అక్కడ నుంచి డిసెంబరుకు, ఆపై జనవరికి వాయిదా పడి చిట్టచివరకు మార్చిలో ప్రారంభానికి నోచుకుంది. కానీ దీనికి సంబంధించి లబ్ధిదారుల్లో చాలా మందికి నగదు జమ కాలేదు. పథకానికి సంబంధించి బడ్జెట్ కేటాయింపులు లేవు. దీంతో ప్రభుత్వం అరకొరగా నిధులు మంజూరు చేస్తోంది. గడిచిన రెండు వారాల్లో మూడు జిల్లాల్లో మూడో వంతు మందికి కూడా చేయూత దక్క లేదని లబ్ధిదారులు చెబుతున్నారు. ఎక్కడో ఒకరికి నగదు పడితే తమకు కూడా నగదు జమైందే మోనన్న ఆశతో లబ్ధిదారులు బ్యాంకుల వద్దకు పదేపదే వెళ్తున్నారు. కానీ నగదు మాత్రం వారికి దక్కలేదు.

● కోడ్ వచ్చినా పంపిణీలో మతలబేంటి ?

ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చాక కూడా లబ్ధిదారుల ఖాతాల్లోకి నగదు బదిలీ చేయడమే అధికార వైసీపీ ఎత్తుగడగా కనిపిస్తోంది. ఎన్నికల కోడ్ వచ్చిన తర్వాత సంక్షేమ పథకాలను నిర్వహించడం సాంకేతికంగా తప్పు. దీంతో ప్రభుత్వం ఎన్నికల ముందు పథకాలన్నింటినీ హడావుడిగా ప్రారంభించింది. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న సమయంలో కూడా లబ్ధిదారుల ఖాతాలో నగదు జమయ్యేలా దశల వారీగా నగదు విడుదల చేస్తూ ఓటర్లను ప్రలోభపెట్టేందుకు ప్రయత్నిస్తోందా? అన్న అనుమానాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. దీనిపై ఎన్నికల సంఘం ఎలా స్పందిస్తుందో వేచి చూడాలి.



నేతన్నపై.. నిర్లక్ష్యం

నేతన్నలు.. అబ్బుర పరిచే వస్త్ర కళా నైపుణ్యం వారిది. సమస్యలతో దశాబ్దాలుగా పోరాటం చేస్తూ అతికష్టంగా మనుగడ సాగిస్తున్నారు. వేల ఏళ్ల చరిత్ర ఉన్నా.. రెక్కాడితేగాని డొక్కాడని బతుకులు వారివి. రెక్కలిరిగేలా.. కీళ్లు అరిగేలా చాకిరి చేస్తున్నా.. ఐదు వేళ్లూ నోటికెళ్లని పరిస్థితి వారిది. వారి చేతి వేళ్లలో ప్రపంచాన్ని అబ్బుర పరిచే వస్త్ర కళా నైపుణ్యం ఉన్నా వారి బతుకులు మాత్రం మారడం లేదు. వైసీపీ ప్రభుత్వం వచ్చాక చేనేత కార్మికులు కోలుకోలేనంతగా దెబ్బ తిన్నారు. సంక్షేమ పథకాల పేరుతో ఒక రిద్దరికి పదో పరకో చిల్లర రాల్చిన ప్రభుత్వం చేనేత సంరక్షణ చర్యలను పూర్తిగా పక్కన పెట్టింది. ఫలితంగా చేనేత వృత్తి మనుగడే ప్రశ్నార్థకంగా మారింది.

- తాయిలాలతో సరి.. చేనేతకు ఉరి
- వృత్తి రక్షణను వదిలేసిన పాలకులు
- ప్రభుత్వ నిర్లక్ష్యానికి బలైపోతున్న నేతన్నలు
- వైసీపీ పాలనలో ఘోరంగా పతనమైన పరిశ్రమ
- అప్పుల భారం, ఆకలిచావుల దశకు చేరిన పరిశ్రమ

గుంటూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో వ్యవసాయం తర్వాత అతిపెద్ద రంగం చేనేత. దేశంలోనే అతిపెద్ద చేనేత ప్రాంతంగా బాపట్ల జిల్లా చీరాల- వేటపాలెం గుర్తింపు పొందింది. ఈ మూడు జిల్లాల్లో అధికారిక లెక్కల ప్రకారమే దాదాపు 30 వేల మగ్గాలున్నాయి. వాటిపై లక్ష మందికి పైగా చేనేత కార్మిక కుటుంబాలు ఆధారపడి జీవిస్తున్నాయి. బాపట్ల జిల్లాలోనే దాదాపు 17వేల చేనేత మగ్గాలున్నట్లు చేనేత జౌళిశాఖ లెక్కలు చెబుతున్నాయి. గుంటూరు, బాపట్ల జిల్లాల్లో మరో 13 వేలకు పైగా మగ్గాలు నమోదై వున్నాయి. బాపట్ల జిల్లాలోని చీరాల, వేటపాలెం, ఈపూరుపాలెం, చెరుకుపల్లి, వలవర్ల, రేపల్లె, పేటేరు, భట్టిప్రోలు, ఇసుకపల్లి, రాజోలు, కనగాల మొదలు గుంటూరు జిల్లాలోని మంగళగిరి చుట్టుపక్కల గ్రామాలు, తెనాలి, పొన్నూరు, పల్నాడు జిల్లా సత్తెనపల్లి, పిడుగురాళ్ల, చిలకలూరిపేట, గణపవరం, తదితర ప్రాంతాల్లో చేనేత కార్మికులు పెద్ద సంఖ్యలో ఉన్నారు. స్వయంపోషకంగా ఉన్న ఈ రంగానికి కొద్దిపాటి ఊతం ఇస్తే సరిపోతుంది. కానీ వైసీపీ ప్రభుత్వం అవేవీ పట్టించుకోలేదు. గత ప్రభుత్వాలు ఇచ్చిన చేయూతను కూడా నిర్లక్ష్యం చేసింది. ఫలితంగా చేనేత పరిశ్రమ ఘోరంగా దెబ్బతింది. దీంతో చాలా చోట్ల చేనేత మగ్గాలే కనుమరుగై పోయాయి. 2020లో కరోనా నివారణ కోసం చేపట్టిన లాక్‌డౌన్ చేనేత కార్మికుల వృత్తికి లాక్‌డౌన్‌గా పరిణమించాయి. ఆనాటి నుంచి ఈనాటి వరకూ చేనేత కార్మికులకు చేసేందుకు పని దొరకని పరిస్థితి.

టీడీపీ హయాంలో ఊరట

గతంలో టీడీపీ ప్రభుత్వం చేనేత సంరక్షణకు నూలు, రంగులపై సబ్సిడీ ఇచ్చింది. చేనేత సహాయ నిధి, పొదుపు నిధి, రంగుల కోసం రూ.25 కోట్లు, మూల ధనం కింద రూ.30 కోట్లు, మరమగ్గాలకు రాయితీ కింద రూ.80 కోట్లు కేటాయించి ఖర్చు చేశారు. కుటుంబానికి 100 యూనిట్ల ఉచిత విద్యుత్‌తో పాటు, 50 ఏళ్ల దాటిన లక్షా 11 వేల మంది చేనేతలకు 2వేలు చొప్పున పింఛన్లు అందజేశారు. ఇవి చేనేత పరిశ్రమను రక్షించడానికే కాకుండా, కార్మికులకు వ్యక్తిగతంగా కూడా కొంత ఊరటనిచ్చేవి. అయితే వైసీపీ ప్రభుత్వం టీడీపీ హయాంలో అమలైన పథకాలన్నింటినీ రద్దు చేసేసింది. దీంతో చేనేత కార్మికులకు గడ్డిపోచ సాయం కూడా వారికి లభించలేదు. చేనేత వస్త్రాలకు దేశంలోనే కాదు.. ప్రపంచంలో కూడా అంతులేని ఆదరణ ఉంది. నైపుణ్యం కలిగిన కార్మికులు ఉన్నారు. ఈ రెండింటినీ సమన్వయం చేసే ప్రభుత్వ ఆదరణే పరిశ్రమకు కరువైంది. కార్మికుల ఉపాధి విషయాన్ని గాలికి వదిలి వైసీపీ ప్రభుత్వం కేవలం తాయిలాలకే పరిమితమైంది. రూ.2.97 లక్షల కోట్ల రాష్ట్ర బడ్జెట్‌లో కేవలం 200 కోట్లు మాత్రమే కేటాయించారు. అది కూడా చేనేత జౌళిశాఖ ఉద్యోగుల జీతాలకు, నేతన్న నేస్తానికి కూడా సరిపోదు. అంతలా గడిచిన ఐదేళ్లలో చేనేత నిర్లక్ష్యానికి గురైంది. లక్షమందికిపైగా ఉన్న చేనేత కార్మికుల్లో 10 వేల మందికి నేతన్న నేస్తం ఇచ్చి చేతులు దులుపుకుంటోంది. ఈ లబ్ధి పొందేవారిలో చేనేత రంగంలోని అట్టడుగువర్గమైన సొంత ఇల్లు, సొంత మగ్గం లేని షెడ్డు కార్మికులు మాత్రం ఉండరు. కొద్దిగొప్పో సొంత ఇల్లు, సొంత మగ్గం ఉన్న కార్మికులకు మాత్రమే ప్రభుత్వం నేతన్న నేస్తం అందిస్తోంది. ఫలితంగా చేనేత కార్మికుల పరిస్థితి గడిచిన నాలుగేళ్లలో కోలుకోలేనంతగా దెబ్బతినిపోయింది.

ఆది నుంచి ఆలస్యం

అధికారంలోకి వచ్చిన తొలి ఆరు నెలల్లో సంక్షేమ పథకాలు అమలు చేస్తే అది జగన్ ప్రభుత్వం అని డప్పాలు కొట్టుకునే వైసీపీ నేతలు ఆది నుంచి ఆసరా, చేయూత పథకాలను జాప్యం చేస్తూనే వచ్చారు. అధికారం చేపట్టిన ఏడాదిలో పథకాలను ప్రారంభించకుండా దాదాపు 15 నెలల తర్వాత తీరిగ్గా పథకాలను ప్రారంభించారు. విడతల వారీ అమలు పేరుతో ప్రతి విడతలో మరింత జాప్యం చేస్తూ పథకాన్ని నీరుగార్చారు. సవాలక్ష ఆంక్షలు పెట్టి లబ్ధిదారుల సంఖ్యలో కోత పెట్టారు. దొంగ లెక్కలు చూపి అర్హులు అనేకమందిని పథకానికి దూరం చేశారు.



చీరాలలో బూజుపట్టిపోయిన చేనేత మగ్గాలు

చేనేతకు చేయూత పేరుతో లోకేశ్ కృషి

చితికి పోతున్న చేనేతను సంరక్షించేందుకు టీడీపీ యువనేత నారా లోకేశ్ తన నియోజకవర్గమైన మంగళగిరిలో కొంత ప్రయత్నం చేశారు. నేతన్నలకు అధునాతన యంత్ర సామగ్రిని అందించడంతోపాటు, సమస్యల మూలాల్లోకి వెళ్లి చేనేత సంరక్షణ ప్రణాళికలు రూపొందిస్తున్నారు. నేతన్నలకు ఉపకరించే అధునాతన రాట్నాలు, మరమగ్గాలు అందజేస్తున్నారు. మంగళగిరి పరిధిలో ఉన్న ప్రముఖ చేనేతకారులతో చర్చించి నిర్దిష్టమైన కార్యక్రమం రూపొందించే ప్రయత్నం చేస్తున్నారు. కార్పొరేట్ మార్కెటింగ్ సంస్థల ద్వారా స్పాన్సర్ షిప్ తీసుకువచ్చి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మార్కెటింగ్ ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. ఆ మేరకు పలు సంస్థల అధినేతలు, ఎన్ఆర్ఐల సహకారం తీసుకుంటున్నారు.

చేనేతను రక్షించాలి

చేనేతను రక్షించకపోతే కార్మికులకు ఆకలిచావులే శరణ్యం. నాలుగేళ్లుగా చీరాల పరిసర ప్రాంతాల్లో చేనేత కార్మికులకు పనిలేదు. నేతన్న నేస్తం కొద్ది మందికే ఇస్తున్నారు. కార్మికులకు పని కల్పిస్తే నేతన్న నేస్తం లేకపోయినా హాయిగా బతుకుతారు. కానీ ప్రభుత్వం అవేవీ పట్టించుకోవడంలేదు. పనిలేని కారణంగా చాలా మంది టీస్టాళ్లు, హోటళ్లలో కప్పులు కడిగే పనికి పోతున్నారు.



- జి. సుబ్బారావు, చేనేత నాయకుడు

23 నుంచి శింగరకొండ తిరునాళ్ల



● శింగరకొండలో ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయం

అద్దంకి, మార్చి 19: శింగరకొండ లక్ష్మీనరసింహస్వామి, ప్రసన్నాంజనేయస్వామి వార్ల 69వ వార్షిక తిరునాళ్ల మహోత్సవాలు ఈ నెల 23 నుంచి ప్రారంభమై 25వ తేదీతో ముగియనున్నాయి. 23వ తేదీ ఉదయం 6-30 గంటలకు గణపతి పూజ, పుణ్యాహవాచన, అఖండ దీప స్థాపన, మండపారాధన, ఉదయం 9 గంటలకు ధ్వజ స్తంభ నిర్మాణదాత మేదరమెట్ల శంకరారెడ్డిచే జీవ ధ్వజ పూజ, ఉష్ట్ర వాహన పూజ, ధ్వజారోహణ కార్యక్రమాలు జరగనున్నాయి. 10 గంటలకు భజన, రాత్రి 7 గంటలకు తోలుబొమ్మలాట, కోలాట ప్రదర్శన జరగనున్నాయి. 7 గంటలకు గజవాహన సేవ జరుగుతుంది. 24 ఉదయం 5 గంటలకు సుప్రభాతసేవ, 5-30 గంటలకు బిందె తీర్థం, 6 గంటలకు విశేష అభిషేకం జరగనున్నాయి. ఉదయం 10 గంటలకు భజన కార్యక్రమం, రాత్రి 7 గంటలకు దేవనర్తకి పూర్తి నాటకం, కోలాట ప్రదర్శన, రాత్రి 7 గంటలకు ఉష్ట్ర వాహన సేవ జరుగుతుంది. 25వ తేదీ సుప్రభాత సేవ, బిందె తీర్థం, ప్రాతఃకాలార్చన, భజన, కూచిపూడి నృత్య ప్రదర్శన, స్వామి వారి రథోత్సవం ఉంటుందని ఈవో సుభద్ర తెలిపారు. తిరునాళ్ల సందర్భంగా రంగుల రాట్నాలు, జెయింట్ వీల్స్ నిర్వాహకులు ఇప్పటికే శింగరకొండ చేరుకుని ఏర్పాట్లు చేసుకుంటున్నారు. కొత్త విద్యుత్‌లైన్లు, అదనంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు పనులు జరుగుతున్నాయి. దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఉత్సవాలు ప్రారంభమైన తర్వాత మొట్టమొదటి సారిగా ఈ ఏడాది మూలవిరాట్ ఉన్న ఆలయంలో కాకుండా బాలాలయంలో స్వామి వారి దర్శనం జరుగుతుంది. ముఖ మండపం నిర్మాణ పనులు ఆలస్యం కావడంతో ఉత్సవాలు కూడా బాలాలయంలో నిర్వహిస్తున్నారు.



సిద్ధం చేస్తున్న రంగుల రాట్నాలు

అయ్యో.. రామా?

- కోదండరామునికి రూ.అర కోటి బకాయి
- మాజీ ఎమ్మెల్యే ఆమంచి సమీప బంధువు స్థలం లీజు
- 27 నెలలుగా అద్దె పెండింగ్.. అయినా షాపింగ్ మాల్ ప్రారంభం



వాడరేవులోని కోదండరామాలయ దేవస్థానం

చీరాల, మార్చి 19: చీరాల మండలం వాడరేవులోని కోదండరామాలయానికి రూ.లక్షల్లో అద్దె బకాయిలు చెల్లించాలి.. అయినా లీజుకు తీసుకున్న స్థలంలో షాపింగ్ మాల్ నిర్మించారు.. గత వారం ఆ మాల్‌ను ప్రారంభించారు. 27 నెలలుగా అద్దె చెల్లించకపోయినా నోటీసులతో అధికారులు సరిపుచ్చుతున్నారే కాని బకాయి వసూళ్లపై దృష్టి సారించకపోవడంపై భక్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కోదండ రామాలయానికి చీరాల కూరగాయల మార్కెట్ పక్కన రూ.కోట్ల విలువైన 27.50 సెంట్ల ఖాళీ స్థలం ఉంది. ఈ స్థలాన్ని నిబంధనల మేరకు లీజుకు ఇచ్చేందుకు దేవదాయశాఖ సంకల్పించింది. 2020 నవంబరు 16న ఆ స్థలం అద్దెకు సంబంధించి బహిరంగ వేలం జరగ్గా వైసీపీ నేత, మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణ మోహన్ మేనల్లుడు శివప్రసాద్ నెలకు రూ.1.97 లక్షలు అద్దె చెల్లించే విధంగా హెచ్చుపాటపాడి దక్కించుకున్నారు. నిబంధనల మేరకు 11 సంవత్సరాల పాటు అద్దెదారుడు అందులో కొనసాగవచ్చు. నిబంధనల మేరకు ముందస్తుగానే పాటదారుడు ఒక సంవత్సరం కాలానికి రూ.23.64 లక్షలు చెల్లించారు. ఆ తర్వాత తాము తీసుకున్న స్థలానికి రెండు వైపులా దారి ఉండాలని, వెనుక వైపు నుంచి కూడా దారి కల్పించాలని కోరుతూ లీజుదారుడు కోర్టును ఆశ్రయించారు. అయితే అద్దె బకాయి నెలకు రూ.1.97 లక్షలు చొప్పున 27 నెలలకు రూ.అర కోటికి పైగా బకాయి ఉందని దేవదాయశాఖ వర్గాలు చెప్తున్నాయి. అయినా అద్దె చెల్లించకుండానే ఈ ఖాళీ స్థలంలో నిర్మించిన షాపింగ్ మాల్ గత వారంలో ఆమంచి ప్రారంభించారు.ఈ పరిస్థితుల్లో అద్దె బకాయిలు ఎప్పటికి ఆలయ ఖజానాకు సమకూర తాయా లేదా అని పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.



షాపింగ్ మాల్‌ను ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్(ఫైల్)

నోటీసు పంపుతున్నాం..

ఆలయానికి చెందిన స్థలాన్ని నెలకు రూ.1.97 లక్షలు చెల్లించేలా కంకట శివప్రసాద్ అనే వ్యక్తికి అద్దెకు ఇచ్చాం. అద్దె బకాయి ప్రస్తుతం రూ.అర కోటి పైగా ఉంది. బకాయి చెల్లించాలని గతంలో మూడు పర్యాయాలు అప్పటి ఈవో నోటీసులు ఇచ్చారు. ఆ తర్వాత నేను బాధ్యతలు తీసుకున్నాక రెండు పర్యాయాలు నోటీసులు పంపాం. తాజాగా మరో మారు నోటీసు పంపుతున్నాం. ప్రస్తుతం వివాదం కోర్టులో నడుస్తోంది.

- జీవీఎల్ కుమార్, ఈవో, చీరాల



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ పి.రంజిత్‌బాషా

ప్రభుత్వ స్థలాల్లో ప్రచారాలకు అనుమతిలేదు

బాపట్ల, మార్చి 19: ఎన్నికల కోడ్ నేపథ్యంలో రాజకీయ పార్టీల ప్రచారాలకు ప్రభుత్వ స్థలాల్లో అనుమతి లేదని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా స్పష్టం చేశారు. విజయవాడ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మంగళవారం జిల్లా అధికారులకు ఆయన పలుసూచనలు చేశారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పటిష్టంగా అమలు చేయాలని చెప్పారు. జిల్లా సరిహద్దుల్లోని చెక్‌పోస్ట్‌ల వద్ద నిఘా పెంచాలన్నారు. వెబ్‌కాస్టింగ్ ద్వారా పర్యవేక్షణ చేయాలని, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు క్షేత్ర స్థాయిలో విస్తృతంగా పర్యటించాలన్నారు. ఎలక్ట్రానిక్ సీజర్ మేనేజ్‌మెంట్ విధానాన్ని విస్తృత స్థాయిలో వినియోగించాలన్నారు. సీ విజిల్ యాప్ ద్వారా అందే ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించాలన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పటిష్టంగా అమలు పర్చడంలో రాజీపడవద్దన్నారు. ప్రభుత్వ ప్రాంగణాలు, వాణిజ్యసంస్థలలో రాజకీయప్రకటనలకు సంబంధించిన హోర్డింగ్‌లు, పోస్టర్‌లు, బ్యానర్లను అనుమతించరాదన్నారు. రాజకీయపార్టీలకు నూతన అనుమతులు ఇచ్చే అంశంలో అందరికీ సమానహక్కులు, అవకాశాలు, పరిమితులు ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ పి.రంజిత్‌బాషా, జాయింట్ కలెక్టర్ సి.హెచ్.శ్రీధర్, ఈఆర్‌వోలు, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ ఆదేశాలూ.. బేఖాతర్

● సీఆర్‌జడ్ పరిధిలో ఆగని అక్రమ కట్టడాలు

- అక్రమ నిర్మాణాలు, లేఅవుట్లపై విచారణకు కమిటీ
- అక్రమార్కులకు వరంగా శాఖల మధ్య సమన్వయ లోపం

వేటపాలెం(చీరాల), మార్చి 19: కలెక్టర్ దృష్టి సారించినా తగ్గేదేలే అని అక్రమార్కులు చెలరేగిపోతున్నారు. వేటపాలెం మండలం పొట్టి సుబ్బయ్యపాలెం, కఠారివారిపాలెం, రామాపురం, చీరాల మండలం వాడరేవు, విజయలక్ష్మీపురం తదితర ప్రాంతాల్లో తీరం వెంట సీఆర్‌జెడ్(కోస్టల్ రెగ్యులైజేషన్ జోన్) పరిధిలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలే ఇందుకు నిదర్శనం. స్థానికంగా, స్థానికేతరంగా ఉన్న రాజకీయ పలుకుబడి నేపథ్యంలో సీఆర్‌జెడ్ పరిధిలో అక్రమ నిర్మాణాలు, లేఅవుట్లు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. ఇటీవల కలెక్టర్ రంజిత్ బాషా సీఆర్‌జెడ్‌లో జరుగుతున్న నిబంధనల ఉల్లంఘనపై ప్రత్యేక దృష్టి సారించారు. అందుకు సంబంధిత శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. వారిని ఒక కమిటీగా సీఆర్‌జెడ్ పరిధిలోని అక్రమ నిర్మాణాలు, లేఅవుట్లకు సంబంధించి నివేదిక తయారు చేసి అందజేయాలని ఆదేశించారు. ఆ తర్వాత కూడా అక్రమ కట్టడాలు ఆగలేదు సరికదా మరింత ఊపందుకున్నాయి. సీఆర్‌జెడ్ పరిధిలోని అక్రమ కట్టడాలు, అనధికారిక లేఅవుట్లకు సంబంధించి కలెక్టర్ నియమించిన కమిటీ ఏం చేస్తోందని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఆ కమిటీ నివేదికపై అంతిమంగా కలెక్టర్ ఎలా స్పందిస్తారనే అంశంపై తీర ప్రాంతంలో సర్వత్రా చర్చ జరుగుతోంది.

నిర్మాణాలకు అనుమతులు ఎలా?

ఏదన్నా నిర్మాణం చేపట్టాలంటే సంబంధిత శాఖల నుంచి పూర్తిస్థాయి అనుమతులు తప్పనిసరి. అయితే ఆ నిబంధన సామాన్యులకే కాని అక్రమార్కులకు కాదని ప్రజలు ఎద్దేవా చేస్తున్నారు. సీఆర్‌జెడ్ పరిధిలో జరిగే నిర్మాణాలకు పంచాయతీ, ఓడా(ఒంగోలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ) అప్రూవల్ ఉండాలి. అదే రిసార్ట్స్ అయితే సుమారు 11 రకాల అనుమతులు ఉండాలి. అప్పుడే విద్యుత్ కనెక్షన్ ఇవ్వాలి. అయితే కొందరు ఒకచోట అనుమతి పొంది అక్కడ నుంచి అనుమతి లేని ప్రాంతానికి కూడా విద్యుత్‌ను వినియోగిస్తున్న వారు ఉన్నారు. విద్యుత్ లైన్‌పై తీగలు కలిపి విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్నా ఆ శాఖ అధికారులు ఆ వైపు కన్నెత్తి కూడా చూడటం లేదనే ఆరోపణలు ఉన్నాయి. శాఖల మధ్య సమన్వయ లోపం కూడా అక్రమార్కులకు వరంగా మారుతోంది.



కఠారివారిపాలెం సమీపంలో జరుగుతున్న అక్రమ నిర్మాణం

పరిశీలించి నోటీసులు అందజేస్తాం

సీఆర్‌జెడ్ పరిధిలో జరిగే నిర్మాణాలకు పంచాయతీ పరంగా ఎవరికీ అనుమతి లేదు. వారికి ఓడా నుంచి ఏ అనుమతులు ఉన్నాయో తెలీదు. పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటాం.

- శివలీల. సెక్రటరి, చల్లారెడ్డిపాలెం

విద్యుత్ కనెక్షన్ ఇవ్వం

అనుమతి లేని కట్టడాలకు విద్యుత్ కనెక్షన్ ఇవ్వడం జరగదు. నిర్ణీత అనుమతులు పొందిన కట్టడాలకు మాత్రమే విద్యుత్ కనెక్షన్ ఇస్తాం. విద్యుత్ లైన్‌పై వైర్లు వేసి విద్యుత్ చౌర్యానికి పాల్పడేవారికి చర్యలు తప్పవు.

- జాన్‌థామస్, ట్రాన్స్‌కో డీఈ, చీరాల

ఓట్ల నమోదుకు మరో అవకాశం

ఓటర్ల జాబితాలో పేరు లేకపోతే దరఖాస్తు చేసుకొనేందుకు అవకాశం

వచ్చేనెల 15 వరకు అవకాశం

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 19 : జిల్లాలో ఇప్పటివరకు ఓటు నమోదు చేసుకోని యువకులు, గతంలో ఓటుహక్కు ఉండి వివిధ కారణాలతో కోల్పోయిన వారికి ఓటుహక్కును కల్పించేందుకు ఎన్నికల సంఘం మరో అవకాశం కల్పించింది. రాష్ట్రంలో మే 13న లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలను నిర్వహించేందుకు షెడ్యూల్ విడుదల చేసిన విషయం తెలిసిందే. ఆ నేపథ్యంలో ఎన్నికల సంఘం వచ్చేనెల 15వతేదీ వరకు ఓటుహక్కు నమోదు చేసుకునేందుకు అవకాశం కల్పించింది. సాధారణంగా నామినేషన్ల గడువు చివరిరోజు వరకు నమోదుకు దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తుల పరిశీలన, నోటీసుల జారీ, దరఖాస్తుదారుల సమాధానాల కోసం కనీసం వారం రోజులు గడువు ఇవ్వాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో దరఖాస్తులు చేసుకునేందుకు ఏప్రిల్ 15 వరకు అవకాశం కల్పించింది.

ఆన్‌లైన్‌లోనూ ఓటు నమోదు

ఓటుహక్కు నమోదు కోసం ఆన్‌లైన్‌లో కూడా దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించింది. ఎన్నికల సంఘం వెబ్‌సైట్‌లో ఓటు కావాల్సిన వ్యక్తి ఫోన్ నెంబరుతో రిజిస్టర్ చేసుకుని లాగిన్ కావాల్సి ఉంటుంది. రిజిస్టర్ యూజ్ ఏ న్యూ ఓటర్ విభాగంపై క్లిక్ చేస్తే ఫాం-6 అప్లికేషన్ ఫాం ఫర్ న్యూ ఓటర్స్ అనే భాగం కనిపిస్తుంది. అందులో పేర్కొన్న వివరాలన్నీ నింపి సబ్మిట్ చేయాలి. ఆ తర్వాత మీ ఫోన్‌నెంబరుకు రిఫరెన్స్ ఐడీ నెంబరు వస్తుంది. దాని ఆధారంగా ఇదే వెబ్‌సైట్‌లో ఆ దరఖాస్తు ఏ దశలో ఉందో కూడా తెలుసుకునే అవకాశం కూడా ఉంటుంది.

ఆఫ్‌లైన్ ద్వారా...

ఓటుహక్కు నమోదు కోసం ఆఫ్‌లైన్(దరఖాస్తు చేసుకోవడం) ద్వారా ఫాం-6ను బూత్‌లెవల్ అధికారులు(బీఎల్‌ఓ)లకు ఇవ్వొచ్చు. ప్రతి నియోజకవర్గానికి డివిజన్ స్థాయి అధికారిని ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి(ఈఆర్వో)ని ఎన్నికల సంఘం నియమించింది. వారి కార్యాలయాల్లోనూ దరఖాస్తులు ఇవ్వవచ్చు ప్రతి మండలంలో తహసీల్దార్ లేదా డిప్యూటీ తహసీల్దార్లకు ఓటు నమోదు కోసం దరఖాస్తు ఇచ్చేందుకు ఎన్నికల సంఘం అవకాశం కల్పించింది.

గోరుముద్దలో ఎన్నికల నిబంధనలు పాటించాలి

ఒంగోలు(విద్య), మార్చి 19 : పాఠశాలల్లో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం(గోరుముద్ద)లో ఎన్నికల కమిషన్ ప్రకటించిన ప్రవర్తనా నియమావళిని పాటించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు మార్గదర్శకాలను విడుదల చేస్తూ పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. మధ్యాహ్న భోజనం అధికారిక వెబ్‌సైట్‌లోకి నాయకుల ఫొటోలను తొలగించాలి లేదా కనబడకుండా చేయాలి. పాఠశాలలకు సరఫరా చేస్తున్న కోడిగుడ్లలో ఆ వారానికి సంబంధించిన రంగు తప్ప ఎటువంటి స్టాంపులు వేయరాదు. పాఠశాలలకు సరఫరా చేసిన చిక్కిల కవర్ తొలగించి విద్యార్థులకు పంపిణీ చేయాలి. తొలగించిన కవర్లను జాగ్రత్తగా సేకరించి వాటిని కనిపించకుండా చేయాలి. రాగిజావ కోసం సరఫరా చేస్తున్న రాగిపిండి, బెల్లం కవర్లు, బియ్యం గోతాలను కూడా కనిపించకుండా చేయాలి. ఈ నిబంధనలు ఉల్లంఘిస్తే సంబంధిత పాఠశాల హెచ్‌ఎం, ప్రిన్సిపాల్స్ బాధ్యత వహించాల్సి ఉంటుందని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

పీఎం సభ భద్రతా వైఫల్యాలపై విచారణ



ఎమ్మెల్యే గొట్టిపాటి డిమాండ్

అద్దంకి, మార్చి 19 : దేశ ప్రధాని నరేంద్ర మోదీ పాల్గొన్న చిలకలూరిపేట సమీపంలోని బొప్పూడి ప్రజాగళం సభ భద్రత కల్పనలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన పోలీస్ ఉన్నతాధికారులపై చీఫ్ ఎలక్షన్ కమిషన్ తక్షణమే చర్యలు తీసుకోవాలని అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ మంగళవారం ప్రకటనలో కోరారు. లక్షలాది మంది జనం తోసుకు వస్తుంటే నియంత్రించాల్సిన పోలీసులు చోద్యం చూడడడం దేనికి సంకేతమని ప్రశ్నించారు. టీడీపీ, జనసేన, బీజేపీ తొలి ఎన్డీఏ సభ నభూతోనభవిష్యత్ అన్న విధంగా విజయవంతం అయిందన్నారు. మూడు పార్టీల కార్యకర్తలు, అభిమానులు పాల్గొని సభను విజయవంతం చేశారన్నారు. ట్రాఫిక్ జామ్ వల్ల వేలాదిమంది సభకు రాలేకపోయారన్నారు. ప్రధాని ఈ సభ ద్వారా వచ్చే ఐదేళ్లు ఎంతో కీలకమని, ఏపీ ప్రజలకు అండగా ఉంటానని హామీ ఇచ్చారని రవికుమార్ తెలిపారు. ఐదేళ్ల జగన్‌రెడ్డి పాలనలో అభివృద్ధి ఆగిపోయిందని, అవినీతి, దోపిడీలో అధికార వైసీపీ నేతలు పోటీపడ్డారన్నారు. వైసీపీ ప్రభుత్వంపై ప్రజాగ్రహం ఏస్థాయిలో ఉందో కూటమి సభతో స్పష్టమైందన్నారు. ఆరోగ్యశ్రీ సహా పలు పథకాలకు కేంద్రం నిధులు ఇస్తున్నా వైసీపీ ప్రభుత్వం సొంత స్టిక్కర్లు వేసుకుంటూ అంతా తామే చేస్తున్నట్లు ప్రచారం చేసుకుంటున్నట్లు మోదీ చెప్పింది నూటికి నూరుశాతం నిజం అన్నారు. ప్రధాని భద్రత, జనం, ట్రాఫిక్ నియంత్రణ వంటి అంశాలను పోలీస్ ఉన్నతాధికారులు ఎందుకు పట్టించుకోలేదో చీఫ్ ఎలక్షన్ కమిషన్ సమగ్ర విచారణ చేయాలన్నారు. జగన్‌రెడ్డితో పాటు కొందరు అధికారులు ఉద్దేశపూర్వకంగానే సభకు అడ్డంకులు సృష్టించేందుకు ప్రయత్నించారని ఆరోపించారు. ఎవరు ఎన్ని కుట్రలు చేసినా టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు, కార్యకర్తలు సభను విజయవంతం చేశారని ఎమ్మెల్యే గొట్టిపాటి అన్నారు.

పరీక్షా కేంద్రాల తనిఖీ

అద్దంకిటౌన్, మార్చి 19 : అద్దంకిలోని ప్రభుత్వ బాలికల, బాలుర ఉన్నత పాఠశాలలు, చైతన్య పాఠశాల పరీక్ష కేంద్రాలను జిల్లా పరిశీలకుడు, పాఠశాల విద్యాశాఖ అడిషినల్ డైరెక్టర్ కే రవీంద్రనాథ్‌రెడ్డి పరిశీలించారు. పరీక్షలు ప్రశాంత వాతావారణంలో జరిగేలా చూడాలన్నారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పరీక్ష రాసేందుకు సహాయకుడిని ఏర్పాటు చేసిన విద్యార్థికి, మిగిలిన విద్యార్థులకు ఇబ్బంది లేకుండా ప్రత్యేక రూమ్‌ను కేటాయించాలని సూచించారు. స్క్వాడ్ బీ అజయ్‌బాబు బృందం కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ క్రమంలో మంగళవారం హిందీ పరీక్ష జరుగగా, అద్దంకిలోని మొత్తం 6 పరీక్ష కేంద్రాలల్లో 1063 మంది విద్యార్థులకు 1055 మంది హాజరయ్యారని, 8 మంది గైర్హాజరైనట్లు ఎంఈవో -1. డీగంగాధరరావు, ఎంఈవో-2 బీ సుధాకరరావులు తెలిపారు.

బల్లికురవ : పదో తరగతి పరీక్షా కేంద్రాలను విద్యాశాఖ అసిస్టెంట్ డెరెక్టర్, జిల్లా పరిశీలకులు రవీంద్రనాథ్‌రెడ్డి పరిశీలించారు. మండలంలోని బల్లికురవ, అంబడిపూడి ఉన్నత పాఠశాలల్లో కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు. మాస్ కాపీయింగ్ లేకుండా పరీక్షలు జరిగేలా చూడాలన్నారు. ఉప్పుమాగులూరు ఉన్నత పాఠశాల నుంచి 20కిలోమీటర్ల దూరం వచ్చి అంబడిపూడిలో విద్యార్థులు పరీక్షలు రాస్తుండడం చూసి వచ్చే ఏడాది కేంద్రాన్ని ఉప్పుమాగులూరులో ఉండేలా చూస్తామన్నారు. మార్టూరు పోలీసు స్టేషన్‌లో ఉంచిన ప్రశ్నపత్రాల స్ట్రాంగ్ రూంను అయన పరిశీలించారు. పేపర్లు తెచ్చే సమయంలో తీసుకోవాల్సిన భద్రతపై పలు సూచనలు చేవారు. అయన వెంట ఎంఈవోలు వస్త్రంనాయక్ ఉన్నారు. బల్లికురవ పరిక్ష కేంద్రాన్ని జిల్లా స్కాడ్ అధికారి గోపి, తహసీల్ధార్ సుభద్రలు తనిఖీలు చేశారు. విద్యార్థులకు వసతులపై చీఫ్‌లను అడిగి తెలుసుకొన్నారు.

రాజుపాలెంలో అగ్ని ప్రమాదం

నాలుగు ఇళ్లు దగ్ధం.. రెండున్నర లక్షల ఆస్తి నష్టం

మార్టూరు, మార్చి 19: మండల పరిధి రాజుపాలెంలో జయంతినగర్ లో మంగళవారం జరిగిన అగ్ని ప్రమాదంలో మూడు పూరిళ్లు, ఒక పెంకుటిల్లు పూర్తిగా కాలిపోయాయి. ఈ ప్రమాదంలో రూ.2.50 లక్షల ఆస్తి నష్టం జరిగినట్లు అంచనా వేసి వీఆర్‌వో అంకయ్య తహసీల్దార్‌కు సమాచారం ఇచ్చారు. విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదం జరిగి ఉంటుందని భావిస్తున్నారు. ప్రమాదం జరిగిన నాలు ఇళ్లకు చెందిన కుటుంబాలు ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు నెల కిందట వలస వెళ్లారు. ప్రస్తుతం ఈ ఇళ్లల్లో ఎవరూ లేరు. కాని వారికి సంబంధించిన వస్తువులు, వంట సామగ్రి, దుస్తులు, మంచాలు తదితర వస్తువులన్నీ ఆహుతయ్యాయి. మధ్యాహ్న సమయంలో వారి ఇళ్ల నుంచి మంటలు వ్యాపించడంతో స్థానికులు ఫైరింజన్‌కు సమాచారం అందించారు. దాంతో అద్దంకి నుంచి వచ్చిన అగ్నిమాపక వాహన సిబ్బంది మంటలను ఆర్పివేశారు. ఈ ప్రమాదంలో ప్రాణ నష్టం జరగలేదు. కాలనీకి చెందిన వేటగిరి ప్రసాద్‌కు చెందిన పెంకుటిల్లు, వేటగిరి సముద్రం, మెరికా రజిని, పొట్లూరి మాణిక్యంకు చెందిన మూడు పూరిళ్లు కాలపోయాయి. ప్రమాదం జరిగిన విషయాన్ని బాధితులకు తెలియజేసినట్లు వీఆర్‌వో తెలిపారు.

గిరిజన యువకుడి హత్య వెనుక భారీ కుట్ర

వైసీపీ నేతల ప్రోద్బలంపై అనుమానాలు

దర్యాప్తులో పోలీసుశాఖ మీనమేషాలు

టీడీపీలో చేరటమే ఆయన చేసిన నేరం



మునెయ్యను టీడీపీలోకి ఆహ్వానిస్తున్న అశోక్‌రెడ్డి(ఫైల్)

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

కేవలం వైసీపీని వీడి టీడీపీలో చేరాడనే అక్కసుతోనే ఒక గిరిజన యువకుడిని వైసీపీ శ్రేణులు నడిరోడ్డుపై హత్య చేశారు. రెండేళ్ల క్రితం వరకు వారితో కలిసి చట్టాపట్టాలేసుకొని తిరిగిన బంధాన్ని, కులపరమైన అనుబంధాన్ని చివరకు మానవత్వాన్ని కూడా మరిచిపోయి అత్యంత దయనీయంగా నరికి చంపారు. గతంలో ఎప్పుడూ కక్షలు, కార్పణ్యాలు లేని ఆ గిరిజన గూడెంలో సన్నిహితుల మధ్య ఇంతటి దయనీయమైన దుర్ఘటన జరగటం ఏమిటని ఆరా తీస్తే వారిపై పెత్తనం చేసే వైసీపీ నేతల కుట్రలు, కుతంత్రాలే అని తేటతెల్లమవుతోంది.

గిద్దలూరు నుంచి కడప జిల్లా వైపు వెళ్లే మార్గంలో 17 కిలోమీటర్లలో పరమేశ్వరనగర్ అనే కుగ్రామం గడికోట పంచాయతీ పరిధిలో ఉంటుంది. రెండు గ్రామాల్లోను రాజకీయంగా వైసీపీదే ఆధిపత్యం. గడికోటలో బలహీనవర్గాల ప్రజలు అధికంగాను పరమేశ్వరనగర్‌లో పూర్తిగా గిరిజనులు నివసిస్తుంటారు. గడికోటలో అంతో ఇంతో రెడ్లతో పాటు మరి కొన్ని కులాల వారు ఉన్నారు. నిన్న మొన్నటివరకు ఈ పరమేశ్వరనగర్‌లోని గిరిజనులంతా వైసీపీ బాటలో నడిచారు. ఎంపీటీసీ సభ్యుడు శ్రీనివాసరెడ్డి మద్దతుగానే వారు ముందుకు సాగారు. వీరిలో యువకుడైన మునెయ్య వైసీపీ ప్రభుత్వ విధానాలతో విభేదించారు. జగన్ పాలన తీరుతెన్నులు బాగా లేవని అభిప్రాయపడటమే కాక తోటి వారితో ఆ అంశాలను చర్చించేవారు. నియోజకవర్గంలో వైసీపీ నుంచి భారీగా టీడీపీలోకి వలసలు ప్రారంభమైన దశలో మునెయ్య కూడా ఆ వైపు చేరాలని నిర్ణయించుకున్నాడు. 2022లో మాజీ ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. ఆ తర్వాత నుంచి గిరిజనగూడెంలోని ప్రజలను టీడీపీవైపు మళ్లించటం ప్రారంభించారు. దీంతో టీడీపీ వర్గం పెరిగింది. గడికోటలో కూడా టీడీపీలోకి చేరికలు పెరిగిపోయాయి. ఎన్నికల సమయం రావటం టీడీపీ, వైసీపీ అభ్యర్థులు ఖరారు కావటంతో ఇరు పక్షాల తరఫున కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. అంతలో గత ఆదివారం బొప్పూడి వద్ద టీడీపీ కూటమి సభకు మునెయ్య టీడీపీ వర్గీయులను సమీకరించారు. ఒక ప్రత్యేక వాహనంలో పరమేశ్వరనగర్,గడికోట వాసులు బయలుదేరి ఆ సభకు వెళ్లి వచ్చారు. దీంతో వైసీపీ శ్రేణుల్లో అలజడి మొదలైంది. ఫలితంగా సోమవారం రాత్రి గ్రామంలోని నడిరోడ్డు మీద వైసీపీలో చురుగ్గా పనిచేసే అల్లూరయ్య, ఈశ్వరయ్య మరో ఇద్దరు కలిసి మునెయ్యను పిలిచి బెదిరించారు. అకస్మాత్తుగా మారణాయుధాలతో దాడి చేశారు. వారు ఎంపీటీసీ శ్రీనివాసరెడ్డి అనుచరులుగా ముద్ర ఉంది. శ్రీనివాసరెడ్డికి పెద్ద నాయకులతో సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. దీంతో ముందుగా జరిగిన కుట్రలో భాగంగానే మునెయ్యను హత్య చేశారని భావిస్తున్నారు. ఆకస్మికంగా వాదన జరిగితే అప్పటికప్పుడు వారి చేతిలో ఆయుధాలు ఉండవనేది జగమెరిగిన సత్యం. ముందుగా పక్కా ప్రణాళికతోనే ఆయుధాలతో అతని వద్దకు వెళ్లి వాదనకు దిగి కొన్ని క్షణాల్లోనే దాడిచేసినట్లుగా తెలుస్తోంది. మున్నెయ్యని కాపాడుకునేందుకు వారి బంధువులు, టీడీపీ శ్రేణులు గిద్దలూరు, నంద్యాలలో చికిత్సలు అనంతరం హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. అక్కడ ఆయన చికిత్సపొందుతూ మృతిచెందారు.

పోలీసుల తీరుపైనా అనుమానాలు

పోలీసుల పాత్రపైన పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గాయపడ్డ మున్నెయ్య తొలుత గిద్దలూరు వైద్యశాలలో ఉన్నప్పుడు ఒక పోలీసు అధికారి వ్యవహరించిన తీరు అనుమానాలకు తావిస్తోంది. ఈ ఘటన జరిగి 24 గంటలు అయినా ఇంతవరకు అనుమానితుల్లో ఒక్కరినీ అదుపులోకి తీసుకోలేదు. గ్రామంలో శాంతిభద్రతలను కాపాడేందుకు పికెట్ ఏర్పాటుచేసినా పరారీలో ఉన్న నిందితులను అదుపులోకి తీసుకునేందుకు పోలీసు తరహా దర్యాప్తు ప్రారంభమైన దాఖలాలు లేవు. పైగా నిందితులు ఆ ప్రాంతంలో సురక్షితంగా ఉన్నారని తెలుస్తోంది. వైసీపీ నేతల ఇళ్లల్లో గాలింపు చర్యలు కూడా పోలీసు అధికారులు చేపట్టిన దాఖలాలు లేవు. హతుడు భార్య ఇచ్చే సమాచారం కోసం వేచి ఉన్నామంటూ పోలీసు అధికారులు చెబుతుండటం కూడా అనేక అనుమానాలకు దారితీస్తోంది.

ఎన్నికల కోడ్ కూస్తే మాకేంటి..!

పీఏసీఎస్ ఆఫీసులో వైసీపీ నేతల సమావేశం



పీఏసీఎస్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న రెడ్డి కార్పొరేషన్ చైర్మన్ చింతలచెరువు

హనుమంతునిపాడు(కనిగిరి), మార్చి 19 : ఎన్నికల కోడ్‌ను వైసీపీ నేతలు యథేచ్ఛగా ఉల్లంఘిస్తున్నా పట్టించుకునే వారు లేరు. కోడ్ వస్తే మాకేంటి అన్నట్లుగా వైసీపీ నేతలు ఏకంగా ప్రభుత్వ ఆఫీసుల్లోనే బాహాటంగా పార్టీ కార్యకలాపాలు సాగిస్తున్నారు. హనుమంతునిపాడులో కేంద్రం సహకార బ్యాంకు పీఏసీఎస్ ప్రభుత్వ కార్యాలయంలో వైసీపీ నాయకులు, సొసైటీ బ్యాంక్ చైర్మన్ ఎక్కంటి శ్రీనివాసులరెడ్డి, రెడ్డి కార్పొరేషన్ చైర్మన్ చింతలచెరువు సత్యనారాయణ రెడ్డి, మాజీ ఎంపీపీ గాయం బలరామిరెడ్డి, హనుమంతాపురం సర్పంచ్ సానికొమ్ము మధుసూదన్‌రెడ్డి, నందనవనం ఎంపీటీసీ సభ్యుడు నారాయణస్వామి, సచివాలయ కన్వీనర్ మద్ది తిరుపతయ్య కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఎన్నికల పోల్ మేనేజ్‌మెంట్ గురించి బూత్ కన్వీనర్‌లు, సచివాలయ కన్వీనర్‌లు, మండలపార్టీ అధ్యక్షులతో వారు చర్చించారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘించి సమావేశం నిర్వహించినా అధికారులు అది తమ పని కాదన్నట్లు వ్యవహరించారు. వైసీపీకి చెందిన వారికి ఎన్నికల కోడ్ వర్తించదా, సామాన్యులకేనా అంటూ ప్రజలు అధికారులను ప్రశ్నిస్తున్నారు.

గొర్రెల మందను ఢీకొన్న లారీ

కాపరి పున్నయ్య మృతి

చనిపోయిన ఎనిమిది గొర్రెలు.. వల్లాపల్లిలో విషాదం





మృతి చెందిన గొర్రెలు, మృతి చెందిన గొర్రెల కాపరి వెంపరాల పున్నయ్య

బల్లికురవ, మార్చి 19 : మండల పరిధిలోని బల్లికురవ అద్దంకి అర్‌అండ్‌బీ రోడ్డు వల్లాపల్లి గ్రామం వద్ద మంగళవారం రాత్రి గొర్రెల మందన లానీ ఢీరొటికటందిజ ఈ ప్రమాదంలో గొర్రెల కాపరి వెంపరాల పున్నయ్య (55), ఎనిమిది గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందాయి. అందిన సమాచారం మేరకు వల్లాపల్లి గ్రామానికి చెందిన గొర్రెల కాపరి వెంపరాల పున్నయ్య గొర్రెలతో మేతకు ఉదయం పొలం వెళ్లి తిరిగి ఇంటికి వస్తుండగా అద్దంకి వైపు నుంచి వస్తున్న లారీ వేగంగా వచ్చి గొర్రెల మందపైకి దూసుకెళ్లింది. ప్రమాదంలో ఏనిమిది గొర్రెలు మరియు కాపరి పున్నయ్య కూడా అక్కడిక్కడే మృతి చెందాడు. కొద్ది నిమిషాల్లో గమ్యానికి చేరే సమయంలో ప్రమాదం జరగడంతో గొర్రెల కాపరి మృతి చెందారు. ప్రమాద వార్త తెలుసుకున్న గ్రామస్థులు పెద్ద ఎత్తున సంఘటనా స్థలానికి చేరి పోలీసులకు సమాచారం అందించారు. పున్నయ్యకు భార్య హనుమాయమ్మ, ముగ్గురు అడపిల్లలున్నారు. ఘటనా స్థలాన్ని ఎస్‌ఐ నాగశివారెడ్డి పరిశీలించి ప్రమాదానికి కారణమైన లారీని అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి పోస్టు మార్టం నిమిత్తం మృతదేహాన్ని అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. గొర్రెల కాపరి మృతితో వల్లాపల్లిలో విషాదఛాయలు అలుముకొన్నాయి.

కొణికిలో నేత్రదానం

ఇంకొల్లు, మార్చి 19 : మండలంలోని కొణికిలో నేత్రదానం జరిగింది. గ్రామానికి చెందిన బండి రాములమ్మ(72) మంగళవారం మృతి చెందగా, ఇంకొల్లు రోటరీ అవయవదాన కమిటీ ఆధ్వర్యంలో గుంటూరు శంకర కంటి ఆసుపత్రి వైద్యులు రాములమ్మ నేత్రాలను సేకరించారు. నేత్రదానానికి సహకరించిన కుటుంబ సభ్యులు నాగేశ్వరరావు, శ్రీనివాసరావు, వీరాంజనేయులు, సీతామహాలక్ష్మిని అవయవదాన కమిటీ సభ్యులు సోమేపల్లి రామ్మోహనరావు, రోటరీ అధ్యక్షుడు కరి కమలేశ్వరరావు, కార్యదర్శి జెట్టి వెంకటేశ్వర్లు, కోశాధికారి చుండి సాంబశివరావు అభినందించారు.

వీఆర్‌కు కారంచేడు ఎస్‌ఐ?

కారంచేడు(పర్చూరు), మార్చి 19 : కారంచేడు ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న కె.సురేష్‌ను వీఆర్‌కు పంపినట్లు సమాచారం. గత నాలుగు రోజుల క్రితమే వీఆర్‌కు పంపినట్లు తెలిసింది. ఆయన కేవలం నెలరోజుల క్రితమే కారంచేడు ఎస్‌ఐగా పదవీ బాధ్యతలు స్వీకరించారు. చినగంజాంలో ఎస్సైగా పనిచేస్తూ కారంచేడు బదిలీ అయ్యారు. ఎస్‌ఐని ఆధికారులు వీఆర్‌కు పంపడం వెనుక రాజకీయ కోణమా మరి ఏ ఇతర కారణాల అనేది తెలియాల్సి ఉంది. ప్రస్తుతం ఏఎస్‌ఐ జి.మధుబాబు ఇన్‌చార్జి ఎస్సైగా ఉన్నారు.

విద్యార్హతల వివరాలను నమోదు చేయాలి

ఒంగోలు(కలెక్టరేట్); మార్చి 19: జిల్లాలోని ప్రైవేటు వైద్యశాలలు, క్లినిక్‌లు, ల్యాబ్‌లు, డయాగ్నోస్టిక్స్ సెంటర్స్ కేంద్రాల వైద్యులు, స్టాఫ్ నర్సులు ఆయూష్మాన్ భారత్ డిజిటల్ మిషన్‌లో తప్పనిసరిగా వారి వ్యక్తిగత, విద్యార్హతలు, కౌన్సిల్ వివరాలు నమోదు చేసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ ఎస్. రాజ్యలక్ష్మి మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. ఆయా వివరాలను నమోదు చేసుకోకపోతే సెంటర్ల కొత్త రిజిస్ట్రేషన్లు, రెన్యువల్స్‌ను నిలిపివేస్తామని ఆమె హెచ్చరించారు.

ఓడిపోతున్నారన్న అక్కసుతోనే నరమేధం

జగన్ హత్యారాజకీయాలనే వైసీపీ కార్యకర్తలు ఆదర్శంగా తీసుకున్నారు

మునయ్య హంతకులను కఠినంగా శిక్షించాలి

టీడీపీ అభ్యర్థి ముత్తుముల అశోక్‌రెడ్డి



మాట్లాడుతున్న అశోక్‌రెడ్డి

గిద్దలూరు టౌన్, మార్చి 19: అధికారం కోల్పోతున్నామన్న అక్కసుతోనే వైసీపీ రాక్షసమూకలు నరమేధం సాగిస్తున్నాయని టీడీపీ అభ్యర్థి ముత్తుముల అశోక్‌రెడ్డి ధ్వజమెత్తారు. మండలంలోని గడికోట పంచాయతీలోని పరమేశ్వర్‌నగర్‌కు చెందిన టీడీపీ నాయకుడు మునయ్యను గొడ్డలితో నరికి చంపిన హంతకులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సొంత బాబాయిని గొడ్డలితో చంపిన నాయకుడిని వైసీపీ కార్యకర్తలు ఆదర్శంగా తీసుకున్నారని పేర్కొన్నారు. వైసీపీ రాక్షసజాతికి చెందిన పార్టీ అని ఆయన విమర్శించారు. వైసీపీ చేస్తున్న హత్యా రాజకీయాలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. టీడీపీ నాయకులు పాముల మునయ్య హత్యను తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలపై దాడులు చేసిన వారిని వదిలే ప్రసక్తే లేదని ఆయన హెచ్చరించారు. ఈనెల 17న చిలకలూరిపేట ప్రజాగళం సభకు పరమేశ్వర్‌నగర్ నుంచి మునయ్య పెద్దఎత్తున జనాలను తరలించారన్న అక్కసుతో వైసీపీ రాక్షస మూకలు గొడ్డలితో నరికి చంపారన్నారు. ఎన్నికల సంఘం వైసీపీకి ఫ్యాన్ గుర్తును రద్దుచేసి గొడ్డలి గుర్తు కేటాయించాలని ఎద్దేవా చేశారు. మునయ్య హత్య వెనుక ఉన్న రాజకీయ నాయకులపై కూడా కఠినమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మృతిచెందిన పాముల మునయ్య కుటుంబానికి పార్టీ అన్నివిధాలుగా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. సమావేశంలో జడ్పీటీసీ సభ్యుడు బుడత మధుసూదన్‌యాదవ్, పార్టీ మండల అధ్యక్షుడు మార్తాల సుబ్బారెడ్డి, నాయకులు కడియం శేషగిరి, బిల్లా రమేష్ యాదవ్, బాబాయ్ పాల్గొన్నారు.

తాయిలాల మంత్రి!

'కోడ్' కూయకముందే అంతా పూర్తి

అన్నివర్గాలకు ముమ్మర ప్రలోభాలు

వలంటీర్లకు గిఫ్టులు, రూ.5వేల నగదు

పాస్టర్లు, విలేకరులకు దుస్తులు, బహుమతులు

ప్రెషర్ కుక్కర్లు, ప్లాస్కులు, గ్లాస్, డిన్నర్ సెట్లు

సిద్ధం సభకు వెళ్లినవారికి మద్యం, నగదు, బిర్యానీ

కోడ్ అమలులోకి రావడంతో అంతా గప్‌చుప్

విస్తుపోతున్న కొండపి నియోజకవర్గం జనం

కొండపి, మార్చి 19 : ప్రతి పని మాటున ఓటు రాబట్టుకోవడమే లక్ష్యంగా మంత్రి నియోజకవర్గానికి వచ్చిన నాటి నుంచి పనిచేస్తున్నారు. దీనికోసం అన్ని వర్గాలవారిని, ప్రభుత్వ ఉద్యోగులను, విలేకరులను కూడా ప్రలోభపెట్టారు. కోడ్ కూయకముందే అన్ని పంపిణీలు పూర్తిచేశారు. నియోజకవర్గంలోకి అడుగు పెడుతూనే పాస్టర్లతో ఆత్మీయ సమావేశం అంటూ వారికి ప్యాంటు, షర్టులు, చీరెలు అందజేశారు. తర్వాత విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అంటూ కార్యక్రమం చేపట్టి ఉచితంగా అందజేశారు. ఆ సమావేశాల్లో విద్యార్థులకు ఇళ్ల వద్ద ఉండే పెద్దలకు చెప్పి వైసీపీకి ఓట్లేయించాలని విజ్ఞప్తిచేశారు. తర్వాత వలంటీర్ల వంతు నియోజవకర్గంలో 1,600 మంది వలంటీర్లు ఉంటే అందరికీ రూ.5వేల నగదు, స్వీట్లు అందజేశారు. తిరిగి వలంటీర్లకే రెండోసారి ప్రెషర్ కుక్కర్లు, డిన్నర్ సెట్‌లు, టీగ్లాసులు, ఫ్లాస్కులు అందజేశారు. మధ్యమధ్యలో పలు మండలాల విలేకరులను సింగరాయకొండ పిలిపించుకుని ప్యాంట్, షర్ట్‌లు, చీరలు అందజేశారు. మధ్యలో మేదరమెట్ల సిద్ధం సభకు వైసీపీ కార్యకర్తలను తరలించేందుకు వారికి మద్యం, బిర్యానీ, రూ.500 అందజేశారు. నియోజకవర్గం అంతటా ఇదే కార్యక్రమాన్ని మంత్రి సురేష్ కొనసాగించారు. నియోజకవర్గంలో మునుపు ఎన్నడూ లేని విధంగా వివిధ వర్గాల వారిని మంత్రి సురేష్ ప్రలోభపెట్టడాన్ని రాజకీయ పరిశీలకులు, ప్రజలు విమర్శిస్తున్నారు. ఇంతగా ప్రలోభ పెట్టే వ్యక్తి గతంలో గెలిచిన నియోజకవర్గాల్లో ఏమి చేశాడు, రేపు నియోజకవర్గంలో ఏమి జరుగుతుందనేది ప్రజలు బాహాటంగానే చర్చించుకుంటున్నారు. అయితే కోడ్ అమలులోకి రావడంతో అంతా గప్‌చుప్ అయిపోయారు. ప్రతి మండలానికి ఒక పార్టీ ఆఫీసు ప్రారంభించే పనిలో ఉన్నారు. అందులోనే అన్ని కార్యక్రమాలు కొనసాగేలా ప్రణాళిక రూపొందించారు.

> ఆయన రాష్ట్ర మంత్రి, రాష్ట్రానికి, జిల్లాకు, ఆయన పోటీచేసి గెలిచిన నియోజవకర్గానికి చేసిన మంచి ఏమిటో తెలియదుగాని, తాజాగా కొండపికి పార్టీ అధినేత ఆదేశాలతో ఇన్‌చార్జిగా వచ్చారు. సార్ వచ్చిందే తడవు.. నియోజకవర్గంలో రకరకాల విన్యాసాలు మొదలయ్యాయి. ప్రారంభంలో పలు మండలాల్లో ఖర్చుల బాధ్యత అధికారులు, వ్యాపారుల నుంచి వసూలు చేసే ప్రయత్నం చేశారు. అప్పట్లో విమర్శలు రావడంతో తనే సొంత డబ్బులు వెదజల్లడం ప్రారంభించారు. తాయిలాల పంపిణీలో ముందున్నారు. అలాగే ప్రలోభాలలోనూ అందెవేసిన చేయి.. ఆయన ఎవరోకాదు పురపాలకశాఖ మంత్రి, వైసీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి ఆదిమూలపు సురేష్.

ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా...

ఎన్నికల ప్రవర్తనా నియమావళి ప్రకారం ఎన్నికల కమిషన్ గడిచిన నెలరోజులుగా నిబంధనలను వెలువరిస్తూనే ఉంది. కోడ్ ఆఫ్ కండక్ట్ వచ్చాక ఎవరు ఏమి చేయకూడదో ప్రకటనలు విడుదల చేయగా, అది రాకముందే మంత్రి ఇలాకాలో అన్నీ జరిగిపోయాయి. అన్నివర్గాలను ప్రలోభాలకు గురిచేశారు. నిర్మాణంలో ఉన్న సచివాలయాలను ప్రారంభ కార్యక్రమాలు చేసేశారు. మనపల్లెకు సురేష్ అంటూ నియోజకవర్గంలో తాయిలాల పంపకం జరిగింది. ప్రభుత్వ, పార్టీ కార్యక్రమాలకు మధ్య తేడా లేకుండాపోయింది. ఇందుకు సచివాలయాల ప్రారంభం సందర్భంగా చోడవరంలో వలంటీర్లు వైసీపీ కండువాలు మెడలో వేసుకుని, పార్టీ జెండాలు చేతబూని కార్యక్రమంలో పాల్గొనడమే నిదర్శనం. అదేవిధంగా పార్టీ కండువాలు మెడలో వేసుకుని మంత్రి సురేష్‌తో సెల్ఫీలు దిగారు. ఇది తీవ్ర విమర్శలకు దారితీసింది. చిన్నారులను పార్టీల ప్రచారానికి వాడవద్దని ఎన్నికల సంఘం ఇటీవల జారీచేసింది. అయితే పల్లెపల్లెకు మన సురేష్ పేరుతో చేపట్టిన పార్టీ కార్యక్రమంలో పలు గ్రామాల్లో చిన్నారులు పాల్గొనేలా పార్టీ నాయకులు ప్రోత్సహించారు. చిన్నారులు మంత్రిపై పూలుచల్లుతూ, పార్టీ జెండాలు చేతబట్టుకుని ప్రచారంలో పాల్గొన్నారు. మొత్తంగా చిన్నా, పెద్దా తేడా లేకుండా, విద్యార్థులు, వలంటీర్లు, విలేకరులు, పార్టీ కార్యకర్తలు, ప్రభుత్వ ఉద్యోగులను ప్రలోభ పెడుతూ దుస్సాహసానికి ఒడిగడుతున్నా మంత్రి ముందు ముందు ఎటువంటి కార్యక్రమాలకు తెరతీస్తారో, ఆయన మాయలో పడి ఎందరు అధికారులు బలవుతారోనని నియోజకవర్గం లోపల, వెలుపలా చర్చోపచర్చలు జరుగుతున్నాయి. కాగా మంత్రి ప్రలోభాలపై ఎన్నికల కమిషన్ దృష్టి సారించాలని ప్రతిపక్ష పార్టీల వారు డిమాండ్ చేస్తున్నారు.

ముగ్గురు ఈఆర్వోలు, తహసీల్దార్ల మార్పులు

కాగా ఎన్నికల విధులు నిర్వహించేందుకు ప్రభుత్వం నియోజవర్గానికి డిప్యూటీ కలెక్టర్ స్థాయి అధికారిని ఈఆర్వోగా నియమించింది. ఇది కూడా మంత్రి కారణంగానే నెలరోజుల కిందట వివాదంగా మారింది. ఇద్దరు మహిళా అధికారులు వరుసగా బాధ్యతలు చేపట్టి మరునాడే తిరిగి వెళ్లిపోయారు. ఇపుడు ఉన్న ఈఆర్వో కుమార్ మూడో వ్యక్తిగా వచ్చి బాధ్యతలు చేపట్టారు. అదేవిధంగా సింగరాయకొండకు తహసీల్దార్‌గా ముగ్గురు నియమితులయ్యారు. వారంతా బాధ్యతలు చేపట్టలేదు. ఇపుడు ఉన్న తహసీల్దార్ మాత్రమే బాధ్యతలు చేపట్టారు. ఇలా ఈఆర్వోలు బాధ్యతల నుంచి వైదొలగడానికి, సింగరాయకొండ తహసీల్దార్‌లుగా నియమితులైన వారు విధుల్లో చేరకపోవడానికి మంత్రి ప్రమేయమే కారణమని ఆరోపణలు ఉన్నాయి. దీనికి అప్పట్లో మంత్రి సురేష్ ప్రమేయం లేదని జిల్లా స్థాయి అధికారులు ఖండనలు ఇవ్వలేదు.

సీనరేజ్ నిధుల జమలో అధికారుల తప్పిదం

- నాలుగు గ్రామాల మధ్య వివాదం
- ఒక్క పంచాయతీకే కేటాయించిన వైనం
- ముగ్గురు సర్పంచ్‌ల ఫిర్యాదుతో డ్రా నిలిపివేత
- హైకోర్టును ఆశ్రయించిన కొణిదెన సర్పంచ్
- మిగతావారూ అదేబాటలో
- డబ్బులు విడుదల కాక అభివృద్ధి శూన్యం
- వెంటనే సమస్య పరిష్కరించాలని గ్రామస్థులు వినతి





మల్లాయపాలెం గ్రామ పంచాయతీ కార్యాలయం.. నిధుల లేమితో నిరుపయోగంగా నక్కబొక్కలపాడు చెత్త సంపద కేంద్రం

బల్లికురవ. మార్చి 19 : పంచాయతీలకు కేటాయించే సీనరేజ్ నిధుల జమల్లో అధికారులు చేసిన తప్పుతో ఇప్పుడు నాలుగు గ్రామ పంచాయతీల మధ్య రోజురోజుకూ వివాదం పెద్దదవుతోంది. ఇప్పటికే నాలుగు గ్రామాలకు చెందిన సర్పంచ్‌లు హైకోర్టును ఆశ్రయించారు. ఎవరికి వారు పట్టుదలతో సీనరేజ్ నిధులు కావాలంటూ పట్టుబడుతున్నారు. దీంతో నాలుగు గ్రామాలలో అభివృద్ధి పనులు పూర్తిగా నిలిచిపోయాయి. అధికారులు యధా ప్రకారం గతంలో మాదిరిగా నిధులు కేటాయించి ఉంటే సమస్య ఇంత పెద్దదయ్యేది కాదని ప్రజలు ఆరోపిస్తున్నారు.

బల్లికురవ మండలం కొణిదెన రెవెన్యూలో సర్వే నెంబరు 103లో కొణిదెన, మల్లాయపాలెం, కె.రాజుపాలెం, నక్కబొక్కలపాడు గ్రామాలకు సంబంధించిన భూములు ఉన్నాయి. ఈ భూముల ద్వారా ప్రభుత్వానికి వచ్చే ఆదాయంలో నాలుగు పంచాయతీలకు వాటాల మేర సీనరేజ్ నిధులు అభివృద్ధి పనులకు కేటాయించాల్సి ఉంది. గత పదిహేనేళ్ల నుంచి ప్రతి ఏటా మూడు క్వార్టర్లగా సీనరేజ్ నిధులను అధికారులు కేటాయిస్తున్నారు. 2008లో అప్పటి సర్పంచ్‌లు, అధికారులు కొణిదెన రెవెన్యూ ద్వారా వచ్చే ఆదాయాన్ని మల్లాయపాలెంకు 32 శాతం, కొణిదెనకు 24శాతం, కె.రాజుపాలెంకు 15 శాతం, నక్కబొక్కలపాడుకు 24 శాతం చొప్పున నిధులు కేటాయించేలా ఒప్పందం చేసుకొని రాత పూర్వక సంతకాలు కూడా చేసి ఉన్నారు. కాని గత నాలుగు మాసాల క్రితం జిల్లా పంచాయతీ అధికారులు మూడు క్వార్టర్ల సీనరేజ్ నిధులు సుమారు. రూ.1.40కోట్లను కొణిదెన పంచాయతీ ఖాతాకు జమ చేశారు. ఈ విషయం తెలిసిన మిగిలిన మూడు గ్రామాల సర్పంచ్‌లు తమకు రావాల్సిన సీనరేజ్ నిధులు ఎందుకు వేయలేదని వెంటనే కలెక్టర్‌కు పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేశారు. తమ వద్ద ఒప్పంద పత్రాలను కూడా వారికి చుపించారు. తప్పు జరిగింది అని తెలుసుకొన్న అధికారులు వెంటనే కొణిదెన పంచాయతీకి కేటాయించిన నిధులు డ్రా చేయకుండా ఖాతాను స్తంభించారు. వెంటనే జమ చేసిన నిధులు వెనక్కి పంపాలని పంచాయతీ కార్యదర్శికి జిల్లా అధికారులు లేఖ పంపారు. కొణిదెన సర్పంచ్ తన్నీరు లేపాక్షి మాత్రం సీనరేజ్ నిధులు మెత్తం మా గ్రామానికే చెందుతాయని తాను నిధులు వెనక్కి పంపేది లేదని వెంటనే హైకోర్టులో పిల్ వేశారు. సీనరేజ్ నిధులపై తమకు హక్కు ఉందని మిగిలిన గ్రామాలతో సంబంధం లేదని వెంటనే పంచాయతీ ఖాతాలో యధావిధిగా నిధులు డ్రా చేసుకునేలా ఉత్తర్వులు ఇవ్వాలని కోర్టును ఆశ్రయించారు. విషయం తెలుసుకున్న మల్లాయపాలెం, రాజుపాలెం, నక్కబొక్కలపాడు సర్పంచ్‌లు జూపల్లి రాఘవరావు, అమరనేని లక్ష్మీ, దూళిపాళ్ల బుల్లిరామయ్య వారి వద్ద గతంలో వాటాల మేరకు అధికారుల సమక్షంలో జరిగిన ఒప్పంద పత్రాలతో వారు కూడా హైకోర్టును ఆశ్రయించారు. వెంటనే మా గ్రామాలకు రావాల్సిన సీనరేజ్ నిధులు విడుదల చేసేలా ఉత్తర్వులు ఇవ్వాలని కోర్టుకు విన్నవించారు. దీంతో నాలుగు గ్రామాలలో గత నాలుగు మాసాల నుంచి అభివృద్ధి పనులు పూర్తిగా నిలిచిపోయాయి. జిల్లా స్థాయిలో అధికారులు చేసిన తప్పుతో నాలుగు గ్రామాల మధ్య వివాదం పెద్దది అయి గ్రామాలలో పారిశుధ్యం కూడా పడకవేసిందని ప్రజలు ఆరోపిస్తున్నారు. 15 ఏళ్ల నుంచి వాటాల మేర వేస్తున్న సీనరేజ్ నిధులు ఒక్క గ్రామానికే అధికారులు ఎలా కేటాయించారని వారు ప్రశ్నిస్తున్నారు. సీనరేజ్ నిధుల వ్యవహారం ప్రజలకు తెలిసి ఇప్పుడు గట్టిగా అడిగి వాటా ప్రకారం జమ చేయించుకోకుంటే మునుముందు తమ గ్రామాలలో అభివృద్ధి పనులకు నిధుల లేమి వస్తుందని వారు ఆందోళన చెందుతున్నారు. జిల్లా అధికారులు వెంటనే ఈ వ్యవహారంలో కలుగ జేసుకొని నాలుగు గ్రామాల సర్పంచ్‌లతో సమావేశం ఏర్పాటు చేసి గతంలో వలే సీనరేజ్ నిధులు కేటాయింపు జరిగేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

వాటా మేరకు నిధులివ్వాలి



తమ గ్రామానికి రావాల్సిన సీనరేజి నిధులను వెంటనే అధికారులు కేటాయించాలి. 2008లో అధికారుల సమక్షంలో కొణిదెన రెవెన్యూ పరిధిలో ఉన్న భూముల ప్రకారం వాటాలను కేటాయించారు. ఇప్పుడు నిధులు ఒక్క గ్రామానికే కేటాయించారు. అధికారులు చేసిన తప్పుకు గ్రామాలలో ఆందోళన నెలకుంది. ప్రజలకు ఈ విషయం తెలిసి తమపై ఒత్తిడి పెంచారు. వెంటనే అధికారులు తప్పును సరిదిద్దాలి. మా గ్రామానికి అన్ని గ్రామాల కన్న అత్యధికంగా 32 శాతం సీనరేజ్ నిధులు రావాల్సి ఉంది. - జూపల్లి రాఘవరావు, సర్పంచ్, మల్లాయపాలెం

సీనరేజ్ నిధులపై హైకోర్టును అశ్రయించాం



గత పదిహేనేళ్ల నుంచి వాటాల మేరకు సీనరేజి నిధుల కేటాయింపు జరుగుతుండేది. ప్రస్తుతం ఒక్క కొణిదెన గ్రామానికి మాత్రమే జిల్లా అధికారులు కేటాయించారు. ఈ విషయం తెలిసి అధికారులకు ఫిర్యాదు చేశాం. కొణిదెన సర్పంచ్ కోర్టుకు వెళ్లడంతో తాము కూడా తమ వద్ద ఉన్న ఆధారాలతో కోర్టును ఆశ్రయించాం. పంచాయతీలో నిధులు లేక గ్రామాలలో అభివృద్ధి పనులు నిలిచి పోయాయి. అధికారుల తప్పిదంతో నాలుగు గ్రామాల మధ్య చిచ్చు రేపింది. - దూళిపాళ్ల బుల్లిరామయ్య, సర్పంచ్, నక్కబొక్కలపాడు



మాట్లాడుతున్న ఆర్డీవో సూర్యనారాయణరెడ్డి

ఎన్నికల నియమావళిని పాటించాలి

రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆర్డీవో సూర్యనారాయణరెడ్డి

చీరాల, మార్చి 19 : రిజిస్టర్, రికగ్నైజేషన్ పొందిన అన్ని రాజకీయ పార్టీలు ఎన్నికల నియమావళిని తప్పకుండా పాటించాలని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో సూర్యనారాయణరెడ్డి చెప్పారు. ఆర్డీవో కార్యాలయంలో మంగళవారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో తహసీల్దార్ నాసరయ్యతో కలసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన నేపథ్యంలో ఆయా రాజకీయ పార్టీల ప్రతినిధులు తమ ప్రచార హోర్డింగ్‌లు లేదా ఫ్లెక్సీలు తదితరాలు ప్రైవేటు వ్యక్తుల స్థలాలు లేదా భవనాలపై ఉంచేప్పుడు, వారి గోడలపై ఏదన్నా రాతలు రాసినా ముందుస్తుగా వారి అనుమతి పొందిన తరువాత మాత్రమే ఆ చర్యలు చేపట్టాలన్నారు. ఎన్నికల నియమావళి ప్రకారం ఎంపీ అభ్యర్థి అయితే రూ.90లక్షలు, ఎమ్మెల్యే అభ్యర్థి అయితే రూ.40 లక్షలు వ్యయం చేయవచ్చాన్నారు. ఆయా పార్టీలకు సంబంధించి ప్రచారంలో పార్టీ జెండాలతో పాల్గొనే వాహనాలకు ముందస్తుగా వెహికల్ పర్మిషన్ తీసుకోవాలన్నారు. బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు లాంటి బహిరంగ ప్రదేశాల్లో కూడా ప్రచార హోర్డింగ్‌లు లాంటివి ఏర్పాటు చేయకూడదన్నారు. అలా ఎవరన్నా చేస్తే నోటీసులు ఇచ్చి 48 గంటల్లో తొలగిస్తామన్నారు. అభర్యుల నామినేషన్లు, విత్‌డ్రాయల్, స్క్రూట్నీని తరువాత బ్యాలెట్ పేపరులో ఆయా అభ్యర్థుల పేర్లు సక్రమంగా నమోదయ్యే విధంగా సరిచూసుకోవాలన్నారు. ఆయా పార్టీల ప్రతినిధులు వెలిబుచ్చిన సందేహాలను నివృత్తి చేశారు. సమావేవంలో ప్రసాద్(టీడీపీ), శివరామప్రసాద్(జనసేన), భరణీరావు(బీజేపీ), ఎన్.బాబూరావు(సీపీఎం), ఏ. బాబూరావు(సీపీఐ) భగత్‌సింగ్(బీఎస్పీ) పాల్గొన్నారు.

అధికారులకు కనిపించలేదా..?

కోడ్ వచ్చినా తొలగించని సీఎం బొమ్మ



మార్టూరు, మార్చి 19 : ఎన్నికల కోడ్ వచ్చిన తర్వాత ప్రభుత్వ భవనాల మీద ఉన్న ప్రజా ప్రతినిధుల బొమ్మలను తొలగించాలని ఎన్నికల కమిషన్ ఆదేశాలు జారీ చేసింది. మార్టూరులో చెరువు స్థలంలో నూతనంగా నిర్మించి న గ్రామ సచివాలయ భవనంపైన సీఎం బొమ్మను అధికారులు అలాగే ఉంచారు. కోడ్ వచ్చినా బొమ్మలు కనిపించలేదా అని ప్రజలు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా ఎన్నికల నిబంధనలను అధికారులు పాటించాలని కోరుతున్నారు.

ఫ్లెక్సీల తొలగింపులో పక్షపాతం

అధికారుల తీరుపై గ్రామస్థుల ఆగ్రహం



నాగులచెరువుకట్ట వద్ద వైసీపీ రంగులతో ఆర్బీకే

ఇంకొల్లు, మార్చి 19 : కోడ్ వచ్చి మూడురోజులవుతున్నా ఇంకొల్లు మండలంలోని అధికారులు మొద్దు నిద్ర వీడలేదు. ఫ్లెక్సీల తొలగింపులో పక్షపాత ధోరణితో వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. ఇంకొల్లు మండలం లో స్వామిభక్తి చాటుకునేందుకు కొందరు ఎన్నికల ఆదేశాలకు తూట్లు పొడుస్తున్నారు. ఇంకొల్లులో నాగులచెరువుకట్ట మీద ఎన్టీఆర్ విగ్రహం, రైతు భరోసా కేంద్రం పక్కపక్కనే ఉన్నాయి. ఎన్టీఆర్ విగ్రహానికి ఆదివారమే ముసుగు తొడిగారు. పక్కనే ఉన్న ఆర్బీకే వైసీపీ రంగులతో దర్శనమిస్తోంది. మూడురోజులైనా పట్టించుకోని అధికారులు మంగళవారం మరోసారి ఎన్టీఆర్ విగ్రహం కింది భాగంలో పేర్లు కనిపిస్తున్నాయని వాటిని కూడా కనిపించకుండా చేసుందుకు రాగా స్థానికులు అడ్డుకున్నారు. ముందు ఆర్బీకే రంగులు తీసి మాట్లాడాలని ఎదురు ప్రశ్నించడంతో వెనుదిరిగారు.

కోడ్ ఉల్లంఘించి శిలాఫలకం ఆవిష్కరణ

- వైసీపీ ఇన్‌చార్జి హనిమిరెడ్డి సమక్షంలో ప్రజాప్రతినిధులు, నేతల అత్యుత్సాహం



గోపాలపురంలో ఆవిష్కరించిన శిలాఫలకం


అద్దంకి, మార్చి 19 : వైసీపీ నేతలు యథేచ్ఛగా ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తున్నారు. మండలంలోని గోపాలపురంలో మంగళవారం రాత్రి అభివృద్ధి పనులకు సంబంధించిన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నా పట్టించుకోకుండా ఈ నెల 7వ తేదీ పేరుతో శిలాఫలకాన్ని ఏర్పాటు చేసి మంగళవారం రాత్రి వైసీపీ అద్దంకి నియోజకవర్గ ఇన్‌చార్జి పాణెం చిన హనిమిరెడ్డి సమక్షంలో ప్రజా ప్రతినిధులు, వైసీపీ నాయకులు అత్యుత్సాహం ప్రదర్శించి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. పల్లెపల్లెకు కార్యక్రమంలో భాగంగా హనిమిరెడ్డి గోపాలపురంలో పర్యటించారు. అదే సమయం లో శిలాఫలకాన్ని స్థానిక నేతలు ఆవిష్కరించారు. హనిమిరెడ్డి మాత్రం శిలాఫలకం ఆవిష్కరణ దూరంగా ఉన్నట్లు తెలుస్తుంది. పాత తేదీతో ఉన్న శిలాఫలకాన్ని ఆవిష్కరించడం చర్చనీయాంశంగా మా రింది. అధికారులు పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తుంది.

రూ.లక్ష ఆర్థిక సాయం

చీరాల, మార్చి 19 : వాసవీ క్లబ్ సీనియర్ సిటిజన్స్ విభాగం సభ్యుడు ఎం.వెంకటసుబ్బారావు మృతి చెందిగా ఆయన కుటుంబ సభ్యులు శారద నాగలక్ష్మికి క్లబ్ ప్రతినిధులు మంగళవారం రూ. 1లక్ష చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా క్లబ్ ప్రతినిధులు మాట్లాడుతూ తాము అందిస్తున్న చేయూత వివరాలను వెల్లడించారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు.

విచక్షణారహితంగా చెట్ల నరికివేత

చినగంజాం, మార్చి 19 : మండలంలోని చినగంజాం, కడవకుదుకు ఆర్ అండ్‌బీ రహదారి పక్కన ఉన్న చెట్లను విచక్షణారహితంగా నరికి వేయడం అందరినీ ఆశ్చర్యానికి గురి చేసింది. వంద ఏళ్ల నాడు వేసిన మొక్కలు పెరిగి పెద్దవై ఇటుగా వెళ్లే పాదచారులకు, వాహనదారులకు నీడనిస్తున్నాయి. చినగంజాం విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి కడవకుదురు, చింతగుంపల్లి, గొనసపూడి గ్రామాల వారికి 24 గంటలు త్రీ ఫేస్ విద్యుత్ కోసం నూతనంగా విద్యుత్ లైన్‌ను వేస్తున్నారు. ఆ విద్యుత్ లైన్‌కు అడ్డుగా ఉన్నాయిన్న నెపంతో రహదారి పక్కనే ఉన్న చింత, నిద్రగన్నేరు చెట్లను నరికి వేశారు. ఎప్పటి నుండో ఉన్న చెట్లను నరకి వేమడం ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. చెట్లు నరకకుండా విద్యుత్ లైను వేసే మార్గం ఉన్నా చేయలేదని అంటున్నారు. నీరు, చెట్టు చట్టం ప్రకారం చెట్లను నరికివేయాలంటే సంబంధిత అధికారుల అనుమతి అవసరం. కానీ అవేమీ పట్టించుకోకుండా చెట్లను నరికి వేయడంపై ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



భారీ చింత చెట్టును నరికివేసిన సిబ్బంది



విజేత జట్టుతో సెయింట్ ఆన్స్ ప్రతినిధులు

వాలీబాల్ జట్టు సభ్యులకు అభినందనలు

చీరాల, మార్చి 19 : ఇటీవల గుంటూరులోని చలపతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇజనీరింగ్ అండ్ టెక్నాలజీ వారు నిర్వహించిన నోవమ్-2024 సందర్భంగా జాతీయ స్థాయిలో జరిగిన వాలీబాల్ పోటీలలో సెయింట్ ఆన్స్ కళాశాలకు చెందిన జట్టు విజేలుగా నిలిచారని కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు తెలిపారు. మంగళవారం కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో జట్టు సభ్యులను వారు అభినందించారు. కార్యక్రమంలో కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ జగదీష్ బాబు, అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్ ఆర్.వి రమణమూర్తి, వివిధ విభాగాధిపతులు, అధ్యాకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉద్దేశపూర్వకమైన వివాదాలతో అశాంతి : ఆర్డీవో

చీరాలటౌన్, మార్చి 19 : పట్టణంలో ఉద్దేశపూర్వకమైన వివాదాలతో అశాంతి వాతావరణం నెలకొల్పవద్దని చీరాల ఆర్డీవో జీ సూర్యనారాయణరెడ్డి అన్నారు. ఇటీవల కాలంలో హిజ్రాలకు చెందిన రెండు వర్గాల మధ్య చోటుచేసుకున్న వివాదాలు తారస్థాయికి చేరి వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో రెండు వర్గాలపై కేసులు నమోదయ్యాయి. ఈక్రమంలో విసిగిపోయిన పోలీసులు హిజ్రాలకు సంబంధించిన కేసును ఆర్డీవో కోర్టుకు పంపారు. దీంతో ఓ వర్గంతో మంగళవారం ఆర్డీవో సూర్యనారాయణరెడ్డి మాట్లాడారు. సమస్యను అడిగి తెలుసుకున్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా వ్యవహరించరాదని హెచ్చరించారు. అందరూ సహనంతో సమస్యలకు దూరంగా ఉండాలన్నారు. రెండో వర్గంతో కూడా వెంటనే మాట్లాడనున్నట్లు వివరించారు. పునరావృతమైతే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో వన్‌టౌన్ పోలీస్ సిబ్బంది, కార్యాలయ సిబ్బంది, హిజ్రాలు పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలు పాటించకుంటే చర్యలు

గ్రామాల్లో ఎంపీడీవో పర్యటన

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

బల్లికురవ. మార్చి 19 : ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నిబంధనలను పక్కాగా అమలు చేయకపోతే చర్యలు తప్పవని ఎంపీడీవో హనుమారెడ్డి హెచ్చరించారు. మంగళవారం ఆంధ్రజ్యోతిలో ఎన్నికల నియామవళికి తిలోధకాలు అనే వార్తపై ఆయన స్పందించారు. మండలంలోని కొణిదెన, గుంటుపల్లి, అంబడిపూడి, కొమ్మినేనివారిపాలెం, వైదన, కొప్పెరపాడు, ఎస్ఎల్ గుడిపాడు, ముక్తేశ్వరం, చెన్నుపల్లి గ్రామాలలో మంగళవారం ఎంపీడీవో పర్యటించారు. గ్రామాలలో ప్రభుత్వ స్థలాల్లో ఉన్న రాజకీయ పార్టీల పోస్టర్లను, జెండాలను, ఫ్లెక్సీలను దగ్గరుండి తొలగింపచేశారు. కొణిదెనలో ఉన్న విశ్రాంతి బల్లలకు పేర్లు కనిపించకుండా రంగు వేయించాలని సూచించారు. అనంతరం పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో అయన మాట్లాడుతూ ఎన్నికలు ముగిసే వరకు గ్రామాలలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. గ్రామాలలో ఎన్నికల కోడ్ అమలులో ఉందన్నారు. కొత్తగా ఎక్కడైనా పనులు ప్రారంభించినా, ప్రభుత్వ పథకాలపై ప్రచారం చేసినా ఉద్యోగులపై చర్యలు తప్పవన్నారు. అలానే రాజకీయ పార్టీల నేతలకు ఎన్నికల నియామవళిపై అవగాహన కల్పించారు. సొంత ఇళ్లపై పార్టీ జెండాలను ఏర్పాటు చేయకూడదని ఎవరైన పెడితే అభ్యర్థి ఖర్చు కింద పడుతుందన్నారు. ఉద్యోగులు కూడా రాజకీయ పార్టీల సమావేశాలలో పాల్గొనవద్దన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే ఈసీకి ఫిర్యాదు చేస్తామని ఎంపీడీవో తెలిపారు. అయనవెంట కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ సీహెచ్ కోటేశ్వరరావు, వీఆర్వో నాగేశ్వరరావు ఉన్నారు.

తప్పిన పెను ప్రమాదం



తెగిపోయిన క్రేన్

బల్లికురవ. మార్చి 19 : మండలంలోని వేమవరం గ్రామం వద్ద ఉన్న ఓ గ్రానైట్ ఫ్యాక్టరీలో సోమవారం రాత్రి ముడిరాయిని కట్ చేసేందుకు పైకి లేపుతుండగా క్రేన్ ఒక్కసారిగా కుప్ప కూలింది. ఈ ఘటనలో ఎవరికీ ఏమీ కాకపోవడంతో పనులు చేస్తున్న కార్మికులు ఊపిరి పీల్చుకొన్నారు. క్వారీల నుంచి తీసుకు వచ్చిన రాయిని పైకి ఎత్తుగా లేపటం వలనే ప్రమాదం జరిగి ఉంటుందని స్థానికులు అంటున్నారు. ఫ్యాక్టరీలో క్రేన్ పడి పోవడంతో అలా ఎందుకు జరిగి ఉంటుందని పలువురు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు.

మార్టూరులో దేవాలయాల బజారు

- 22న కన్యకాపరమేశ్వరి ఆలయ ప్రతిష్ఠ
- ఆ వీధిలో ఆధ్యాత్మిక శోభ



22న ప్రతిష్ఠకు సిద్ధంగా వాసవీమాత ఆలయం

మార్టూరు, మార్చి 19 : ఒకే వీధిలో ఏడు గురు దేవతామూర్తులు లకు చెందిన దేవాలయాలు మార్టూరులో భక్తులకు దర్శనమీయనున్నాయి. మార్టూరులో బొడ్డురాయి సెంటర్‌కు దక్షిణాన ఉన్న బజారు దేవాలయాల బజారుగా చరిత్రలో నిలిచిపోనున్నది. రోజూ భక్తి పారవశ్యంతో ఈ వీధిలోని దేవాలయాలకు భక్తులు స్వామి వారి దర్శనానికి వస్తుంటారు. ఈ నెల 22వతేదీ శుక్రవారం సురు రూ.2కోట్లతో నూతనంగా నిర్మించిన శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి అ మ్మవారి దేవాలయ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని భక్తి పారవశ్యంతో నిర్వహించడానికి కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు. అందుకు సం బంధించి బుధవారం నుంచి ఈ దేవాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను, యజ్ఞాలు, హోమాలను నిర్వహించనున్నారు. గురు, శుక్రవారాలు అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ వైభవంగా జరుగనుంది. ఈ వీధిలో చెన్నకేశవ స్వామితో పాటు ఆలయ ప్రాంగణంలో దక్షిణాన ఉన్న ప్రసన్నాంజనేయ స్వామి దర్శనానికి మంగళ, శనివారాలు పెద్ద సంఖ్యలో భక్తులు వస్తుంటారు. సోమేశ్వర స్వామి ఆలయం ప్రాంగణంలో సాయిబాబా గుడి, ఆలయం పడమర వైపున పోలేరమ్మ గుడి ఉన్నది. ప్రతి గురువారం రాత్రి సాయిబాబాకు ప్రత్యేక పూజలు ఉంటాయి. నూతనంగా వీరబ్రహ్మేంద్ర స్వామి గుడి నిర్మాణం జరుగుతున్నది. 25వేలకు పైగా జనాభా ఉన్న మేజర్ పంచాయతీ మార్టూరులో ఆధ్యాత్మిక శోభ సంతరించుకోనుంది. నిత్యం దైవనామస్మరణతో బజారు వీధి మారుమోగనుంది.



మార్టూరులోని దేవాలయాల బజార్



గ్రామాల్లో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

గ్రామాల్లో పోలీసుల కవాతు

అద్దంకి, మార్చి19 : ప్రశాంతంగా సార్వత్రిక ఎన్నికలు నిర్వహణ కోసం మంగళవారం మండలంలోని పలు గ్రామాలలో పోలీసులు, బీఎస్ఎఫ్ సిబ్బంది కవాతు నిర్వహించారు. మండలంలోని ధర్మవరం, శంకవరప్పాడు, కలవకూరు, గుర్రంవారిపాలంలో సీఐ కృష్ణయ్య ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది, బీఎస్ఎఫ్ సిబ్బంది కవాతు నిర్వహించారు.

ఎన్నికలకు సహకరించాలి

బల్లికురవ : రానున్న సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతగా జరిగేలా ప్రజలు సహకరించాలని సంతమాగులూరు సర్కిల్ సీఐ నరసింహారావు కోరారు. మంగళవారం మండలంలోని కొప్పెరపాడు, కూకట్లపల్లి గ్రామాలలో ప్రత్యేక పోలీసులతో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతు ఘర్షణలకు పాల్పడితే జీవితాలు నాశనం అవుతాయని చట్టాలు కఠినంగా ఉన్న విషయం ప్రజలు తెలుసుకోవాలన్నారు. అలానే ఓటు హక్కును ప్రతి ఒక్కరూ వినియెగించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ నాగ శివారెడ్డి ఉన్నారు.

నేడు తిరునాళ్ల ఏర్పాట్లపై సమావేశం

అద్దంకి, మార్చి19: శింగరకొండ లక్ష్మీనర శింహస్వామి, ప్రసన్నాంజనేయస్వామి వార్ల 69 వ వార్షిక తిరుణాళ్ళ ఏర్పాట్లు పై రెండవ విడత కో ఆర్డినేషన్ సమావేశం బుధవారం సాయం త్రం 3 గంటలకు చీరాల ఆర్‌డిఓ సూర్యనారాయణరెడ్డి అధ్యక్షతన జరుగుతుందని ఈఓ సుభ ద్ర ఒక ప్రకటన లో తెలిపారు.



పథకాలపై ప్రచారం నిర్వహిస్తున్న కొండయ్య

చంద్రబాబుతోనే రాష్ట్ర భవిష్యత్

టీడీపీ ఇన్‌చార్జి కొండయ్య

చీరాల, మార్చి 19 : చంద్రబాబుతోనే రాష్ట్ర భవిష్యత్ అని, ఆయన తిరిగి ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్ర ప్రజల సమస్యలన్నింటికీ పరిష్కారం దొరుకుతుందని టీడీపీ నియోజవకర్గ ఇన్‌చార్జి ఎంఎం కొండయ్య అన్నారు. మండల పరిధిలోని దేవాంగపురి గ్రామ పార్టీ అధ్యక్షుడు పృథ్వీ లలితామోహన్, వ్యాపారవేత్త సిద్ధి బుచ్చేశ్వరరావు ఆధ్వర్యంలో మంగళవారం బాబు ష్యూరిటీ- భవిష్యత్‌కు గ్యారంటీ, సూపర్‌సిక్స్ పథకాలు, బీసీ డిక్లరేషన్‌కు సం బంధించి ప్రచార కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ఇన్‌చార్జి కొండయ్య ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఇం టింటికీ తిరుగుతూ టీడీపీ అధికారంలోకి వస్తే ఒనగూరే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నేటి నుంచి పట్టాభిషేక మహోత్సవాలు

చినగంజాం, మార్చి 19 : పెదగంజాం గ్రామంలోని భూ నీళా సమేత భావనారాయణ స్వామి దేవస్థానంలో బుధవారం నుంచి శ్రీ రామకోటి 18వ (అష్టాదశ) వార్షిక పట్టాభిషేక మహోత్సవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ అట్ల రోశిరెడ్డి మంగళవారం ప్రకటనలో తెలిపారు. పట్టాభిషేక మహోత్సవ కార్యక్రమం సందర్భంగా దేవస్థానం ప్రాంగణంలో ఈ నెల 20వ తేదీ నుంచి 30 వరకు దీపారాధన (అఖండం) హరే రామ నామ సంకీర్తన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పెదగంజాం గ్రామ భజన బృందాలు, పరిసర గ్రామ భజన బృందాల సహకారంతో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు గ్రామ భావ దేవ భక్త సమాజం సభ్యులు తెలిపారు.

సముద్ర తాబేళ్ల సంరక్షణ కేంద్రాన్ని సందర్శించిన డీఎఫ్‌వో



సముద్రంలోకి తాబేళ్ల పిల్లలను వదులుతున్న డీఎఫ్‌వో భీమయ్య

చినగంజాం, మార్చి 19 : మోటుపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని కుంకుడుచెట్లపాలెం సముద్ర తీరంలో ట్రీ ఫౌండేషన్ ఐటీసీ, ఆంధ్రప్రదేశ్ అటవీ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సముద్ర తాబేళ్ల సంరక్షణ కేంద్రాన్ని డీఎఫ్‌వో ఎల్.భీమయ్య మంగళవారం సందర్శించారు. ఆయన అటవీ శాఖ అధికారులతో కలిసి 109 తాబేళ్ల పిల్లలను సముద్రంలోనికి సురక్షితంగా వదిలారు. ఈ సందర్భంగా డీఎఫ్‌వో భీమయ్య మాట్లాడుతూ సముద్ర తాబేళ్లు, మడ మొక్కలు మత్స్యకార గ్రామాలకు, మత్స్యకారులకు సంరక్షకుల మిత్రులన్నారు. వాటికి ఏ విధమైనా భంగం కల్పించాలని చూసినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సముద్ర తా బేళ్లు బయటకు వచ్చినప్పుడు ఎవరైనా చూస్తే తాబేళ్ల సంరక్షకులకు తెలియజేయాలని సూ చించారు. సంరక్షణ కేంద్రంలో ఉన్న 1612 పిల్లలను సముద్రంలోనికి సురక్షితంగా వదలి పెట్టాలని అన్నారు. కేంద్రం సంరక్షకులకు ఆయన సలహాలు, సూచనలు అందజేశారు. కార్యక్రమంలో ఫారెస్ట్ సెక్షన్ అధికారి వై.జాన్‌సన్, ఎఫ్‌బీవో శిరీష వన సంరక్షణ సమితి అధ్యక్షులు దైవాల రామకృష్ణారెడ్డి, ట్రీ ఫౌండేషన్ ఉమ్మడిజిల్లాల సమన్వయ కర్త శవ నం చంద్రారెడ్డి, కుంకుడుచెట్లపాలెం, రామచంద్రాపురం సముద్ర తాబేళ్ల సంరక్షకులు కా రాని శ్రీను, వాటుపల్లి సుబ్బారావు, జాలయ్య, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీ పొట్టి శ్రీరాములు
నెల్లూరు
జిల్లా వార్తలు
బుధవారం 20 మార్చి 2024


విద్యుద్దీప వెలుగుల్లో రంగడి ఆలయ గోపురం

ఉత్సవ శోభ

నగరంలోని తల్పగిరి రంగనాథుడి బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. 31వ తేదీ వరకు జరిగే ఈ ఉత్సవాలలో రోజుకో వాహనంపై స్వామివారు దర్శనం ఇవ్వనున్నారు. కాగా, ఉత్సవాలు సందర్భంగా రంగడి ఆలయాన్ని విద్యుద్దీపాలతో శోభాయమానంగా అలంకరించారు.

- నెల్లూరు



రంజాన్ వేళలు

ఇఫ్తార్ (బుధవారం) : 6.23

సహరి (గురువారం) : 4.53

23న నారా భువనేశ్వరి రాక

వెంకటాచలం, మార్చి 19: టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరి ఈ నెల 23వ తేదీన వెంకటాచలం మండలానికి రానున్నారు. చంద్రబాబు అక్రమ అరెస్టుతో మనస్తాపానికి గురై మండలంలోని కురిచెర్లపాడుకి చెందిన సుబ్బానాయుడు, పుంజులూరుపాడుకు చెందిన ఆర్ని నారాయణరెడ్డి గుండెపోటుతో మృతి చెందారు. ఈ క్రమంలో మృతుల కుటుంబాలకు ఇటీవల టీడీపీ తరపున రూ.3 లక్షల చొప్పున చెక్కులను ఆ పార్టీ నేత సోమిరెడ్డి అందజేశారు. ఈ నేపథ్యంలో 'నిజం గెలవాలి' కార్యక్రమంలో భాగంగా శనివారం మధ్యాహ్నం 12.05 గంటలకు కురిచెర్లపాడుకి, 1.05 గంటలకు పుంజులూరుపాడుకు నారా భువనేశ్వరి చేరుకొని ఆ రెండు కుటుంబాలను పరామర్శించనున్నారని ఆ పార్టీ మండలాధ్యక్షుడు గుమ్మడి రాజాయాదవ్ ఒక ప్రకటనలో తెలిపారు.

పోరుకు సన్నద్ధం

సార్వత్రిక సమర భేరి మోగింది. ఎవరు..? ఎక్కడెక్కడ బరిలో నిలిస్తున్నారో తేలిపోయింది. జిల్లాలో ఎనిమిది నియోజకవర్గాలు ఉండగా అధికార వైసీపీ, టీడీపీ-బీజేపీ-జనసేన పార్టీలు ఉమ్మడిగా అభ్యర్థులను ఖరారు చేసి బరిలో నిలిపాయి. వ్యూహ, ప్రతివ్యూహాలతో ఓట్ల వేట కోసం అభ్యర్థులు ప్రచారంలో నిమగ్నమయ్యారు. నియోజకవర్గల్లో గత చరిత్రను అంచనావేస్తూ అభ్యర్థులతోపాటు ప్రధాన పార్టీల నాయకులు ముందుకు కదులుతున్నారు. పోలింగ్‌కు ఇంకా 54 రోజులు ఉన్నా విజయం కోసం ఉదయం, సాయంత్రం భేటీలు, సమావేశాలు, పగలు ప్రచారాలతో బిజీబిజీగా గడుపుతున్నారు.

- ఆంధ్రజ్యోతి బృందం



ముమ్మరంగా అభ్యర్థుల ప్రచారం

గెలుపుపై ఎవరి అంచనాలు వారివే!

వ్యూహ, ప్రతివ్యూహాలతో ప్రజల ముందుకు..

'గిరి'ని సొంతం చేసుకునేదెవరు?



జిల్లాలో రాజకీయంగా ప్రత్యేక స్థానాన్ని ఏర్పర్చుకున్న ఉదయగిరి నియోజకవర్గంలో అనేక విశేషాలు ఉన్నాయి. కాంగ్రెస్ అభ్యర్థులు ఏడుసార్లు, టీడీపీ మూడుసార్లు, వైసీపీ రెండుసార్లు, జనతా పార్టీ, బీజేపీ, కిసాన్ మజ్దూర్ ప్రజా పార్టీ ఒక్కోసారి, స్వతంత్ర అభ్యర్థి ఒకసారి గెలుపొందారు. 1952లో కిసాన్ మజ్దూర్ పార్టీ అభ్యర్థి కోవి రామయ్యచౌదరి, 1955, కాంగ్రెస్ అభ్యర్థి షేక్ మౌలాసాహెబ్, 1962లో పులి వెంకటరెడ్డి కాంగ్రెస్ తరఫున, 1967లో స్వతంత్ర అభ్యర్థి ధనెంకుల నరసింహం, 1972లో కాంగ్రెస్ అభ్యర్థి పొన్నెబోయిన చెంచురామయ్య, 1978, 1983లలో బీజేపీ అభ్యర్థి ముప్పవరపు వెంకయ్యనాయుడు గెలిచారు. 1985లో కాంగ్రెస్ తరఫున మేకపాటి రాజమోహన్‌రెడ్డి, 1989లో కాంగ్రెస్ అభ్యర్థి మాదాల జానకిరామ్, 1994లో స్వతంత్ర అభ్యర్థిగా 1999లో టీడీపీ అభ్యర్థిగా కంభం విజయరామిరెడ్డి గెలుపొందారు. 2004, 2009లలో కాంగ్రెస్ అభ్యర్థిగా, 2012 (ఉప ఎన్నిక), 2019లో వైసీపీ తరఫున మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి గెలుపొందారు. 2014లో టీడీపీ అభ్యర్థి బొల్లినేని వెంకటరామారావు విజయం సాధించారు. ప్రస్తుత ఎన్నికల్లో టీడీపీ తరఫున కాకర్ల సురేష్, వైసీపీ నుంచి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి బరిలో నిలుస్తున్నారు. రాజకీయ సంగ్రామంలో వీరిద్దరూ తొలిసారిగా బరిలో నిలుస్తుండటం గమనార్హం.

- ఉదయగిరి

ప్రతిష్టాత్మకం.. నెల్లూరు రూరల్

నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా 2009లో నెల్లూరు రూరల్ నియోజకవర్గం ఏర్పడింది. నెల్లూరు, సర్వేపల్లి, రాపూరు నియోజకవర్గాల్లోని ప్రాంతాలను కలుపుకొని ఈ నియోజకవర్గాన్ని ఏర్పాటు చేశారు. నెల్లూరు నగరంతోపాటు రూరల్ మండలంలోని పంచాయతీల్లోనూ ఈ నియోజకవర్గం విస్తరించి ఉంది. ఉద్యోగులు, వ్యాపారులు, కూలీలు, రైతులు ఎక్కువగా ఈ నియోజకవర్గంలో ఉన్నారు. 2009లో తొలిసారి జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున ఆనం వివేకానం దరెడ్డి విజయం సాధించా రు. ఆ తర్వాత 2014, 2019లలో వైసీపీ తరఫున కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి విజయం సాధించారు. జిల్లా నలుమూ లల నుంచి అనేక మంది నెల్లూరుకు వచ్చి రూరల్ నియోజకవర్గ పరిధిలో స్థిరపడ్డారు. దీంతో ఈ నియోజకవర్గంలో రాజకీయ చైతన్యం ఎక్కువగా కనిపిస్తుంటుంది. ప్రస్తుతం రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన శ్రీధర్‌రెడ్డి ఇప్పుడు టీడీపీ తరఫున పోటీ చేస్తుండగా, గతంలో నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి వైసీపీ నుంచి పోటీకి దిగుతున్నారు. ఈ ఇద్దరు ఉద్దండుల మధ్య ఎన్నికల పోరు రసవత్తరంగా మారింది.

- నెల్లూరు (ఆంధ్రజ్యోతి)

కాంగ్రెస్ కంచుకోట ఎవరిదో!

కాంగ్రెస్ పార్టీకి కంచుకోటగా పేరొందిన కందుకూరులో పార్టీలకన్నా వ్యక్తులకు అధిక ప్రాధాన్యం ఇచ్చి గెలిపించిన చరిత్ర ఇక్కడి ఓటర్లది. 1955లో జరిగిన మొట్టమొదటి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా బరిలో నిలిచిన దివి కొండయ్య చౌదరి సీపీఐ అభ్యర్థి రావిపాటి వెంకయ్యపై గెలుపొందారు. 1962, 1967లలోలో కాంగ్రెస్ అభ్యర్థిగా నలమోతు చెంచురామానాయుడు గెలుపొందారు. 1972లో స్వతంత్ర్య అభ్యర్థి మానుగుంట ఆదినారాయణ రెడ్డి విజయం సాధించారు. 1978లో కాంగ్రెస్ అభ్యర్థి దివి కొండయ్య గెలుపొందగా, 1983లో స్వంతంత్ర అభ్యర్థి మానుగుంట ఆదినారాయణరెడ్డి విజేతగా నిలిచారు. 1985లో కాంగ్రెస్ అభ్యర్థి ఆదినారాయణ రెడ్డి, 1989లో ఆదినారాయణరెడ్డి వారసుడు మానుగుంట మహీధరరెడ్డి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసి విజయం సాధించారు. 1994, 1999లలో టీడీపీ అభ్యర్థి దివి శివరాం గెలుపొందారు. 2004, 2009 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి మహీధరరెడ్డి విజేతగా నిలిచారు. 2014లో వైసీపీ అభ్యర్థి పోతుల రామారావు, 2019 ఎన్నికల్లో వైసీపీ తరఫున మానుగుంట మహీధరరెడ్డి విజయం సాధించారు. ఇలా ఈ నియోజకవర్గంలో టీడీపీ అభ్యర్థులు రెండు సార్లు, స్వతంత్రులు రెండుసార్లు, వైసీపీ అభ్యర్థులు రెండుసార్లు గెలుపొందారు. అయితే, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు మాత్రం ఎనిమిదిసార్లు విజయం సాధించారు. ప్రస్తుత ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థిగా కనిగిరి ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్, టీడీపీ అభ్యర్థిగా ఇంటూరి నాగేశ్వరరావు బరిలో ఉన్నారు. ఏడు దశాబ్దాల రాజకీయ చరిత్రకు ఫుల్‌స్టాప్ పడిందా అన్నట్లుగా మొట్టమొదటిసారిగా కొత్త అభ్యర్థులను ఇరుపార్టీలు బరిలో దించి ఎన్నికలకు వెళ్తున్నందున కందుకూరు చరిత్రలో ఈ ఎన్నికలకు ఓ ప్రాధాన్యత సంతరించుకుంది.

- కందుకూరు

నగరంలో విద్యావంతులు ఎటువైపు?

ఇప్పుడు నెల్లూరు సిటీగా ఉన్న అసెంబ్లీ నియోజకర్గం 2009కు ముందు నెల్లూరు అసెంబ్లీ నియోజకవర్గంగా ఉండేది. నెల్లూరు రూరల్ నియోజకవర్గం ఏర్పడ్డాక నెల్లూరును నెల్లూరు సిటీ అసెంబ్లీ సీటుగా పరిగణిస్తున్నారు. ఈ నియోజకవర్గం 1952లో ప్రారంభమైంది. 1952 నుంచి 1983 వరకు నెల్లూరులో కాంగ్రెస్ హవా కొనసాగింది. అప్పట్లో కాంగ్రెస్‌కు పోటీగా గట్టి రాజకీయ పార్టీలు లేకపోవడంతో స్వతంత్ర అభ్యర్థులే పోటీ ఇచ్చేవారు. ఆ సమయంలో ఆనం చెంచు సుబ్బారెడ్డి, ఆనం వెంకటరెడ్డి వంటి ఉద్దండులు ఎమ్మెల్యేగా గెలుపొందారు. 1983లో టీడీపీ ఆవిర్భవం నుంచి నెల్లూరులో రాజకీయ ముఖ చిత్రం మారిపోయింది. 1983లో టీడీపీ తరఫున ఆనం రామనారాయణరెడ్డి గెలుపొందారు. 1985లో కాంగ్రెస్ పార్టీ, 1989లో స్వతంత్ర అభ్యర్థి జక్కా కోదండరామి రెడ్డి విజయం సాధించారు. 1994లో తాళ్లపాక రమేష్‌రెడ్డి టీడీపీ తరఫున గెలుపొంది ఎన్టీఆర్ మంత్రివర్గంలో పనిచేశారు. 1999, 2004లలో కాంగ్రెస్ అభ్యర్థి ఆనం వివేకానందరెడ్డి గెలుపొందారు. 2009లో నియోజకవర్గాల పునర్విభజనలో నెల్లూరు సిటీగా రూపాంతరం చెందిన నియోజకవర్గంలో ప్రజారాజ్యం పార్టీ నుంచి ముంగమూరు శ్రీధర్‌కృష్ణారెడ్డి గెలుపొందారు. 2014, 2019లలో వైసీపీ నుంచి పోలుబోయిన అనీల్‌కుమార్ యాదవ్ గెలుపొందారు. ఆయన జగన్మోహన్‌రెడ్డి మంత్రివర్గంలో పనిచేశారు. ఇలా 1983 తర్వాత రెండు సార్లు టీడీపీ, మూడు సార్లు కాంగ్రెస్, రెండు సార్లు వైసీపీ, ఒకసారి పీఆర్పీలు విజయం సాధించాయి. విద్యావంతులు ఎక్కువగా ఉన్న నియోజకవర్గం కావడంతో ఏ పార్టీకి కూడా నెల్లూరు సిటీ కంచుకోటగా మారలేదు. ప్రస్తుతం టీడీపీ నుంచి పొంగూరు నారాయణ, వైసీపీ నుంచి ఎండీ ఖలీల్ అహ్మద్‌లు పోటీ పడుతున్నారు.

- నెల్లూరు (ఆంధ్రజ్యోతి)

ఆత్మకూరులో నువ్వా.. నేనా!?

ఉద్దండ రాజకీయ నేతల నియోజకవర్గం ఆత్మకూరులో ఇప్పటివరకు 17 సార్లు ఎన్నికలు జరిగాయి. కాంగ్రెస్ పార్టీ 9 సార్లు, వైసీపీ 3 సార్లు, టీడీపీ 2 సార్లు, స్వతంత్రులు 2 సార్లు, ఎస్‌డబ్ల్యుఏ అభ్యర్థి ఒక్కసారి విజ యం సాధించారు. 1952లో జరిగిన తొలి ఎన్నికల్లో జి.సి.కొండయ్య స్వతంత్ర అభ్యర్థిగా గెలుపొందారు. 1957లో జి.సి.కొండయ్యపై గెలుపొందిన బెజవాడ గోపాలరెడ్డి రాష్ట్ర ముఖ్యమంత్రిగా కూడా పని చేశారు. బెజవాడ గోపాలరెడ్డి లోక్‌సభకు వెళ్లడంతో 1959లో జరిగిన ఉప ఎన్నికల్లో ఆనం సంజీవరెడ్డి గెలుపొందారు. 1962లో ఆనం సంజీవరెడ్డి, 1967లో రామచంద్రారెడ్డి విజయం సాధించారు. 1972లో జనతా పార్టీ నుంచి కంచర్ల శ్రీహరినాయుడు, 1978లో కాంగ్రెస్ నుంచి డాక్టర్ బొమ్మిరెడ్డి సుందరరామిరెడ్డి, 1983లో టీడీపీ అభ్యర్థి ఆనం వెంకటరెడ్డి, 1985, 1989లలో కాంగ్రెస్ అభ్యర్థిగా సుందరరామిరెడ్డి గెలుపొందారు. 1994లో టీడీపీ నుంచి కొమ్మి లక్ష్మయ్య నాయుడు, 1999లో కాంగ్రెస్ అభ్యర్థి బొల్లినేని క్రిష్టయ్య విజయం సాధించారు. 2004లో టీడీపీ అభ్యర్థి కొమ్మి లక్ష్మయ్యనాయుడు, 2009లో కాంగ్రెస్ అభ్యర్థి ఆనం రామనారాయణరెడ్డి, 2014, 2019లో వైసీపీ అభ్యర్థి మేకపాటి గౌతమ్‌రెడ్డి విజయం సాధించారు. గౌతమ్‌రెడ్డి మరణం తరువాత జరిగిన ఉప ఎన్నికల్లో (2022) ఆయన సోదరుడు మేకపాటి విక్రమరెడ్డి విజయం సాధించారు. ప్రస్తుత ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థిగా మేకపాటి విక్రమ్‌రెడ్డి, టీడీపీ అభ్యర్థి ఆనం రామనారాయణరెడ్డి తలపడుతున్నారు. ఆది నుంచి కొత్తకు ప్రాధాన్యమిస్తూ కొన్ని సమయాల్లో వర్గ రాజకీయందే పైచేయిగా ఉంటున్న ఆత్మకూరు లో ఈదఫా అర్థ, అంగబలం కలిగిన సమ ఉజ్జీలు రంగంలోకి దిగి విజయం సాధించేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు.

కనకపట్నంలో పైచేయి ఎవరిదో!



కనకపట్నంగా పేరొందిన కావలిలో ఈసారి పైచేయి ఎవరు సాధిస్తారోనని అన్ని వర్గాల్లో ఉత్కంఠ నెలకొంది. 1952లో ఏర్పడిన ఈ నియోజకవర్గానికి 15 సార్లు ఎన్నికలు జరగ్గా 6 పర్యాయాలు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులే విజయం సాధించారు. 1952లో తొలి శాసన సభ్యుడిగా ప్రజాపార్టీకి చెందిన బత్తిన రామకృష్ణారెడ్డి ఎన్నికయ్యారు. అప్పటి నుంచి టీడీపీ ఆవిర్భావం వరకు 6 సార్లు ఎన్నికలు జరగ్గా రెండుసార్లు ప్రజాపార్టీ, మరో రెండుసార్లు కాంగ్రెస్, రెండు పర్యాయాలు స్వతంత్రులు విజయం సాధించారు. టీడీపీ ఆవిర్భావం 4 సార్లు కాంగ్రెస్, 3 సార్లు టీడీపీ, రెండుసార్లు వైసీపీ అభ్యర్థులు విజయం సాధించారు. కాంగ్రెస్ నుంచి కలికి యానాదిరెడ్డి 1985 నుంచి 1994 వరకు వరుసగా గెలిచి ఆయన మంత్రిగా కూడా పనిచేశారు. 2009లో జరిగిన నియోజకవర్గం పునర్విభజనలో కావలిలో ఉన్న జలదంకి, కలిగిరి, కొండాపురం మండలాలు ఉదయగిరి నియోజకవర్గంలోకి వెళ్లాయి, అల్లూరు నియోజక వర్గంలో ఉన్న అల్లూరు, బోగోలు, దగదర్తి మండలాలు కావలిలో చేరాయి. పునర్విభజన అనంతరం 2009లో టీడీపీ అభ్యర్థిగా బీద మస్తాన్‌రావు, 2014, 2019లలో వైసీపీ అభ్యర్థిగా రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి విజయం సాధించారు. ప్రస్తుత ఎన్నికలలో హ్యాట్రిక్ విజయం కోసం వైసీపీ తరఫున రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి బరిలో నిలిచారు. ఇక టీడీపీ అభ్యర్థిగా దగుబాటి వెంకట (కావ్య) క్రిష్ణారెడ్డి పోటీ చేస్తున్నారు. వీరిద్దరి మధ్య పోటీ రసవత్తరంగా మారుతోంది.

- కావలి

అందరి దృష్టి కోవూరు పైనే

మద్యపాన నిషేధం, పొదుపు ఉద్యమాలు పురుడు పోసుకున్న కోవూరు నియోజకవర్గంలో ఈసారి గట్టి పోటీ నెలకొంది. ఐదు మండలాలు ఉన్న ఈ నియోజకవర్గంలో 2,61,182 మంది ఓటర్లు ఉన్నారు. కాంగ్రెస్ 7 సార్లు, టీడీపీ 5సార్లు, వైసీపీ 2 సార్లు, సీపీఐ ఒకసారి గెలుపొందింది. 1952లో తొలిసారిగా సీపీఐ అభ్యర్థి బసవారెడ్డి శంకరయ్య గెలుపొందారు. 1962 నుంచి 1989 వరకు కాంగ్రెస్ అభ్యర్థులు రేబాల దశరథరామిరెడ్డి, వి.వెంకురెడ్డి, పి. రామచంద్రారెడ్డి, పెళ్లకూరు రామచంద్రారెడ్డి, నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి గెలుపొందారు. ఆ తరువాత రాజకీయ పరిణామాల నేపథ్యంలో నల్లపరెడ్డి శ్రీనివాసులరెడ్డి టీడీపీలో చేరి గెలుపొందారు. 1994, 1999లలో నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి టీడీపీ అభ్యర్థిగా గెలుపొందారు. 2004లో కాంగ్రెస్ అభ్యర్థి పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి గెలుపొందారు. 2009లో టీడీపీ అభ్యర్థి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి విజయం సాధించారు. 2012లో జరిగిన ఉప ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థిగా నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి గెలుపొందారు. 2014లో టీడీపీ అభ్యర్థి పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, 2019లో వైసీపీ అభ్యర్థి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి విజయం సాధించారు. నియోజవర్గంలో కాంగ్రెస్ పార్టీ పూర్తిగా కనుమరుగైన నేపథ్యంలో టీడీపీ, వైసీపీల మధ్యే ప్రధాన పోటీ నెలకొంది. ప్రస్తుత ఎన్నికల్లో టీడీపీ నుంచి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, వైసీపీ నుంచి సిటింగ్ ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి బరిలో నిలిచారు. వీరిద్దరి మధ్య గట్టిపోటీ ఉండటంతో అందరి దృష్టి కోవూరుపైనే నిలిచింది.

- విడవలూరు

సర్వేపల్లి తీర్పు ఎటు?

రాష్ట్రంలో అధికా రం ఏ పార్టీ చేజిక్కించుకుంటుందో ఆ పార్టీ అభ్యర్థులకే పట్టం గట్టడం సర్వే పల్లి నియోజకవర్గ ప్రజల విజ్ఞతకు నిదర్శనం. 1955లో తొలి ఎమ్మెల్యేగా కాంగ్రెస్‌కు చెందిన బెజవాడ గోపాల్ రెడ్డి ఎన్నికయ్యారు. 1956లో కాంగ్రెస్ అభ్యర్థి వంగల్లు కోదండరామిరెడ్డి, 1962లో స్వతంత్ర అభ్యర్థి వేమారెడ్డి వెంకు రెడ్డి, 1967లో సీపీఐ అభ్యర్థి స్వర్ణా వేమయ్య, 1972లో కాంగ్రెస్‌కు చెందిన మంగళగిరి నానాదాస్ ఎస్సీ కేటగిరీలో గెలు పొందారు. జనరల్ స్థానంగా ఆరంభమయ్యాక 1978, 1989 లో కాంగ్రెస్ అభ్యర్థి సీవీ శేషారెడ్డి, 1983లో టీడీపీ అభ్యర్థి పెంచలరెడ్డి చెన్నారెడ్డి, 1985లో ఈదూరు రామకృష్ణారెడ్డి, 1994, 1999లో టీడీపీ అభ్యర్థి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి విజయం సాధించారు. 2004, 2009లలో కాంగ్రెస్ అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి, 2014, 2019లలో వైసీపీ అభ్యర్థి కాకాణి గోవర్ధన్‌రెడ్డి సర్వేపల్లి ఎమ్మెల్యేగా గెలుపొందారు. ప్రస్తుతం వైసీపీ అభ్యర్థిగా కాకాణి గోవర్ధన్‌రెడ్డి, టీడీపీ తరఫున సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ప్రచారం చేస్తున్న ఆ పార్టీ అధిష్టానం అభ్యర్థి పేరును ప్రకటించాల్సి ఉంది.

- ముత్తుకూరు

ప్రసన్నుడి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

బిట్రగుంట: బోగోలు మండలం కొండబిట్రగుంట బిలకూట క్షేత్రంలో ప్రసన్న వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు మంగళవారం రాత్రి అంకురార్పణ జరిగింది. అంతకు ముందు శ్రీవారి చిత్రపటంతో వైభవంగా గిరిప్రదక్షిణ నిర్వహించి ఉత్సవాలను ప్రారంభించారు. ఉదయం సుప్రభాత, తోమాలసేవ, మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు, మంగళ హారతులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ తూర్పు అలంకార మండపంలో స్వామి వారి చిత్రపటానికి ప్రత్యేక పూజల అనంతరం ఉత్తర ముఖద్వారం ద్వారా గోవిందనామస్మరణలతో గిరిప్రదక్షిణకు బయలుదేరారు. గోమాతలు, మేళతాలు, మంగళ వాయిద్యాల నడుమ, కోలాటం, నృత్యాలు, కావలికి చెందిన చిన్నారుల స్వామి, అమ్మవార్ల వేషధారణ ఎంతగానో ఆకట్టుకున్నాయి. దేవాదాయశాఖ సహాయక కమిషనర్ డబ్బుగుంట వెంకటేశ్వర్లు, చెన్నమ్మ దంపతులు కుటుంబ సభ్యులతో కలసి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. ఆలయ ఈవో రాధాకృష్ణ, పాలక మండలి చైర్మన్ శ్రీరామ్ మాల్యాద్రి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాల్లో కావలి ఆర్డీవో శీనానాయక్, తహసీల్దారు వెంకటరత్నం, ఉభయకర్తలు పాల్గొన్నారు.


శ్రీవారి చిత్రపటంతో గిరిప్రదక్షిణ చేస్తున్న భక్తులు

నేడు ధ్వజారోహణం

శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం తిరుమంజనం, సాయంత్రం ధ్వజారోహణం, కొడిముద్దల పంపిణీ, రాత్రి శేషవాహన సేవ, మహావిష్ణు అవతారంలో స్వామి వారి ఊరేగింపు కార్యక్రమాలు జరగనున్నాయి. సంతానం లేని దంపతులు సంతాన గోపాలకృష్ణుడిని వేడుకొని ఉపవాస దీక్షతో ప్రసన్నుడి ప్రసాదమైన కొడిముద్దను స్వీకరించితే సంతాన భాగ్యం కలుగుతుందని భక్తుల విశ్వాసం.

రూ.లక్ష దాటితే నివేదిక ఇవ్వాలి : కలెక్టర్

నెల్లూరు(హరనాథపురం), మార్చి 19 : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో రూ.లక్ష, ఆపైన నగదు లావాదేవీలపై బ్యాంకు అధికారులు నివేదిక ఇవ్వాలని కలెక్టర్ హరినారాయణన్ సూచించారు. మంగళవారం కలెక్టరేట్ తిక్కన భవన్‌లో బ్యాంకు అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో రాజకీయపార్టీల అభ్యర్థులు నామినేషన్లు వేసిన నాటి నుంచి తరచుగా వారి ఖాతాలను పరిశీలించాలన్నారు. ఎన్నికల్లో పోటీ చేసే రాజకీయ పార్టీల అభ్యర్థులకు కొత్త బ్యాంకు ఖాతాలను ప్రారంభించాలన్నారు. అలాగే రూ.10లక్షలకుపైగా బ్యాంకుల్లో జరిగిన లావాదేవీలపై జిల్లా ఎన్నికల అధికారికి నివేదికలు ఇవ్వాలన్నారు. బ్యాంకుల నుంచి ఏటీఎంలకు రవాణా చేసే నగదు వాహనాలకు క్యూఆర్ కోడ్ ఇవ్వాలని సూచించారు. అనుమానాస్పద లావాదేవీలపై బ్యాంకు అధికారులు ప్రతిరోజూ నివేదిక సమర్పించాలన్నారు. ఈ సమావేశంలో ఎల్‌డీఎం శ్రీకాంత్ ప్రదీప్‌కుమార్, ఎన్నికల ఖర్చు మానిటరింగ్ నోడల్ అధికారి విద్యాసాగర్, బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

● ప్రచారంలో పాల్గొంటే చర్యలు

రాజకీయ పార్టీల తరఫున ఎన్నికల ప్రచారంలో పాల్గొనే వలంటీర్లు, ప్రభుత్వంలో పనిచేసే వారిపై ఎన్నికల నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. అలా ఎన్నికల ప్రచారంలో పాల్గొనే వారిపై అవసరమైతే కేసులు నమోదు చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇచ్చారు.

టీడీపీ జాతీయ అధికార ప్రతినిధిగా దినేష్



నెల్లూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ జాతీయ అధికార ప్రతినిధిగా పోలంరెడ్డి దినేష్‌రెడ్డిని నియమిస్తూ ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కింజారపు అచ్చెన్నాయుడు మంగళవారం ఉత్తర్వులు ఇచ్చారు. పార్టీ అధినేత నారా చంద్ర బాబునాయుడు ఆదేశాల ప్రకారం ఈ నియామకం చేసినట్లు ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

పాలకులకు పట్టని కరువు

- ఎన్నికల వేళ కరువు ప్రాంతంగా ప్రకటన
- కోడ్ రావడంతో ప్రశ్నార్థకంగా పంట నష్ట పరిహారం
- సంతకు పశువుల తరలింపు
- దుత్తలూరు, వరికుంటపాడు మండలాల్లో వలస బాటన ప్రజలు



వరికుంటపాడులో బీడుగా మారిన వ్యవసాయ భూములు

దుత్తలూరు(ఉదయగిరి రూరల్):2023 -24లో రబీసీజన్‌ను కరువు కమ్మేసింది. వరుణుడు కరుణించలేదు. చెరువులకు నీరు చేరలేదు. బోరు బావులు అడుగంటాయి. అన్న దాతలు, కౌలు రై తులు అప్పుల ఊబిలో కూరుకపోయారు. భరోసా ఇవ్వాల్సిన పాలకులు క్షేత్రస్థాయిలో రైతుల కష్టా లు కళ్లారా చూడలేదు. ఎన్నికల సమయంలో రబీ సీజన్‌కు కరువు మండలంగా ప్రకటించారు. మరి పంట పరిహారం ఎవరిస్తారనేది ప్రశ్నార్థకంగా మారింది.

2,165 హెక్టార్లలో పడని విత్తు

మండలంలోని రబీ సీజన్‌లో 2,913 హెక్టార్లలో కేవలం 748 హెక్టార్లలో మాత్రమే రైతులు పంటలు సాగు చేశారు. 830మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా 466.6 మిల్లీమీటర్ల వర్షపాతం మాత్రమే నమోదైంది.

పశుగ్రాసమేది..

వ్యవసాయం తరువాత పాడిపైనే ఆధారపడి రైతులు జీవనం సాగిస్తుంటారు. మండలంలో 9,870 ఆవులు, గేదెలు, 30,081 గొర్రెలు, మేకలున్నాయి. వీటికి పశుగ్రాసం, తాగునీరు కరువై యజమానులు డెల్టా ప్రాంతానికి వలస వెళుతున్నాయి. వలస వెళ్లలేని యజమానులు ఇతర ప్రాంతాల నుంచి ఎకరా రూ.15 నుంచి రూ.20 వేలు ఖర్చు చేసి గడ్డిని తీసుకొచ్చి గేదెలు, ఆవుల ను కాపాడుకొంటున్నారు. డబ్బులేని రైతులు ఉపాధి చూపే పశువులు, ఎద్దులను సంతకు తరలించి అమ్ముకుంటున్నారు.

వరికుంటపాడు: కృష్ణంరాజుపల్లి, నల్లబో తులవారిపల్లి, అలివేలుమంగాపురం, సాతువారిపల్లి, తూర్పుపాళెం, కొండ్రాజుపల్లి, నార్త్‌కొండా యపాళెం, దక్కనూరు నుంచి ప్రజలు బెంగళూరు, హైదరాబాదు, చెన్నై, విజయవాడ, గుంటూరు, వైజాగ్, నెల్లూరు, ఒంగోలు, తెలంగాణ ప్రాంతాలకు కుటుంబ సమేతంగా తరలివెళ్లి వ్యాపారాలు, బేల్దారి, ఇతరత్రా పనులు చేసుకుంటూ కాలం వెళ్లబుచ్చుతున్నారు. ఒకప్పుడు ఇంటిల్లి పాది జన సందడితో కళకళలాడే పల్లెలు ప్రాంతాలు నేడు జనసంచారం లేక మూగబోయాయి. సాగునీటికి నోచుకోని వ్యవసాయ భూములు నేడు కంపచెట్లతో నిండి అడవులను తలపిస్తున్నాయి. నార్త్‌కృష్ణంరాజుపల్లి పంచాయతీలో పరిస్థితి మరింత అధ్వానంగా మారింది. గ్రామంలో 450 కుటుంబాలుండగా 150 కుటుంబాలు గ్రామం వదిలి వలసవెళ్లాయి. 1200ఉండే జనాభా ప్రస్తుతం 500లోపే ఉంటున్నారు. అందులో వృద్ధులు, మహిళలే అధికంగా ఉండడం గమనార్హం. గ్రామానికి కూతవేటు దూరంలో గండిపాళెం జలాశయం ఉన్నా పాలకులు, అధికారుల నిర్లక్ష్యంతో సాగునీరు అందని ద్రాక్షగానే మారింది.

కావలి

కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

సోమశిలలో 11.823 టీఎంసీ నిల్వ

అనంతసాగరం: సోమశిల పూర్తిసామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా మంగళవారం నాటికి ప్రాజెక్టులో 11.823 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. దిగువ డెల్టాకు 1500, ఉత్తర కాలువకు 600, దక్షిణ కాలువకు 350 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నట్లు పేర్కొన్నారు.

పీహెచ్‌సీలో కు.ని.కి మంగళం!

- నాలుగేళ్లుగా జరగని ఆపరేషన్లు
- డాక్టర్లు, సిబ్బంది, వసతులు ఫుల్
- లక్ష్యసాధన నిల్
- పట్టించుకోని ఉన్నతాధికారులు

వలేటివారిపాలెం, మార్చి 19 : వలేటివారిపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కుటుంబ నియంత్రణ ఆపరేషన్లకు మంగళం పాడారు. డాక్టర్లు, సిబ్బంది, వసతులు ఫుల్‌గా ఉన్నా లక్ష్య సాధనకు ఎలాంటి చర్యలు తీసు కుంటున్న దాఖలాలు లేవు. దీంతో గత నాలుగేళ్లుగా ఎలాంటి కుటుంబ ని యంత్రణ ఆపరేషన్లు జరగడంలేదు. అయినా సంబంధిత ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడం శోచనీయం. ఈ క్రమంలో బాలింతలు కుటుంబ నియంత్రణ ఆపరేషన్ల కోసం ప్రైవేట్ ఆసుపత్రులకు పరుగులు తీసి వేల రూపాయలు వెచ్చించాల్సిన పరిస్థితి ఏర్పడింది. స్థానిక పీహెచ్‌సీలో కార్పొరేట్ తరహాలో భవన వసతి ఉంది. కుటుంబ నియంత్రణ ఆపరేషన్లకు అవసరమైన పరికరాలు ఉన్నాయి. ఆపరేషన్ గది ఉంది. అవసరమైన మందులు ఉన్నాయి. ముగ్గురు డాక్టర్లు ఉన్నారు. ముగ్గురు స్టాఫ్ నర్సులు ఉన్నారు. ల్యాబ్‌టెక్నీషియన్, ఫార్మాసిస్ట్‌తో పాటు సరిపడు సిబ్బంది ఉన్నారు. అయినప్పటికీ కుటుంబ నియంత్రణ అపరేషన్లు చేసే వారే లేరు. దేవుడు వరమిచ్చినా పూజారి కరుణించడు అన్న సామెతగా ఉంది ఇక్కడి వైద్యులు, సిబ్బంది పనితీరు. ప్రభుత్వం అన్ని రకాల పరికరాలు, భవన వసతి, డాక్టర్లు, సిబ్బంది, మందులు, పరీక్షలు తదితర సదుపాయాలు కల్పిస్తున్నా వైద్యులు నిర్లక్ష్యంతో కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు ఎందుకు చేయడం లేదో వారికే తెలియాలి. ఒకవేళ ఎవరైనా కుటుంబ నియంత్రణ ఆపరేషన్‌కు స్థానిక పీహెచ్‌సీకి వస్తే ఇక్కడ కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేసే డాక్టర్లు లేరు.. పరికరాలు, మందులు లేవు.. పరీక్షలు చేసేందుకు అవకాశం లేదని, కందుకూరు ఏరియా ఆసుపత్రికి వెళ్లండని ఉచిత సలహాలు ఇస్తున్నారని ప్రజలు వాపోతున్నారు. దీంతో వేలకు వేలు ఖర్చు పెట్టి ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లి కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయించుకుంటున్నారు. అయినప్పటికీ సంబంధిత ఉన్నతాధికారులు పట్టించుకోవడంలేదన్న ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వలేటివారిపాలెం సీహెచ్‌సీలో కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు జరిగేలా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.



వలేటివారిపాలెం ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం

వైద్యసేవలు సద్వినియోగం చేసుకోండి

వరికుంటపాడు, మార్చి 19: ఆరోగ్య సురక్ష పథకం కింద అందిస్తున్న వైద్యసేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో వెంకటకృష్ణకుమారి తెలిపారు. ఈ సందర్భంగా నిపుణులైన వైద్యులతో రోగులకు పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ గవదకట్ల వెంకటలక్ష్మమ్మ, సర్పంచ్ తాతపూడి విజయమ్మ, వైద్యులు ఆయేషా, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

ఉదయగిరి రూరల్, మార్చి 19: ఏపీవీవీపీ విభాగంలో పని చేస్తున్న ఉద్యోగులు మంగళవారం జిల్లా ల్యాబ్ టెక్నీషియన్‌ల సంఘం ఆధ్వర్యంలో నెల్లూరులోని కార్యాలయంలో డీసీహెచ్‌ఎస్ రమేష్‌నాథ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ వైద్యవిధాన పరిషత్‌లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులను సీనియార్టిని బట్టి రెగ్యులర్ చేయడం, కాంట్రాక్టు ఉద్యోగులందరికీ గ్రాస్ పే వర్తింపచేయాలన్న డిమాండ్లతో వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు.

రేపు పరిచయ కార్యక్రమం

ఉదయగిరి రూరల్, మార్చి 19: స్థానిక చెంచురామయ్య అతిథిగృహంలో గురువారం నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీల ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి కాకర్ల సురేష్‌తో పరిచయ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పార్టీ మండల కన్వీనర్ చింతనబోయిన బయ్యన్న మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ ఎమ్మెల్యేలు బొల్లినేని వెంకటరామారావు, మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, కంభం విజయరామిరెడ్డి, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ పొన్నెబోయిన చెంచలబాబుయాదవ్ పాల్గొంటారన్నారు. ఆయా పార్టీ నాయకులు, కార్యక ర్తలు, అభిమానులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

జగన్‌ను ఇంటికి పంపేందుకు జనం సిద్ధం

- టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి

ఉదయగిరి రూరల్, మార్చి 19: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ముఖ్యమంత్రి జగన్‌రెడ్డిని రాష్ట్ర ప్రజలు శాశ్వతంగా ఇంటికి పంపేందుకు సిద్ధంగా ఉన్నారని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పొన్నెబోయిన చెంచలబాబుయాదవ్ జోస్యం చెప్పారు. స్థానిక చెంచురామయ్య అతిథిగృహంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. టీడీపీ, జనసేన, బీజేపీ కలయికను ప్రజలు స్వాగతిస్తున్నారని హర్షం వ్యక్తం చేశారు. ప్రజాగళంసభకు ప్రజల నుంచి ఊహించని స్పందన వచ్చిందన్నారు. ఈ పొత్తు రాష్ట్రాభివృద్ధికి ఎంతో అవసరమన్నారు. జగన్‌రెడ్డితో పొత్తుకు ప్రజలు, రాజకీయ పార్టీలు సిద్ధంగా లేరన్నారు. 2019లో ఒక్క అవకాశమని చెప్పి రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. టీడీపీ అధిష్ఠానం నిర్ణయించిన ఉమ్మడి అభ్యర్థి కాకర్ల సురేష్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. 2024లో చంద్రబాబు ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రానికి మంచి రోజులు వస్తాయన్నారు. కార్యక్రమంలో మండల టీడీపీ కన్వీనర్ బయ్యన్న, నాయకులు మాబాషా, సందానీ, అరుణమ్మ, మేస్త్రీ వెంకటేశ్వర్లు, సురేష్, అంబటి మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న చెంచలబాబు

ఎన్నికల నియమావళి అమలుపై ఆరా

సంగం, మార్చి 19: మండలంలో ఎన్నికల ప్రవర్తన నియమావళి క్షేత్రస్థాయిలో ఎలా అమలవుతుందో అని మంగళవారం జడ్పీ సీఈఓ, ఎన్నికల ప్రవర్తన నియమావళి జిల్లా నోడల్ అధికారి కన్నమనాయుడు పరిశీలించారు. స్థానిక మండల పరిషత్, వెలుగు, ఎంఈవో కార్యాలయాలను తనిఖీ చేశారు. కార్యాలయం లోపల, బయట ఎక్కడైనా రాయకీయ నాయకులు ఫొటోలు, ఫ్లెక్సీలు, వాల్‌పోస్టర్లు ఉన్నాయో అని ఆరా తీశారు. కోడ్ అమలులోకి రావడంతో ఎన్నికల ఆదేశాల మేరకు ఫ్లెక్సీలు కన్పించరాదన్నారు. కార్యక్రమంలో ఆయన వెంట ఎంపీడీవో శేషగిరిరావు, ఎంఈవోలు జానికీరాం, మల్లయ్య ఉన్నారు.



మాట్లాడుతున్న జిల్లా నోడల్ అధికారి కన్నమనాయుడు

పోస్టల్ బ్యాలెట్ వినియోగంపై అవగాహన

ఉదయగిరి రూరల్, మార్చి 19: స్థానిక తహసీల్దారు కార్యాలయంలో ఎన్నికల విధులకు వెళ్లే ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ వినియోగంపై మంగళవారం జిల్లా నోడల్, కోఆర్డినేటింగ్ అధికారులు వెంకట్రావు, శ్రీనివాసులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికలకు నియమించినబడిన ఉద్యోగులకు ఫెసిలిటేషన్ కేంద్రంలో పోస్టల్ బ్యాలెట్ ఇస్తారని, ఎలాంటి తప్పిదాలు లేకుండా బ్యాలెట్ ఫారాలను పూర్తి చేసి తమ ఓటుహక్కు వినియోగించుకొనేలా చూడాలన్నారు. ప్రతి మండలం నుంచి డీటీ, సీనియర్ అసిస్టెంట్, ఆర్ఐలకు అవగాహన కల్పించామని, వారు అందుబాటులో ఉండి గెజిటెడ్ అధికారితో సంతకం చేయించి బాక్సులో వేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్వో రాజారమేష్ ప్రేమ్‌కుమార్, ఏఆర్వో నెహ్రూబాబు పాల్గొన్నారు.

సచివాలయాలకు హైసెక్యూరిటీ పత్రాల పంపిణీ

ఉదయగిరి రూరల్, మార్చి 19: మండలంలోని అన్ని సచివాలయాలకు ప్రజలకు అవసరమైన వివిధరకాల ధ్రువపత్రాల జారీ చేసేందుకు హైక్యూరిటీ పత్రాలను సచివాలయాలకు పంపిణీ చేసినట్లు ఎంపీడీవో ఈశ్వరమ్మ తెలిపారు. ఈ విషయంపై మంగళవారం ఆమె కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. నిన్నమొన్నటి వరకు సచివాలయాల ద్వారా అందించే ధ్రువపత్రాలపై సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రం ఉండేదన్నారు. త్వరలో జరగనున్న ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున ధ్రువపత్రాలపై సీఎం చిత్రం లేకుండా ధ్రువపత్రాలు జారీ చేసేలా ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ప్రభుత్వం అందించిందన్నారు. ఇకపై సచివాలయాల్లో ధ్రువపత్రాలను నూతన హైసెక్యూరిటీ పత్రాలపైనే ఇవ్వాలన్నారు.

వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం.. క్రీడాకారులకు శాపం

ఉదయగిరి రూరల్, మార్చి 19: వైసీపీ ప్రభుత్వం ఆడుదాం..ఆంధ్రా కార్యక్రమాన్ని ఒక ప్రచార వేదికగా వాడుకుంది తప్ప క్రీడలను ప్రోత్సహిం చాలనుకుంటే శాశ్వత క్రీడా వేదికల నిర్మాణాలు చేపట్టలేదు. అందుకు ఉదా హరణే ఈ అసంపూర్తి ఇండోర్ స్టేడియం నిర్మాణం. టీడీపీ ప్రభుత్వ హయాంలో ఉదయగిరిలో రూ.2 కోట వ్యయంతో ఇండోర్ స్టేడియం పనులు ప్రారంభమయ్యాయి. శ్లాబ్ స్థాయికి నిర్మాణం జరిగింది. అనంతరం అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం దాని నిర్మాణాన్ని పూర్తిగా నిలిపివేసింది. ప్రస్తుతం ఆ అసంపూర్తి భవనం అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. మరోవైపు 67-బీజీ జాతీయ రహదారి నిర్మాణంలో ఆ భవనాన్ని పూర్తిగా తొలగించనున్నారు.



అసంపూర్తిగా ఉన్న ఇండోర్ స్టేడియం నిర్మాణం

ఎన్నికల కోడ్‌ను పక్కాగా అమలు చేయాలి

ఉదయగిరి రూరల్, మార్చి 19: మండలంలో ప్రతిఒక్కరూ ఎన్నికల కోడ్ అమలను పక్కాగా అమలు చేయాలని మండల మోడల్ కోడ్ ఆఫ్ కం డక్ట్ నోడల్ అధికారిణి దేవరకొండ ఈశ్వరమ్మ పేర్కొన్నారు. మంగళవారం ఆమె గండిపాళెం, వెంగళరావునగర్ గ్రామాల్లో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలును పరిశీలించారు. ఆయా గ్రామాల్లో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ప్రచార శిలాఫలకాలను గుర్తించి వాటిని పూర్తిగా మూయించేశారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ మల్లికార్జున పాల్గొన్నారు.

పది పరీక్షలకు 27మంది గైర్హాజరు

అనంతసాగరం: రేవూరు, అనంతసాగరం, సోమశిల పరీక్ష కేంద్రాల నుంచి మంగళవారం హిందీ పరీక్షకు 27 మంది హాజరుకాలేదని అనంతసాగరం ఎంఈవో బాలకృష్ణారెడ్డి తెలిపారు. ఇందులో 8మంది రెగ్యులర్, 19మంది సప్లమెంటరీ రాసే విద్యార్థులు ఉన్నట్లు చెప్పారు.

పోలీసుల కవాతు

ఏఎస్ పేట : మండల కేంద్రంతోపాటు అనుమసముద్రం గ్రామాల్లో మంగళవారం ఎస్ఐ ప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీస్‌లు, మిలటరీ సిబ్బంది కవాతు నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికలు జరుగనుండటంతో ముందస్తుగా కవాతు నిర్వహించా మని ఎస్ఐ చెప్పారు. ప్రశాంతంగా ఎన్నికలు జరిగేలా ముందస్తు చర్యలు తీసు కుంటామన్నారు.



యువకుడి అదృశ్యంపై కేసు నమోదు

ఉలవపాడు, మార్చి 19 : ఓ నర్సింగ్ విద్యార్థి అదృశ్యంపై సోమవారం రాత్రి కేసు నమోదు అయ్యింది. ఎస్సై బాజీరెడ్డి, యువకుడి తల్లిదండ్రులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని రామాయపట్నంకు చెందిన యనమల రామకృష్ణ(20) ఒంగోలులోని ఓ ప్రైవేటు నర్సింగ్ కాలేజీలో మేల్ నర్సింగ్ చదువుతూ కాలేజి తరుపున ఎముకులు, కీళ్ల చికిత్సకు చెందిన ఓ ప్రైవేటు ఆసుపత్రిలో అప్రెంటీస్ చేస్తున్నాడు. ఈనెల 8వ తేదీన శివరాత్రికి స్వగ్రామం వచ్చాడు. తిరిగి కాలేజికి వెళుతున్నాని 15వ తేది వెళ్లాడు. అప్పటి నుంచి ఫోన్ స్విచ్ఛాఫ్ అయింది. కాలేజి చేరగానే ప్రతిసారి తల్లిదండ్రులకు ఫోన్ చెసి చెప్పే కొడుకు ఎంతటికి ఫోన్ ఆన్ కాకపోవడంతో రామకృష్ణ తండ్రి మహేశ్వరరావు నేరుగా ఒంగోలులోని నర్సింగ్ కాలేజి, ప్రైవేటు ఆసుపత్రిలో విచారించగా రాలేదని తెలిసింది. బంధుమిత్రులను విచారించి ఎలాంటి ఆచూకి తెలియకపోవడంతో ఉలవపాడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు యువకుడు అదృశ్యంపై ఎస్సై కేసు నమోదు చేశారు.



యనమల రామకృష్ణ

నాగబాబు, నాదెండ్లతో అళహరి భేటీ

కావలిటౌన్, మార్చి 19: జనసేన జాతీయ నాయకులు నాగబాబు, నాదెండ్ల మనోహర్‌లతో ఆ పార్టీ కావలి నియోజకవర్గ ఇన్‌చార్జి అళహరి సుధాకర్ మంగళవారం మంగళగిరి కార్యాలయంలో భేటీ అయ్యారు. సుధాకర్ మాట్లాడుతూ కావలి రాజకీయ పరిణామాలపై క్షుణ్ణంగా అడిగి తెలుసుకున్నారని, జనసేన కార్యక్రమాలపై సంతృప్తి వ్యక్తం చేశారన్నారు. టీడీపీ, బీజేపీ పొత్తు పట్ల ప్రజల్లో స్పందనపై అడిగి తెలుసుకుని మిత్రపక్షాల అభ్యర్థుల గెలుపు కోసం చిత్తశుద్ధితో పనిచేయాలని ఆదేశించారన్నారు. తాను జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జిగా బాధ్యతలు తీసుకుని 5 ఏళ్లు పూర్తయిందని అందుకు సహకరించిన నేతలకు కార్యకర్తలకు పవన్‌కల్యాణ్ అభిమానులకు కృతజ్ఞతలు తెలిపారు.



నాగబాబుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న అళహరి సుధాకర్

అంకమ్మ ఆలయంలో ఇంటూరి రాజేష్ పూజలు



పూజలు అనంతరం నాయకులతో ఇంటూరి రాజేష్

కందుకూరు, మార్చి 19: తెలుగుదేశం పార్టీ నెల్లూరు పార్లమెంటు ఉపాధ్యక్షుడు ఇంటూరి రాజేష్ మంగళవారం కందుకూరు గ్రామదేవత అంకమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పూజారులు ఆయనకు ఘన స్వాగతం పలికి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, రాజేష్ అనుచరులు, కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

లింగసముద్రం, మార్చి 19 : మండలంలోని వీఆర్ కోట సమీపంలోని మన్నేరు వాగు నుంచి ఇసుక అక్రమ రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకొన్నారు. ముందుగా అందిన సమాచారం మేరకు సోమవారం అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో ఎస్సై ఎం బాజీబాబు, సిబ్బందితో దాడి చేసి ఇసుకతో వస్తున్న ట్రాక్టర్‌ను స్థానిక రైసుమిల్లు వద్ద పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.

ప్రైవేట్ ఆసుపత్రుల్లో ఇచ్చే బర్త్ సర్టిఫికెట్ చెల్లదు

వలేటివారిపాలెం, మార్చి 19 : ఇకపై ప్రైవేట్ ఆసుపత్రుల్లో తీసుకునే బిడ్డ బర్త్ సర్టిఫికెట్ చెల్లదని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. 2023 అక్టోబరు 1వ తేది నుంచి ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, జిల్లా ఏరియా ఆసుపత్రి, కమ్యూనిటీ హెల్త్ ఆసుపత్రి, పీహెచ్‌సీల్లో తీసుకునే బర్త్ సర్టిఫికె ట్లు మాత్రమే చెల్లనున్నట్లు తెలిపారు. మున్సిపల్ కార్పొరేషన్‌లో, పంచాయతీలో, మున్సిపాలిటీలలో, ఏ ఇతర ప్రాంతాల్లో బిడ్డ జన్మించినప్పటికీ బర్త్ సర్టిఫికెట్ పైన సూచించిన ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే తీసుకోవాలని తెలిపారు.

ఎక్స్‌కవేటర్ తగిలి ఇద్దరు బాలికలకు తీవ్రగాయాలు

వలేటివారిపాలెం, మార్చి 19 : మండలంలోని చుండి, పోలినేనిచెరువు గ్రామాల సమీపంలోని ప్రధాన రహదారిలో మంగళవారం ఎదురుగా వస్తున్న ఎక్స్‌కవేటర్ తగిలి ఇద్దరు బాలికలకు తీవ్ర గాయాలయ్యాయి. వివరాల మేరకు.. గరుకుపాలెంకు చెందిన చందన, చైత్ర అనే ఇద్దరు బాలికలు మరో యువకుడితో కలసి మోటారు సైకిల్‌పై వలేటివారిపాలెం హైస్కూల్‌కు వెళుతూ చుండి, పోలినేనిచెరువు గ్రామాల సమీపంలో ముందువెళుతున్న వాహనాన్ని అధిగమించే క్రమంలో ఎదురుగా వస్తున్న ఎక్స్‌కవేటర్ తగిలింది. ఈ ప్రమాదంలో గాయపడిన బాలికలను బాలికలను 108 వాహనంలో కందుకూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ఒంగోలు తరలించారు.



గాయపడిన బాలికను 108లో ఆసుపత్రికి తీసుకెళ్తున్న సిబ్బంది

'ప్రజాగళం'లో భద్రత వైఫల్యంపై విచారణ చేట్టాలి : కావ్య

కావలి, మార్చి 19: భారతప్రధాని నరేంద్ర మోదీకి భద్రత కల్పించలేని అధికారులు సామాన్య ప్రజలకు ఏమి రక్షణ కల్పిస్తారని కావలి టీడీపీ అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డి పేర్కొన్నారు. ప్రజాగళం సభ భద్రతా వైఫల్యంపై విచారణ చేట్టాలని, దేశ ప్రధాని భద్రతను గాలికొదిలిన పోలీస్ ఉన్నతాధికారులపై సీఈసీ తక్షణం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మంగళవారం తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ లక్షలాది మంది జనం తోసుకువస్తుంటే నియంత్రించాల్సిన పోలీసులు చోద్యం చూస్తుండటం దేనికి సంకేతమన్నారు. ప్రధాని భద్రత, జనం, ట్రాఫిక్ నియంత్రణ వంటి అంశాలను పోలీస్ బాస్‌లు ఎందుకు పట్టించుకోలేదో చీఫ్ ఎలక్షన్ కమిషన్ సమగ్ర విచారణ జరపాలన్నారు. పోలీసుల వైఫల్యం కారణంగా జనం సభ వద్దకు రాలేక రోడ్లపైనే ఆగిపోవాల్సి వచ్చిందన్నారు.



మహజన కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న కావ్య

మహజన సైన్యం కార్యాలయం ప్రారంభం

పట్టణంలోని 12వ వార్డులో మహజన సైన్యం జాతీయ అధ్యక్షుడు చేవూరు సురేంద్ర ఏర్పాటు చేసిన మహజన సైన్యం కార్యాలయాన్ని మంగళవారం టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా కావ్యకు వారు స్వాగతం పలికి ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేస్తామని చెప్పారు.

మామిడి సాగులో సస్యరక్షణపై రైతులకు అవగాహన

ఉలవపాడు, మార్చి 19 : మామిడి సాగులో తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలపై మండల ఉద్యాన అధికారి బీ.జ్యోతి మంగళవారం రైతులకు అవగాహన కల్పించారు. కరేడు పరిసర ప్రాంతంలో సాగులో ఉన్న మామిడి తోటల్లో ఆమె పర్యటించి రైతులతో సమావేశమయ్యారు. మామిడిపై ఉన్న మంగుమచ్చలకు కారణమైన తామర పురుగు నివారణకు తగిన సూచనలు, పిచకారి చేయాల్సిన పురుగు మందుల వివరాలు తెలిపారు. మామిడి పిందెలు కోడిగుడ్డు సైజులో ఉన్నప్పుడు కాయలపై పగుళ్లు ఏర్పడకుండా, అదేవిధంగా పిందెలు మంచి సైజు రావడానికి లీటరు నీటికి 2మిల్లీ లీటర్ల బోరాన్, 10 గ్రాముల పోటాషియం నైట్రేట్ కలిపి పిచకారి చేయాలని చెప్పారు. లింగాకర్ష బుట్టలు, ఫ్రూట్స్ కవర్లు వాడకం వలన పండు ఈగ నివారణ చేయొచ్చన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ ఉద్యాన సిబ్బంది, స్థానిక రైతులు పాల్గొన్నారు.



మామిడిపై మంగు మచ్చలను చూపిస్తున్న జ్యోతి

26వ వార్డులో టీడీపీ ఇంటింటి ప్రచారం

కందుకూరు, మార్చి 19: పట్టణంలోని 26వ వార్డు తానికొండ వారికొష్టాలు, ఐఎన్ఆర్ గార్డెన్స్ ప్రాంతాలలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఇంటూరి నాగేశ్వరరావు సతీమణి సౌజన్య ఇంటింటి ప్రచారం నిర్వహించారు. టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాల వల్ల ప్రతి కుటుంబానికి జరగబోయే లబ్ధిని ప్రజలకు వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. రాబోయే ఎన్నికల్లో కందుకూరు నియోజకవర్గానికి టీడీపీ, జనసేన, బీజేపీల ఉమ్మడి అభ్యర్థిగా ప్రకటించిన ఇంటూరి నాగేశ్వరరావును ఆదరించి చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి అయ్యేందుకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు రత్తయ్య, ముచ్చు లక్ష్మీరాజ్యం, మర్రిపూడి మల్లికార్జున, వెంకటరమణయ్య, కేశినేని రమేష్, చెన్నారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



ఇంటింటి ప్రచారంలో ఇంటూరి సౌజన్య

ఎన్‌ఎస్ఎస్ వారోత్సవాల ప్రారంభం

కావలిటౌన్, మార్చి 19: విట్స్ ఇంజనీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో మంగళవారం ఎన్ఎస్ఎస్ వారోత్సవాలు ప్రారంభమయ్యా యి. యూనిట్ ప్రోగ్రాం ఆఫీసర్ మధుకర్ పర్యవేక్షణలో జరుగుతున్న వారోత్సవాల్లో భాగంగా పట్టణం, మండలంలోని ప్రాంతాల్లో పచ్చదనం పర్యావరణ పరిరక్షణ, పారిశుధ్య పరిరక్షణ, విద్య, వైద్యం పట్ల అవగాహన కార్యక్రమాలతోపాటు సాంఘి క దురాచారాలపట్ల ప్రజల్లో చైతన్యం తేవడం మూఢ నమ్మకాలను పారదోలడం తదితర సామాజిక సేవాకార్యక్రమాలు నిర్వహించనున్నట్లు డాక్టర్ మధుకర్ తెలిపారు. విట్స్ ప్రిన్సిపాల్ దత్తాత్రేయ శర్మ వారోత్సవాలను ప్రారంభించగా విట్స్ చైర్మన్ దొడ్ల విద్యాధర్‌కుమార్ రెడ్డి ఎన్ఎస్ఎస్ వలంటీర్లను అభినందించారు.

కందుకూరులో భద్రతాదళాల కవాతు

కందుకూరు, మార్చి 19: రానున్న సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా ప్రత్యేక భద్రతా బలగాలు రంగంలోకి దిగాయి. స్థానిక పోలీసులతో కలిసి పట్టణ ఎస్ఐ భాస్కర్ ఆధ్వర్యంలో మంగళవారం కందుకూరులో ప్రత్యేక బలగాలు కవాతు నిర్వహించాయి. గత కొన్నేళ్లుగా కందుకూరులో ప్రత్యేక పోలీసు బలగాలను చూడని స్థానికులు ప్రత్యేక బలగాల కవాతును చూసి అప్పుడే ఎన్నికల వేడి మొదలైందని చర్చించుకున్నారు.



కవాతు నిర్వహిస్తున్న స్పెషల్ పార్టీ పోలీసులు